ప్రభాతనవ
SINGIDI | తెలుగు దినపత్రిక
# సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం site.singidinews.com
శుక్రవారం 7 ఆగస్టు 2026 సంపుటి: 1 సంచిక: 51 పేజీలు 12 వెల: 6.50
Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

## యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు

### బిల్లు ఆమోదించిన లోక్‌సభ

యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు విధించే బిల్లుకు లోక్‌సభ గురువారం ఆమోదం తెలిపింది. పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ యాక్ట్, 2007, సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోద ముద్ర వేసింది.

- న్యూఢిల్లీ (సింగిడి)




2



2

## ఈసారి నేతన్నల కోసం..

ప్రధాని మోదీ మరో వీడియో

### గోదావరి జలాల హక్కుల పరిరక్షణలో

## కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- రేవంత్ రెడ్డి ఒక్కసారి కూడా 'జై తెలంగాణ' అనలేదు: హరీశ్ రావు
- తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉన్నారన్న హరీశ్
- కేసీఆర్ పోరాటం, జయశంకర్ సార్ ఆరాటం వల్లే తెలంగాణ వచ్చిందని వ్యాఖ్య



2

## అనర్హత వేటు భయం

### మళ్లీ బీఆర్ఎస్ వైపు దానం నాగేందర్ చూపు?

- బీఆర్ఎస్ అగ్రనేతలపై ప్రశంసలు కురిపించిన ఎమ్మెల్యే దానం నాగేందర్
- అనర్హత వేటు భయంతోనే తిరిగి బీఆర్ఎస్‌లోకి వెళ్లే ప్రయత్నాలని ఊహాగానాలు
- దానంను తిరిగి చేర్చుకునేది లేదని స్పష్టం చేస్తున్న బీఆర్ఎస్ వర్గాలు



2



## తెలంగాణలో కొత్త రేషన్ కార్డులు

### ఆగస్టు 15న రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ

- సంగారెడ్డిలో లాంఛనంగా ప్రారంభించనున్న ముఖ్యమంత్రి
- అన్ని నియోజకవర్గాల్లో ఏక కాలంలో పంపిణీ కార్యక్రమం
- డెబిట్ కార్డు సైజులో బార్‌కోడ్‌తో రానున్న కొత్త కార్డులు

తెలంగాణ రాష్ట్రంలోని అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఆగస్టు 15న కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించనుంది.

హైదరాబాద్, ఆగస్ట్ 6 (సింగిడి)

2



### అగ్ని-4 బాలిస్టిక్ క్షిపణి పరీక్ష

## విజయవంతం

మధ్యశ్రేణికి చెందిన అగ్ని–4 బాలిస్టిక్ క్షిపణిని భారత్ విజయవంతంగా ప్రయోగించింది. ఒడిశాలోని చాందీపూర్ వద్ద ఉన్న ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ నుంచి విజయవంతంగా ప్రయోగించినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ గురువారం వెల్లడించింది. స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రయోగం విజయవంతం అయ్యిందని తెలిపింది. అన్ని ఆపరేషనల్, టెక్నికల్ పారామీటర్లను విజయవంతంగా అందుకుందని వెల్లడించింది.

- న్యూఢిల్లీ, ఆగస్ట్ 6 (సింగిడి)

2



### చంచల్‌గూడ నుంచి

## అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌కు..

- ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణ రెడ్డి విచారణ
- సహచర ట్రైనీ ఆఫీసర్‌పై లైంగిక వేధింపుల కేసులో ఉదయ్ కృష్ణ రెడ్డి అరెస్ట్
- రెండు రోజుల పోలీస్ కస్టడీకి అనుమతించిన న్యాయస్థానం

2

# క్షుద్ర రాజకీయం

### హరీష్ రావు–మహేష్ గౌడ్ మధ్య క్షుద్రపూజల ఆరోపణల వివాదం

రాజకీయ విమర్శలు విధానాలపై ఉండాలి.. వ్యక్తిగత ఆరోపణలు రాజకీయాలను మరో స్థాయికి తీసుకెళ్లకూడదు. కానీ తెలంగాణలో బీఆర్ఎస్ నేత హరీష్ రావు, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మధ్య సాగుతున్న మాటల యుద్ధం ఇప్పుడు ఆలయాల వరకు చేరింది. హరీష్ రావు తమిళనాడులోని తిరుచ్చి, కర్ణాటకలోని శివమొగ్గ ప్రాంతాల్లోని ఆలయాలను సందర్శించిన అంశాన్ని ప్రస్తావిస్తూ.. తెలంగాణలో వర్షాలు పడకూడదని, కరువు రావాలని కోరుకుంటూ క్షుద్రపూజలు చేశారంటూ కాంగ్రెస్ నేతలు ఆరోపణలు చేయడం రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది. ఈ ఆరోపణలను హరీష్ రావు ఖండిస్తూ.. తన ప్రతిష్టను దెబ్బతీసేలా నిరాధార వ్యాఖ్యలు చేస్తున్నారంటూ లీగల్ నోటీసులు పంపడంతో వివాదం మరింత ముదిరింది.

- (హైదరాబాద్ బ్యూరో-సింగిడి)

- రాజకీయ ఆరోపణలతో ఆలయాలపై వివాదం
- తిరుచ్చి, శివమొగ్గ ఆలయాల పర్యటనలపై రాజకీయ దుమారం
- ఆరోపణలు.. ఖండనలు.. లీగల్ నోటీసులతో ముదిరిన వివాదం



#### ఆలయాల పర్యటన.. రాజకీయ రగడ

హరీష్ రావు గతంలో తిరుచ్చి, శివమొగ్గ తదితర ప్రాంతాల్లో పర్యటించిన విషయాన్ని కాంగ్రెస్ నేతలు ఇప్పుడు రాజకీయంగా తెరపైకి తీసుకొస్తున్నారు. ఆయా ప్రాంతాల్లోని ఆలయాల సందర్శనలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే ఆలయాలను సందర్శించడం, అక్కడ క్షుద్రపూజలు చేశారనే ఆరోపణ చేయడం రెండు వేర్వేరు అంశాలు. కేవలం పర్యటనల ఆధారంగా తీవ్ర ఆరోపణలు చేయడం సరైనదేనా అన్న ప్రశ్న కూడా రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది.

#### క్షుద్రపూజల ఆరోపణలు

తెలంగాణలో వర్షాలు పడకుండా, పంటలు పండకుండా, ప్రజలు ఇబ్బందులు పడాలని కోరుకుంటూ హరీష్ రావు కొన్ని ఆలయాల్లో క్షుద్రపూజలు చేశారంటూ మహేష్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. అయితే ఇవి రాజకీయ ఆరోపణలే తప్ప నిర్ధారిత వాస్తవాలుగా నిర్ధారణ కాలేదు. ఇలాంటి ఆరోపణలకు ఆధారాలు ఏమిటన్నదే ఇప్పుడు కీలకంగా మారింది.

#### లీగల్ నోటీసులతో కౌంటర్

తనపై చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని హరీష్ రావు ఖండించారు. వ్యక్తిగత, రాజకీయ ప్రతిష్టను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేశారంటూ మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు ఇతర కాంగ్రెస్ నేతలకు లీగల్ నోటీసులు పంపించారు. చేసిన ఆరోపణలను వెనక్కి తీసుకుని బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దీంతో ఈ వివాదం రాజకీయ విమర్శల నుంచి న్యాయపరమైన అంశంగా మారింది.

#### రాజకీయాల కోసం ఆలయాలపై మరక

రాజకీయ ప్రత్యర్థులపై విమర్శలు చేయడం సహజమే. కానీ రాజకీయ ప్రయోజనాల కోసం ఆలయాల సందర్శనలను వివాదాస్పద ఆరోపణలతో ముడిపెట్టడం వల్ల ఆలయాలపై కూడా రాజకీయ మరక పడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. భక్తి, విశ్వాసాలకు సంబంధించిన ప్రదేశాలను రాజకీయ ఆరోపణలకు వేదికగా మార్చడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్న ముందుకొస్తోంది. ఆరోపణలు నిజమైతే ఆధారాలతో నిరూపించాలి.. లేకపోతే రాజకీయ విమర్శలను పరిమితుల్లో ఉంచాలన్న వాదన వినిపిస్తోంది.

#### ఇవేం క్షుద్ర రాజకీయాలు?

హరీష్ రావు ఆలయాల పర్యటనలపై కాంగ్రెస్ చేసిన వ్యాఖ్యలు.. వాటిపై హరీష్ రావు ఇచ్చిన లీగల్ కౌంటర్.. ఈ మొత్తం వ్యవహారం ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చకు తెరతీసింది. వర్షాలు, రైతులు, కరువు వంటి సున్నితమైన అంశాలను రాజకీయ విమర్శలకు ఉపయోగించడం కంటే.. ప్రజా సమస్యలపై విధానపరమైన చర్చ జరగాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. చివరకు ఈ ఆరోపణలకు ఆధారాలు బయటకు వస్తాయా.. లీగల్ నోటీసుల వ్యవహారం ఎటు దారి తీస్తుంది.. అన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. రాజకీయాలు ఎంత తీవ్రంగా ఉన్నా.. ఆలయాలను, విశ్వాసాలను వివాదాలకు దూరంగా ఉంచాలన్నదే ఈ మొత్తం వ్యవహారం చెబుతున్న ప్రధాన సందేశం.

### తెలంగాణ ఉద్యమ స్ఫూర్తికి

## చిరునామా జయశంకర్ సార్

### సీఎం రేవంత్ రెడ్డి



తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం జీవితాంతం అహర్నిశలు శ్రమించిన మహనీయుడు, తెలంగాణ ఉద్యమానికి సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్‌ను తెలంగాణ సమాజం ఎప్పటికీ గౌరవంగా స్మరించుకుంటుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు.

- హైదరాబాద్, ఆగస్ట్ 6 (సింగిడి)

2

### అన్ని రోడ్ నెట్‌వర్క్స్

## ఒకే వ్యవస్థ పరిధిలోకి

### హెచ్‌ఎండీఏ అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష

హెచ్‌ఎండీఏ అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ మహానగర భవిష్యత్తు రోడ్ల విస్తరణ, అభివృద్ధి పైనే ఆధారపడి ఉందని సీఎం అన్నారు. అవసరమైన భూ సేకరణ పనులను వేగవంతం చేయాలని, ఇందులో అలసత్వం చూపరాదని అధికారులకు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. "నగరంలోని అన్ని రోడ్ నెట్‌వర్క్‌లను ఒకే వ్యవస్థ పరిధిలోకి తీసుకురావాలి.

- హైదరాబాద్, ఆగస్ట్ 6 (సింగిడి)

## కుదిరిన సయోధ్య

- ఈటల వర్సెస్ సంజయ్ పోరుకు ముగింపు..
- తెలంగాణ బీజేపీలో ఈటల, బండి సంజయ్ మధ్య ఆధిపత్య పోరు
- రెండు వర్గాల పట్టుదల కారణంగా పెండింగ్‌లో పడిన 3 జిల్లాల అధ్యక్షుల నియామకాలు

2




### సైబర్ నేరాల నియంత్రణలో

## తెలంగాణ నంబర్ 1

### పీఎంవో సమీక్షలో వెల్లడి

- 9 కీలక అంశాల ఆధారంగా కేంద్ర హోం శాఖ మూల్యాంకనం
- తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పనితీరుకు ప్రత్యేక ప్రశంసలు
- ఫిర్యాదుల కోసం 1930 నంబర్‌కు డయల్ చేయాలని ప్రజలకు సూచన

2

## ఇకపై 'క్యా బోల్తీ పబ్లిక్'

### సీజేపీ కీలక ప్రకటన

2

విద్యార్థి నిరసనలతో దేశం దృష్టి ఆకర్షించిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కీలక ప్రకటన చేసింది. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు 'క్యా బోల్తీ పబ్లిక్' పేరిట జాతీయస్థాయి ప్రచారం నిర్వహిస్తామని సీజేపీ వెల్లడించింది. ప్రజల ఆందోళనలు, ఆకాంక్షలను అర్థం చేసుకోవడం, అభిప్రాయాలను తీసుకోవడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని స్పష్టం చేసింది. భారతీయ కుటుంబాలకు నాణ్యమైన విద్య రోజురోజుకూ భారంగా మారుతోందని, అందుకే ఆ అంశంపైనే తొలుత తాము దృష్టిసారిస్తామని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తెలిపారు. సెప్టెంబర్ నుంచి ప్రజల్లోకి వెళ్తామని మీడియా వేదికగా తెలియజేశారు.

- న్యూఢిల్లీ, ఆగస్ట్ 6 (సింగిడి)



## స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కండి



### మంత్రులకు లోకేశ్ పిలుపు

స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని మంత్రులకు విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. స్థానిక ఎన్నికల్లో కూటమి జయకేతనం ఎగరేసేలా మంత్రులంతా కష్టపడాల్సి ఉంటుందన్నారు. గురువారం కేబినెట్ సమావేశానికి ముందు మంత్రులతో లోకేశ్ బ్రేక్ ఫాస్ట్ సమావేశం నిర్వహించారు.

అమరావతి, ఆగస్ట్ 6 (సింగిడి)

2



### జగన్ అండ్ కోని

## కంట్రోల్ చేయడం 2 నిముషాల పని

- రాజకీయ ముసుగులో రౌడీయిజం చేస్తున్న వైకాపా
- డిఎస్సీపై కావాలనే నానా యాగీ చేస్తున్నారు
- పొగాకు రైతుల వద్దకు వెళ్లి హంగామా చేశారు
- రైతన్నల పొలాలను ధ్వంసం చేసి..వారిని క్షోభ పెట్టారు
- జగన్ అరాచకాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించాలి
- కేబినెట్‌లో మంత్రులతో సిఎం చంద్రబాబు

2

జగన్ అండ్ కో చేస్తున్న అరాచకాలను కంట్రోల్ చేయడానికి తనకు రెండు నిమిషాలు చాలని సీఎం చంద్రబాబు మంత్రులతో అన్నారు. కానీ రాజకీయ ముసుగులో వారు నేరాలు చేస్తున్నారని ఆగ్రహించారు. డీఎస్సీపై చేస్తున్న రాద్ధాంతాన్ని కూడా అందరూ గమనిస్తున్నారని తెలిపారు.

- అమరావతి, ఆగస్ట్ 6 (సింగిడి)



## సింగరేణి చరిత్రలో మైలురాయి..

### తెలంగాణకు చేరిన 'నైనీ' తొలి బొగ్గు రైలు!

**హైదరాబాద్, ఆగస్ట్ 6 (సింగిడి)**

ఒడిశాలోని నైనీ బొగ్గు గని నుంచి తెలంగాణలోని సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రానికి తొలి బొగ్గు రైలు చేరుకుంది. తెలంగాణ రాష్ట్ర ఇంధన భద్రతలో అత్యంత చారిత్రాత్మక మైలురాయి ఆవిష్కృతమైంది. ఏళ్ల తరబడి కాగితాలకే పరిమితమైన ఒడిశాలోని 'నైనీ' బొగ్గు బ్లాక్, ప్రజా ప్రభుత్వ నిరంతర కృషి ఫలితంగా ఎట్టకేలకు ఆచరణలోకి వచ్చింది. నైనీ గని నుంచి తెలంగాణలోని సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రానికి (STPP) 4,000 టన్నుల నాణ్యమైన బొగ్గుతో కూడిన తొలి రైలు విజయవంతంగా చేరుకుంది. ఒడిశాలోని నైనీ నుంచి బయలుదేరిన ఈ రైలు దాదాపు 1,131 కిలోమీటర్లు ప్రయాణించి తెలంగాణ గడ్డపై అడుగుపెట్టింది. మొత్తం 59 బాక్స్ వ్యాగన్ల ద్వారా అత్యుత్తమ జీ–10 (G–10) గ్రేడ్ నాణ్యమైన బొగ్గును విద్యుత్ కేంద్రానికి తరలించారు. 2015 ఆగస్టు 13న కేంద్ర బొగ్గు శాఖ సింగరేణికి కేటాయించిన ఈ గనిలో సుమారు 340.78 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. ఏడాదికి కోటి టన్నుల (10 మిలియన్ టన్నులు) ఉత్పత్తి సామర్థ్యంతో 36 ఏళ్ల పాటు ఈ గని సేవలు అందించనుంది. ఈ ప్రాజెక్ట్ సాకారమవ్వడం వెనుక ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పర్యవేక్షణ, ఉప ముఖ్యమంత్రి మరియు ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అలుపెరగని కృషి ఉన్నాయి. కేంద్రం, ఒడిశా ప్రభుత్వాల నుంచి అనుమతుల సాధన కోసం భట్టి విక్రమార్క స్వయంగా రెండుసార్లు ఒడిశాలో పర్యటించి అక్కడి ముఖ్యమంత్రి, ఉన్నతాధికారులతో చర్చలు జరిపారు. ఆటంకాలన్నీ తొలగిపోవడంతో 2025 ఏప్రిల్ 16న నైనీ గనిలో వర్చువల్ విధానంలో ఉత్పత్తిని ప్రారంభించగా, తాజాగా తొలి రేక్ తెలంగాణకు చేరుకుంది. నైనీ గని నుంచి నాణ్యమైన బొగ్గు సరఫరా మొదలవ్వడంతో రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తికి ఎలాంటి కొరత ఉండదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ తో పాటు, గృహ, పారిశ్రామిక అవసరాలకు నిరంతర నాణ్యమైన విద్యుత్ అందించాలన్న ప్రభుత్వ సంకల్పానికి ఈ విజయం ఎంతో ఊతమిస్తుందని భావిస్తున్నారు.

## యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు

ఎలాంటి చర్చ లేకుండానే ఈ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. యూపీఐ లావాదేవీలపై బ్యాంకులు, పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్స్ ఛార్జీలు విధించేందుకు ఈ చట్టం అవకాశం కల్పిస్తుంది. దీని ద్వారా ఇప్పటివరకు యూపీఐ, ఇతర ఎలక్ట్రానిక్ పేమెంట్లపై వ్యాపారులకు బ్యాంకులు అందిస్తున్న మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) రద్దవుతుంది. ఇంతకుముందు ఆర్టీజీఎస్, నెఫ్ట్ లావాదేవీలపైనే ఛార్జీలు ఉండేవి. యూపీఐ లావాదేవీలపై ఎలాంటి ఛార్జీలు లేవు. కానీ, ఇకపై యూపీఐ ట్రాన్సాక్షన్స్‌పై కూడా ఛార్జీలు విధిస్తారు. టాక్సేషన్ అండ్ అదర్ లాస్ (అమెండ్‌మెంట్) బిల్, 2026 పేరిట రూపొందిన ఈ బిల్లును కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు కోసం పేమెంట్స్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ యాక్ట్, 2007 బిల్లు, ద ఇన్‌కం ట్యాక్స్ యాక్ట్ 2025 బిల్లు, ద ఫైనాన్స్ యాక్ట్, 2026 బిల్లులకు సవరణలు చేశారు. దీని ద్వారా భవిష్యత్‌లో ఎలక్ట్రానిక్ పేమెంట్లపై ఛార్జీలు వసూలు చేస్తారు. ఏ తరహా పేమెంట్‌పై ఎంత ఛార్జీ అనేది నోటిఫికేషన్ ద్వారా ప్రకటిస్తారు. బ్యాంకులకు, పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్స్‌కు, పేమెంట్స్ విధానాన్ని నిర్వహించే సంస్థలకు స్థిరమైన ఆదాయం అందాలనే ఉద్దేశంతో ఈ చట్టం తీసుకొచ్చినట్లు కేంద్రం తెలిపింది. ప్రస్తుతం క్రెడిట్ కార్డులు, డెబిట్ కార్డుల ద్వారా చేసే చెల్లింపులకు మాత్రమే వ్యాపార సంస్థలు పరిమిత ఫీజు చెల్లిస్తున్నాయి. యూపీఐ లావాదేవీలపై వ్యాపార సంస్థలు ఎలాంటి ఛార్జీలు లేవు. కానీ, కొత్త చట్టం ద్వారా యూపీఐ లావాదేవీలపై కూడా వ్యాపారులు ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ కొత్త చట్టం ఇప్పటికిప్పుడు అమలులోకి రాకపోవచ్చు. దీనికి సంబంధించిన నిబంధనలపై పూర్తి స్పష్టత రావాల్సి ఉంది. ప్రస్తుతం జరుగుతున్న ప్రచారం ప్రకారం.. ఈ ఛార్జీలు వినియోగదారులు చెల్లించాల్సిన అవసరం లేదు. వ్యాపారులే చెల్లించాలి. అది కూడా వార్షిక టర్నోవర్ రూ.1.5 కోట్లు దాటిన వ్యాపారులు మాత్రమే స్వల్ప మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. ఇక, ఈ బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందాలి. తర్వాత రాష్ట్రపతి అంగీకారం తెలపాలి. ఆ తర్వాత ఈ బిల్లు చట్టంగా అమలులోకి వస్తుంది. దీనికి మరికొంత సమయం పడుతుంది.

## తెలంగాణ ఉద్యమ స్ఫూర్తికి చిరునామా జయశంకర్ సార్

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం జీవితాంతం అహర్నిశలు శ్రమించిన మహనీయుడు, తెలంగాణ ఉద్యమానికి సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్‌ను తెలంగాణ సమాజం ఎప్పటికీ గౌరవంగా స్మరించుకుంటుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. ఆగస్టు 6న ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా ఆ మహనీయులు తెలంగాణ స్వరాష్ట్ర సాధనకు ఆయన అందించిన విశిష్ట సేవలను ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు. తెలంగాణ స్వప్నాన్ని ఉచ్ఛ్వాస నిశ్వాసలుగా మార్చుకుని చివరి శ్వాస వరకు ఉద్యమించిన మహోన్నత వ్యక్తి జయశంకర్ సార్ అని సీఎం అన్నారు. తెలంగాణే ధ్యేయంగా, తెలంగాణే లక్ష్యంగా ఆ మహనీయుడు తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో తెలంగాణ ప్రాంతానికి జరిగిన అన్యాయాలను, ప్రజలు ఎదుర్కొన్న వివక్షను గణాంకాలతో సహా దేశానికి వివరించి, ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని ఆరు దశాబ్దాల పాటు సజీవంగా నిలిపిన ఘనత ప్రొఫెసర్ జయశంకర్ సార్‌కే దక్కుతుందని ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణ ఉద్యమానికి ఆయన అందించిన సిద్ధాంత బలం, దిశానిర్దేశం చిరస్మరణీయమని, ఆయన ఆశయాల సాధనకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని అన్నారు.

## సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ నంబర్ 1

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 6 (సింగిడి)**

సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో) 'ప్రగతి' సమీక్షలో భాగంగా దేశవ్యాప్తంగా నిర్వహించిన మూల్యాంకనంలో ఈ విషయం వెల్లడైంది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ దేశంలోని అన్ని రాష్ట్రాల సైబర్ సెక్యూరిటీ బ్యూరోల పనితీరును తొమ్మిది కీలక పారామితుల ఆధారంగా విశ్లేషించి ఈ ర్యాంకును ఖరారు చేసింది. స్టేట్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ ఏర్పాటు, ఇ–జీరో ఎఫ్ఐఆర్ అమలు, గ్రీవెన్స్ రిడ్రెస్సల్ మాడ్యూల్ బాధితులకు తిరిగి నగదు ఇప్పించేందుకు మనీ రిస్టోరేషన్ మాడ్యూల్ వినియోగం, సహ్యోగ్–సమన్వయ పోర్టళ్ల వాడకం, సైబర్ క్రైమ్ హాట్‌స్పాట్‌ల పర్యవేక్షణ, సామర్థ్య పెంపుదల వంటి కార్యక్రమాల్లో కనబరిచిన అత్యుత్తమ పనితీరు ఆధారంగా తెలంగాణ ఈ ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. దేశంలోనే తొలిసారిగా S4C కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో పాటు, ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ పరిధిలోని కేంద్ర వేదికలను అత్యంత సమర్థవంతంగా వినియోగించుకుంటున్నందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ప్రత్యేక ప్రశంసలు అందుకుంది. ప్రజలు ఎలాంటి సైబర్ మోసానికి గురైనా వెంటనే 1930 నంబర్‌కు డయల్ చేయాలని లేదా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని టీజీసీఎస్‌బీ సూచించింది. ఫిర్యాదుల పరిష్కారం, నష్టపోయిన డబ్బును తిరిగి పొందడంలో బాధితులకు సహాయం చేసేందుకు ప్రత్యేకంగా 87126 65600 అనే హెల్ప్‌లైన్ నంబర్‌ను కూడా అందుబాటులోకి తెచ్చినట్లు వెల్లడించింది. పోలీసింగ్‌లో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడం, సైబర్ బాధితులకు వేగంగా అండగా నిలవడం వంటి నిరంతర చర్యలే తెలంగాణకు ఈ ఘనతను సాధించిపెట్టాయి.

# జగన్ అండ్ కోని కంట్రోల్ చేయడం 2 నిముషాల పని

జగన్ అండ్ కో చేస్తున్న అరాచకాలను కంట్రోల్ చేయడానికి తనకు రెండు నిమిషాలు చాలని సీఎం చంద్రబాబు మంత్రులతో అన్నారు. కానీ రాజకీయ ముసుగులో వారు నేరాలు చేస్తున్నారని ఆగ్రహించారు. డీఎస్సీపై చేస్తున్న రాద్ధాంతాన్ని కూడా అందరూ గమనిస్తున్నారని తెలిపారు. అన్ని విషయాలు డీఎస్సీపై మనం ప్రజలకు వివరించామని అన్నారు. వైసీపీ నేతలు కోర్టులతో కూడా చీవాట్లు పడ్డారని విమర్శించారు. చంద్రబాబు నాయుడు అధ్యక్షతన గురువారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి మండలి సమావేశం జరిగింది. ఈ కేబినెట్ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులకు సీఎం దిశా నిర్దేశం చేశారు. మూడున్నర గంటల పాటు ఆయా అంశాలపై ముఖ్యమంత్రి చర్చించారు. స్థానిక ఎన్నికలకు మంత్రులు, కూటమి నేతలు సిద్ధంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. కోర్టుల చీవాట్లు పెట్టినా వైసీపీ నేతలు యాగీ చేస్తున్నారని ఆగ్రహించారు. డీఎస్సీపై వైసీపీ నేతలు ఇప్పుడు ధర్నాలు చేయడం ఏంటని సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. వైసీపీ నేతలకు అసలు రిజర్వేషన్ల గురించి తెలియదని విమర్శించారు. డీఎస్సీలో హారిజాంటల్, వర్టికల్ రిజర్వేషన్లపై.. అందరికీ తెలపాల్సిన బాధ్యత మంత్రులదేనని ఆదేశించారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిన్న దేవరపల్లిలో పర్యటన సందర్భంగా రైతన్నల పొలాలను గొడ్డలి పార్టీ శ్రేణులు నాశనం చేశాయని ధ్వజమెత్తారు. ఓ మహిళ చిరు వ్యాపారి పొట్టగొట్టడంతో పాటు హిందూ దేవుళ్ల చిత్ర పటాలు పగలకొట్టడం ఆక్షేపణీయమని అన్నారు. పొగాకు బేళ్లను తొక్కి నాశనం చేసి పరామర్శ ముసుగు తగిలించుకున్నారని ఆగ్రహించారు. అనేకమంది రైతులు తనకు మెసేజ్‌లు పంపారని తెలిపారు. తమ పంట దెబ్బతిందని అన్నదాతలు తనకు వివరించారని అన్నారు. చివరకు జగన్ పరామర్శలు అంటే జనం భయపడే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. ఈ నెలాఖరుకు వెలుగొండ ప్రాజెక్ట్‌ను ప్రారంభిస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. ప్రకాశం జిల్లా ప్రజలకు తాగునీటి కోసం నీళ్లు ఇస్తామని వెల్లడించారు. ఎల్‌నినో గురించి మంత్రులు ప్రజలకు తెలపాలని సూచించారు. ఇంత వర్షాభావం ఉన్న కూడా మంచినీటికి కూడా మనం నీళ్లు ఇస్తున్నామనేది ప్రజలకు వివరించాలని అన్నారు. భోగాపురం విమానాశ్రయం ప్రారంభం సందర్భంగా తొలిసారి థింసా గిరిజన నృత్యానికి గిన్నిస్ రికార్డు వచ్చిందని ప్రస్తావించారు. ఈ ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవం ఉత్తరాంధ్ర ప్రజల్లో ఓ సెంటిమెంట్‌ను తీసుకువచ్చిందని తెలిపారు. తమ ప్రభుత్వంలో ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు. అక్కడ ల్యాండింగ్ కూడా సముద్రం మీద నుంచి వచ్చే విధంగా ఏర్పాటు చేశామని వివరించారు. స్వర్ణాంధ్ర, వికసిత భారత్ ఈ రెండు స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా మంత్రుల ప్రసంగాల్లో ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. క్వాంటం వ్యాలీ జనవరిలో ప్రారంభమవు తుందని ప్రకటించారు. 'దిశా' అనేది అసలు చట్టం రూపం నోచుకోలేదని సీఎం తెలిపారు. అయినా 'దిశా' పోలీస్ స్టేషన్లు, వాహనాలని చెప్పి హడావుడి చేశారని దుయ్యబట్టారు. 'దిశా' చట్టం అని పంపితే కేంద్రప్రభుత్వం తిరస్కరించి వెనక్కు పంపిందని ప్రస్తావించారు. రాజకీయ పార్టీల ముసుగులో క్రిమినల్స్ తయారవుతున్నారని మండిపడ్డారు. ప్రశాంతంగా ఉండే జిల్లాల్లో శాంతిభద్రతల సమస్యను సృష్టిస్తున్నారని దుయ్యబట్టారు. జగన్ మీటింగ్ అంటే లైసెన్స్ ఇచ్చినట్లుగా మందు తాగించి ప్రజలను తరలిస్తున్నారని ధ్వజమెత్తారు. గంజాయి బ్యాచ్‌ను జెన్ జీ అని చెప్పుకోవడం గొడ్డలి పార్టీకే చెల్లిందని ఎద్దేవా చేశారు. పొగాకు రైతులకు కూటమి ప్రభుత్వం చేస్తున్న లబ్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతను మంత్రులే తీసుకోవాలని ఆదేశించారు. ఆక్వా రైతులకు ఆక్వాజోన్, నాన్ ఆక్వాజోన్ అనే తేడా లేకుండా రూ.1100కోట్లు విద్యుత్ రాయితీలు ఇచ్చామని ప్రస్తావించారు. ఆక్వా ఫీడ్ ఎక్స్‌పోర్ట్ 50శాతం తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసిందని తెలిపారు. అగ్రిగోల్డ్ అంశంపై కేబినెట్‌లో సీఎం చంద్రబాబు సుదీర్ఘంగా చర్చించారు. అగ్రిగోల్డ్ వ్యవహారంలో కేబినెట్ సబ్ కమిటీ చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. అగ్రిగోల్డ్ బాధితులు 11 రాష్ట్రాల్లో ఉన్నారని చెప్పారు. అగ్రిగోల్డ్ బాధితులకు సాధ్యమైనంతవరకు త్వరగా పరిష్కారం చూపాలని ఆదేశించారు.

# తెలంగాణలో కొత్త రేషన్ కార్డులు

సంగారెడ్డి వేదికగా జరగనున్న రాష్ట్రస్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పంపిణీని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమం వివరాలను నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ముఖ్యమంత్రి ఇప్పటికే ఆమోదించారని ఆయన తెలిపారు. ఆగస్టు 15న మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల మధ్య రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏకకాలంలో కార్డుల పంపిణీ ప్రక్రియ కొనసాగుతుంది. జిల్లా యంత్రాంగం, పౌర సరఫరాల శాఖల సమన్వయంతో రెవెన్యూ డివిజనల్ అధికారులు (ఆర్డీవోలు) ఈ పంపిణీని పర్యవేక్షిస్తారు. లబ్ధిదారుల తుది జాబితాలను సిద్ధం చేసి, పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. నూతనంగా రూపకల్పన చేసిన ఈ రేషన్ కార్డులు లామినేషన్‌తో డెబిట్ కార్డు తరహాలో సౌకర్యవంతంగా ఉంటాయి. ప్రస్తుతం అమల్లో ఉన్న కార్డుల్లా కాకుండా, వీటిపై కుటుంబ సభ్యుల ఫొటోలు, పేర్లకు బదులుగా ఒక విశిష్ట సంఖ్య, బార్‌కోడ్ మాత్రమే ఉంటాయి. ఈ బార్‌కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా లబ్ధిదారులకు సంబంధించిన పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో పొందవచ్చు. నూతనంగా అర్హత పొందిన కుటుంబాలకు సంపూర్ణ ఆహార భద్రత కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం.

## చంచల్‌గూడ జైలు నుంచి అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌కు..

**హైదరాబాద్, ఆగస్ట్ 6 (సింగిడి)**

సహచర ట్రైనీ ఐపీఎస్ అధికారిణిపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ట్రైనీ ఐపీఎస్ ఎం. ఉదయ్ కృష్ణ రెడ్డిని నేడు హైదరాబాద్ పోలీసుల ఉమెన్ సేఫ్టీ వింగ్ అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు. రెండు రోజుల పాటు విచారించేందుకు కోర్టు అనుమతి ఇవ్వడంతో చంచల్‌గూడ సెంట్రల్ జైలులో ఉన్న అతడిని అదుపులోకి తీసుకుని అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ లావణ్య నాయక్ నేతృత్వంలోని బృందం ఉదయ్ కృష్ణ రెడ్డిని విచారిస్తోంది. రేపు కూడా ఈ విచారణ కొనసాగనుంది. ఈ కస్టడీ విచారణలో కేసుకి సంబంధించి మరిన్ని కీలక ఆధారాలు లభిస్తాయని పోలీసులు భావిస్తున్నారు. జులై 29న అరెస్ట్ అయిన ఉదయ్ కృష్ణ రెడ్డికి న్యాయస్థానం 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో అప్పటి నుంచి చంచల్‌గూడ జైలులో ఉంటున్నాడు. హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీ (ఎస్‌వీపీఎన్‌పీఏ)లో తనతో పాటు శిక్షణ పొందుతున్న మహిళా అధికారిణి జులై 18న ఉదయ్ కృష్ణ రెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అత్తాపూర్ పోలీసులు భారతీయ న్యాయ సంహిత, ఐటీ చట్టంలోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. 2025 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఉదయ్ కృష్ణ రెడ్డి, గతంలో ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా పనిచేశాడు. బాధితురాలితో అతనికి 2025 మధ్యలో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం ఏర్పడింది. లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ (ఎల్‌బీఎస్‌ఎన్‌ఏఏ), ఎస్‌వీపీఎన్‌పీఏలో శిక్షణ సమయంలో వారి మధ్య సంబంధం కొనసాగింది. అయితే, తరచూ గొడవలు, భావోద్వేగ బ్లాక్‌మెయిలింగ్, అనుమానం వంటివి చోటుచేసుకున్నాయి. కొంతకాలం తర్వాత బాధితురాలు అతనితో సంబంధాన్ని తెంచుకుని మరొకరిని వివాహం చేసుకోవడంతో ఉదయ్ కృష్ణ రెడ్డి ఆమెను బెదిరించడం ప్రారంభించాడు. తమ వ్యక్తిగత చాట్‌లను బయటపెడతానని బెదిరించాడు. ఆత్మహత్య చేసుకుంటానని, ఆయుధాలు చూపించి భయపెట్టడం, ఆమె ల్యాప్‌టాప్‌ను పగలగొట్టడం, సోషల్ మీడియాలో నకిలీ ఖాతాలు సృష్టించడం వంటి చర్యలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. దర్యాప్తులో భాగంగా, నిందితుడికి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మరో మహిళతో కూడా సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు పోలీసులు కొత్త ఆధారాలు సేకరించారు. ఈ రెండు రోజుల విచారణలో ఈ కొత్త కోణంపై పోలీసులు మరింత సమాచారం రాబట్టే అవకాశం ఉంది.

## స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కండి

స్థానిక సంస్థల్లో మెజారిటీ స్థానాలను కూటమి అభ్యర్థులు కైవసం చేసుకోవాలన్నారు. ఈ ఎన్నికలు అనుకున్న సమయానికే జరుగుతాయని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ చేసిన విధ్వంసం, కూటమి ప్రభుత్వం గాడిలో పెట్టిన తీరును అందరికీ తెలియాలని చెప్పారు. ప్రతి ఇంటి వద్దా కనీసం 3 నిమిషాలైనా ఉండి వివరించాలంటూ మంత్రులకు దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీలో చర్చించాల్సిన అంశాలపై లోకేశ్ వద్ద మంత్రులు చర్చించారు. ఎల్‌నినో పరిస్థితులను ప్రజలకు అసెంబ్లీ వేదికగా వివరిద్దామని మంత్రి తెలిపారు. జలాశయాల్లోకి వరద రావడం కాస్త ఊరటనిచ్చే అంశమని చెప్పుకొచ్చారు. తొలి ప్రాధాన్యం తాగునీరు, ద్వితీయ ప్రాధాన్యం పశుగ్రాసానికి ఇవ్వాలని సూచించారు. ప్రజా సమస్యలపై చర్చించి పరిష్కారానికి అసెంబ్లీని వేదిక చేసుకుందామని మంత్రులకు లోకేశ్ వివరించారు.



## గోదావరి జలాల హక్కుల పరిరక్షణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

సిద్దిపేటలో ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సిద్దిపేట ప్రాంతంతో జయశంకర్ కు ప్రత్యేక అనుబంధం ఉండేదని గుర్తుచేసుకున్న ఆయన... కేసీఆర్ పోరాటం, జయశంకర్ సార్ ఆరాటం వల్లే తెలంగాణ కల సాకారమైందని వ్యాఖ్యానించారు. నాడు ఉద్యమంలో ఏనాడూ పాల్గొనని వ్యక్తి ఈరోజు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నారని... రేవంత్ ఒక్కసారి కూడా 'జై తెలంగాణ' అని అనలేదని విమర్శించారు. గోదావరి నదీ జలాల హక్కుల పరిరక్షణలో కాంగ్రెస్ సర్కార్ ఘోరంగా విఫలమైందని హరీశ్ రావు ఆరోపించారు. కేసీఆర్ హయాంలో 380 టీఎంసీల నీటిని హక్కుగా సాధిస్తే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో ఒక్క ప్రాజెక్టుకూ అనుమతి తీసుకురాకపోగా సాధించుకున్న అనుమతులను కూడా రద్దు చేసేలా గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు అజెండా రూపొందుతోందని మండిపడ్డారు. దేశ చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా అనుమతులు వచ్చిన ప్రాజెక్టులను పునఃసమీక్షించి రద్దు చేయాలనే అంశం అజెండాలోకి రావడం దుర్మార్గమన్నారు. ఏపీ నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్టుతో పాటు సమ్మక్క–సారక్క ప్రాజెక్టు 47 టీఎంసీల క్లియరెన్స్ విషయంలో రేవంత్ ప్రభుత్వం ఏపీ సర్కార్‌తో లోపాయికారీ ఒప్పందం చేసుకుందని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి జీఆర్ఎంబీ అజెండాను మార్పించాలని, లేని పక్షంలో ఆ సమావేశాన్ని తక్షణమే బహిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.



## ఈసారి నేతన్నల కోసం..

### ప్రధాని మోదీ మరో వీడియో

ఆగస్టు నేడు జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. స్నేహితుల దినోత్సవాన్ని ఎంత ఉత్సాహంగా నిర్వహించుకున్నారో అంతే ఉత్సాహాన్ని చేనేత దినోత్సవంపైనా చూపాలని ప్రజలను కోరారు. చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా.. దేశంలోని నేతన్నల కుటుంబాలకు మద్దతివ్వాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియోను పోస్టు చేశారు. స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా, బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా 1905, ఆగస్టు 7న ప్రారంభమైన స్వదేశీ వస్తువుల వినియోగం ఉద్యమాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ ఉద్యమం దేశ ప్రజలను ఏకం చేసి, ఆత్మనిర్భరతకు ప్రతీకగా నిలిచిందన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని చేనేత కార్మికులను గౌరవించేందుకు ఓ అవకాశంగా భావించాలని, కనీసం ఒక్క ఉత్పత్తినైనా కొనుగోలు చేసి వారికి మద్దతు పలకాలని దేశ ప్రజలకు పిలుపునిచ్చారు.



## అన్ని రోడ్ నెట్‌వర్క్స్ ఒకే వ్యవస్థ పరిధిలోకి

భూసేకరణ, రుణాలు, రోడ్ల నిర్వహణ.. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్, ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లకు ఒకటే వ్యవస్థ ఉండాలి. ఓఆర్ఆర్‌పై ఎక్కడపడితే అక్కడ వాహనాలను నిలపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఔటర్ రింగ్ రోడ్డు గుత్తేదారు నిర్లక్ష్యంగా ఉన్నాడు. ఓఆర్ఆర్ నిర్వహణను ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షణ చేయాలి. ప్రభుత్వం సేకరించిన భూములకు మాత్రమే టీడీఆర్ అమలు చేయాలి. ఈ ప్రక్రియను మొత్తం ఆన్‌లైన్ చేయాలి. రేడియల్ రోడ్ల నిర్మాణం వేగవంతం చేయాలి. కొంగరకలాన్ – ఫ్యూచర్‌సిటీ రేడియల్ రోడ్డు డిసెంబర్ 9లోపు పూర్తి చేయాలి. ల్యాండ్ పూలింగ్‌లో మధ్యవర్తుల జోక్యాన్ని సహించవద్దు'' అని అన్నారు. సమావేశంలో హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

## కుదిరిన సయోధ్య

తెలంగాణ బీజేపీలో గత కొంతకాలంగా ఆధిపత్య పోరుతో తీవ్ర ఉత్కంఠ రేపిన మూడు జిల్లాల అధ్యక్షుల పీటముడి ఎట్టకేలకు వీడింది. పార్టీ కీలక నేతలు ఈటల రాజేందర్, బండి సంజయ్ వర్గాల నడుమ పట్టుదల కారణంగా పెండింగ్‌లో పడిన కరీంనగర్, వికారాబాద్, మేడ్చల్ (అర్బన్) జిల్లాల అధ్యక్షుల స్థానాలను భర్తీ చేస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఇరువర్గాల ముఖ్య నేతల మధ్య సుదీర్ఘంగా సాగిన చర్చల అనంతరం సయోధ్య కుదరడంతో... కరీంనగర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా సాయి మల్లేశం, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడిగా యూ. రమేశ్, అలాగే మేడ్చల్ (అర్బన్) జిల్లా అధ్యక్షుడిగా గిరివర్ధన్ రెడ్డిలను ఎంపిక చేశారు. అన్ని వర్గాలకూ ఆమోదయోగ్యమైన అభ్యర్థులకే పగ్గాలు అప్పగిస్తూ రాష్ట్ర నాయకత్వం ఈ కీలక నిర్ణయం తీసుకోవడంతో బీజేపీ శ్రేణుల్లో జోష్ నెలకొంది.

# ఇకపై 'క్యా బోల్తీ పబ్లిక్'

''ఒకటో తరగతికే ఫీజులు రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షల వరకు చెల్లించాల్సి వస్తోంది. కొన్ని పాఠశాలల్లో ఇంకా ఎక్కువే ఫీజులు ఉంటున్నాయి. మధ్యతరగతి కుటుంబాలు ఆ మొత్తాన్ని ఎలా భరిస్తాయి. ఈ ఖర్చుల వల్ల ప్రజలు అప్పులు చేయాల్సిన పరిస్థితి వస్తోంది. ఆ భారం తగ్గాలని మా పార్టీ కోరుకుంటోంది. తల్లిదండ్రులు పిల్లలకు ఉన్నత విద్య అందించాలనుకున్నప్పుడు దానిని వారు భారంగా భావించకూడదు.రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ చెప్పిన ప్రకారం.. విద్య ప్రాథమిక హక్కు. గత కొన్నేళ్లుగా అది ఒక వ్యాపారంగా మారిపోయింది'' అని దీప్కే ఆందోళన వ్యక్తంచేశారు. తమ ప్రచారంలో పాల్గొనాలనుకునేవారు అధికారిక క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేయాలని సూచించారు. ఆ క్యూఆర్ కోడ్‌లను మీడియా సమావేశంలో ప్రదర్శించారు. సభ్యత్వం పూర్తిగా ఉచితమని చెప్పారు. మోసపూరిత చెల్లింపు అభ్యర్థనల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వ్యవస్థలు ప్రజలకు జవాబుదారీగా ఉండేలా... ఒత్తిడి తెచ్చే సంస్థగా సీజేపీ పనిచేస్తుందని అభిజీత్ దీప్కే పేర్కొన్నారు. ''రాజకీయ పార్టీల పరిస్థితి దారుణంగా ఉంది. ప్రజలు ఉదయం ఒక పార్టీకి ఓటేస్తే సాయంత్రంకల్లా మరో పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది'' అని ఆయన అన్నారు.

తమ దేశంలోని విద్యుత్తు గ్రిడ్లు, వంతెనలు, పౌర మౌలిక సదుపాయాలపై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు ప్రారంభిస్తే చూస్తూ ఊరుకోబోమని ఇరాన్ స్పష్టం చేసింది. మొత్తం పశ్చిమాసియా ప్రాంతాన్ని అగ్నిగుండంగా మార్చేస్తామని హెచ్చరించింది. ఇక,



హర్మూజ్‌లో సమన్వయంపై ఒమన్‌తో అంగీకారానికి వచ్చినట్లు ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ వెల్లడించారు. మూడో పక్షం (అమెరికాను ఉద్దేశిస్తూ) జోక్యం లేకుంటే త్వరలో సంయుక్త ప్రకటన విడుదల చేస్తామని తెలిపారు. దీంతో ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధి తిరిగి పూర్తిగా తెరుచుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

మరోవైపు పశ్చిమాసియాలోని పరిణామాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పందించారు. ఇరాన్‌తో చర్చల ద్వారానే సమస్యను పరిష్కరించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. అయితే, ఆ దేశం అణ్వాయుధాలు తయారు చేసేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని పునరుద్ఘాటించారు. తమ సైనిక చర్యలతో టెహ్రాన్ బలహీనపడిందన్నారు. ప్రస్తుతం చర్చలు సానుకూలంగా సాగుతున్నాయన్నారు. వెనెజువెలాతో అనుసరించిన విధానాన్నే ఇరాన్ విషయంలోనూ అమలు చేస్తున్నామని ట్రంప్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. అమెరికాను ఇప్పుడు టెహ్రాన్ గౌరవిస్తోందని... తమ చర్యలు ఫలించాయని వ్యాఖ్యానించారు.

ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీని సంప్రదించడం ప్రస్తుతం చాలా కష్టంగా ఉందని ఆ దేశ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ తెలిపారు. ఇటీవల మొజ్తాబాతో అత్యంత రహస్య ప్రాంతంలో అధ్యక్షుడు భేటీ అయినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో ఖమేనీ ముఖాన్ని కూడా పెజెష్కియాన్ చూడలేదని కథనాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో ఇరాన్ అధ్యక్షుడి తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అయితే ఖమేనీ నేతృత్వంలోని కొత్త నాయకత్వం కారణంగానే తమ దేశం ఇంకా బలంగా ఉందని పెజెష్కియాన్ వ్యాఖ్యానించారు.

ప్రభాతనవ సింగిడి తెలుగు దినపత్రిక ప్రతి రంగూ ఓ నిజం Singidi శుక్రవారం 07-8-2026

## కొత్తగడి బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



**వికారాబాద్, ఆగస్టు 6 (సింగిడి):** జిల్లా కేంద్రం పరిధిలోని కొత్తగడి బాలికల గురుకుల పాఠశాలను గురువారం జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలోని టీ డబ్ల్యూ ఆర్ ఎస్ గురుకుల పాఠశాల, కళాశాలపై అధిక సంఖ్యలో ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్, పలువురు విద్యార్థులు టీసీలు ఎందుకు తీసుకున్నారని ప్రశ్నిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు మధ్యలోనే చదువు మానేయడం లేదా ఇతర విద్యాసంస్థలకు వెళ్లే పరిస్థితులు ఎందుకు ఏర్పడ్డాయో సమగ్రంగా సమాచారం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల ప్రవేశాలు, హాజరు, డ్రాపౌట్‌లు, టీసీల జారీకి సంబంధించిన రిజిస్టర్ లను పరిశీలించారు. విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్య, వసతి, భోజనం తదితర అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడం, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడం అధికారుల బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. ఫిర్యాదులకు కారణమైన అంశాలపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పాఠశాలలో విద్యార్థినులకు అందుతున్న విద్య, వసతి, ఆహార నాణ్యత, పారిశుద్ధ్యం, తాగునీటి సౌకర్యాలు, హాస్టల్, వంటశాల, తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మమేకమై వారి విద్యాభ్యాసం, ఆరోగ్యం, వసతి, మెనూ ప్రకారం భోజనం ఉండాలని, భోజన నాణ్యతపై ఆరా తీశారు. కిచెన్, స్టోర్ రూమ్, టాయిలెట్స్, పరిశీలించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలు ప్రతి విద్యార్థినికి అందేలా అధికారులు, సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. అదేవిధంగా జిల్లా కలెక్టర్ ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు లెక్చరర్ గా మారి లెక్కలు బోధించి వారితో సమాధానాలు చెప్పించారు. పాఠశాలలో ఎలాంటి లోపాలు ఉన్నా వెంటనే పరిష్కరించి, విద్యార్థినులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ తనిఖీలో ట్రైని కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూర్, కళాశాల ప్రిన్సిపాల్ సాయిలత, ఎస్సి వెల్ఫేర్ అధికారి జయపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్

**కలెక్టర్ ప్రతీక్ జైన్**
**కలెక్టరేట్‌లో ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు**





**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 6 (సింగిడి):** తెలంగాణ రాష్ట్ర సాధనను జీవిత లక్ష్యంగా చేసుకుని, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి సైద్ధాంతిక బలాన్ని అందించి, తన జీవితాన్ని తెలంగాణ ప్రజల హక్కుల కోసం అంకితం చేసిన మహనీయుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని, ఆయన ఆశయాలు భావితరాలకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా ఉంటాయని పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలకు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు సంగీత, పాండుతో కలిసి హాజరై ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ, తెలంగాణ ప్రజల ఆకాంక్షలను, ప్రత్యేక రాష్ట్ర అవసరాన్ని చారిత్రక, సామాజిక, ఆర్థిక ఆధారాలతో ప్రపంచానికి వివరించిన దార్శనికుడు ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. విద్యావేత్తగా, ఆర్థిక వేత్తగా, ఉద్యమకారుడిగా ఆయన చేసిన సేవలు తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోతాయని తెలిపారు. అదనపు కలెక్టర్ సంగీత మాట్లాడుతూ, జయశంకర్ ఉద్యమ నాయకుడిగానే కాకుండా తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహా మేధావి అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర భవిష్యత్‌కు సైద్ధాంతిక దిశానిర్దేశం చేసిన ఆయన రచనలు, ఉపన్యాసా లు, పరిశోధనలు ఉద్యమానికి అపారమైన మేధో బలాన్ని అందించాయని పేర్కొన్నారు. విద్యారంగంలో ఆయన చేసిన సేవలు, సమానత్వం, ప్రాంతీయ న్యాయం, సామాజిక చైతన్యంపై చేసిన అధ్యయనాలు నేటి యువతకు మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. అదనపు కలెక్టర్ పాండు మాట్లాడుతూ, ప్రొఫెసర్ జయశంకర్ చూపిన విలువలు, ప్రజల పట్ల ఆయనకున్న నిబద్ధత ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి స్ఫూరిదాయ కమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబ డిన తరగతుల అభివృద్ధి అధికారి జగదీష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ మైనారిటీ సెల్ వైస్ చైర్మన్‌గా దస్తగిరి ఖాన్ నియామకం

**కొలను హనుమంత రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్న దస్తగిరి ఖాన్**



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 6 (సింగిడి):** మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ వైస్ చైర్మన్‌గా దస్తగిరి ఖాన్ నియమితులైన సందర్భంగా గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్‌రెడ్డి గారిని ఆయన నివాసంలో కలిసి నియామక పత్రాన్ని అందుకున్నారు. అనంతరం దస్తగిరి ఖాన్, హన్మంతారెడ్డిని శాలువాతో సత్కరించి ఆశీస్సులు పొందారు. హన్మంత రెడ్డి శుభాకాంక్షలు తెలియజేస్తూ, పార్టీ బలోపేతం, మైనారిటీల సంక్షేమం కోసం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహాదేవపురం డివిజన్ అధ్యక్షులు సిద్దనోళ్ల సంజీవరెడ్డి, టిపిసిసి మైనారిటీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర జాయింట్ కన్వీనర్ సమీర్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వలి భాయ్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కు కాల్ చేయండి

**కీసర సీఐ ఆంజనేయులు**



**కీసర, ఆగస్టు 6, (సింగిడి):** కీసర పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో మీసురక్ష సైబర్ నేరాల బారిన పడిన బాధితులు ఆందోళన చెందకుండా వెంటనే 1930 జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని కీసర పోలీసులు కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే అధికారిక నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్లో కూడా ఫిర్యాదు నమోదు చేయవచ్చని తెలిపారు. సైబర్ మోసానికి గురైన వెంటనే సమాచారం అందిస్తే డబ్బు నిలిపివేసే అవకాశాలు మెరుగుపడతాయని కీసర సిఐ ఆంజనేయులు ఈ సందర్భంగా తెలిపారు.

## తెలంగాణ ఆత్మకు ప్రతిరూపం ప్రొఫెసర్ జయశంకర్

**తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే కె.పీ. వివేకానంద**



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 6 (సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ సర్కిల్, భౌరంపేట్ సింహపురి కాలనీలో కాల నీ వాసులు అంజనీ కుమార్ యాదవ్, వేముల శ్రీనివాస్, దత్తాత్రేయ, ఎస్ శివారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ విగ్రహాన్ని గురువారం ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఎల్పీ విప్ శ్రీ కె.పీ. వివేకానంద ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరిం చారు. అనంతరం విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ, "మహనీయులు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ తెలంగాణ ఆత్మకు ప్రతిరూపం అన్నారు. ఆయన కలలు కన్న ప్రత్యేక తెలంగాణ సాధన కోసం జీవితాంతం పోరాడారని, ఆ మహనీయుని ఆశయాలను కార్య రూపంలోకి తీసుకురావడంలో తెలంగాణ తొలి ముఖ్య మంత్రి కె. చంద్రశేఖర్ రావు (కేసీఆర్) నాయకత్వం చారిత్రాత్మక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. జయ శంకర్ సార్ ఆశయాలు, కేసీఆర్ కృషి తెలంగాణ చరిత్ర లో చిరస్థాయిగా నిలిచిపోతాయని ఎమ్మెల్యే వివరించా రు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, అభిమానులు పాల్గొన్నారు.

## జాతరలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకలు

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**
**చిట్కుల్ గ్రామంలో అంగరంగ వైభవంగా బోనాల పండుగ**
**ఘన స్వాగతం పలిగిన బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు.. గ్రామ ప్రజలు**





**పటాన్చెరు, ఆగస్టు 06 (సింగిడి):** గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే జాతరలు తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకలనీ పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గురువారం ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని చిట్కుల్ గ్రామంలో నిర్వహించిన గ్రామ దేవతల బోనాల ఉత్సవాల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు ఎమ్మెల్యే జిఎంఆర్ కు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి అనుగ్రహంతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు ఎమ్మెల్యే జిఎంఆర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, బిఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, మాజీ జెడ్పిటిసి శ్రీకాంత్ గౌడ్, కౌన్సిలర్ వెంకటేష్, ఆంజనేయులు, సీనియర్ నాయకులు నరేందర్ రెడ్డి, మేరాజ్ ఖాన్, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ జయశంకర్ సేవలు చిరస్మరణీయం

**ఎమ్మెల్యే జిఎంఆర్**
**పటాన్చెరులో ఘనంగా జయంతి వేడుకలు**
**విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు**





**పటాన్చెరు, ఆగస్టు 06 (సింగిడి):** తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ తెలంగాణ సమాజానికి అందించిన సేవలు చిరస్మరణీయమని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా గురువారం పటాన్చెరు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే జిఎంఆర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్నంతా అంకితం చేసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. తొలి, మలి విడత ప్రత్యేక తెలంగాణ ఉద్యమాల్లో ఆయన పోషించిన పాత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. తెలంగాణ ఉద్యమానికి సిద్ధాంతపరమైన బలాన్ని అందిస్తూ, ప్రజల్లో చైతన్యం నింపిన మహోన్నత వ్యక్తిగా జయశంకర్ సార్ చిరస్మరణీయులని పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడాలన్న ఆకాంక్షతో ఆయన చేసిన కృషి, త్యాగాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుల్లో ప్రొఫెసర్ జయశంకర్ అగ్రగణ్యులని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని పటాన్చెరు అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే జిఎంఆర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, సీనియర్ నాయకులు యాదగిరి యాదవ్, విజయ్ కుమార్, నర్రా బిక్షపతి, శ్రీధర్ చారి, అశోక్, వెంకటేష్, షకీల్, ధనరాజ్ గౌడ్, రామ్మోహన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నాగారం అభివృద్ధి పనులపై ఐఏఎస్ అధికారులతో చర్చ



**కీసర, ఆగస్టు 6, (సింగిడి):** జోనల్ కమిషనర్ రాధికా గుప్తా, ఐఏఎస్ ని మర్యాదపూర్వకంగా కలిసి నాగారం డివిజన్ పరిధిలోని పలు అభివృద్ధి పనులపై చర్చించడం జరిగింది. ఈ సమావేశంలో నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎల్లసాని భూమయ్య యాదవ్, మాజీ ఉపసర్పంచ్ మైపాల్ రెడ్డి, కౌకుంట్ల జీవన్ రెడ్డి, గండి శ్రీశైలం గౌడ్, దొడ్డి బాలనర్సింహ, గండి ఓంప్రకాష్ గౌడ్, అలాగే వివిధ కాలనీల అధ్యక్షులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగారం పరిధిలోని విజయపూర్ కాలనీ, సింహపూర్ కాలనీలకు బ్రిడ్జ్ నిర్మాణానికి పరిపాలనా ఆమోదం (సాంక్షన్) లభించింది. అదేవిధంగా వివిధ కాలనీలలో పార్కుల అభివృద్ధి పనులకు కూడా జోనల్ కమిషనర్ రాధికా గుప్తా ఆమోదం తెలిపారు. నాగారం డివిజన్ అభివృద్ధికి నిరంతరం సహకరిస్తూ, ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపిన జోనల్ కమిషనర్ రాధికా గుప్తా, ఐఏఎస్ కి నాగారం డివిజన్ ప్రజల తరపున హృదయపూర్వక ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నమని తెలిపారు.

## చీటింగ్ కేసులో వ్యక్తి రిమాండ్

**వికారాబాద్, ఆగస్టు 6 (సింగిడి):** చీటింగ్ కేసు విషయంలో ఓ వ్యక్తిని రిమాండ్ కు తరలించిన సంఘటన జిల్లా పరిధిలోని మోమిన్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఎస్సై భరత్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం, మండల పరిధిలోని బూరుగుపల్లి గ్రామానికి చెందిన మేకల శ్రీనివాస్, మేకల నగేష్, మేకల శోభారాణి గ్రామ పరిధిలోని మంతెన కృష్ణంరాజు భూమిలో పలుమార్లు దౌర్జన్యంగా ప్రవేశించి బెదిరిస్తూ భూమి సాగు చేసుకోకుండా అడ్డుపడినట్లు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, ఈ విషయంపై పలుమార్లు పోలీస్ స్టేషన్లో కేసులు నమోదయినట్లు గుర్తించగా, గురువారం నాడు మేకల శ్రీనివాసును, వికారాబాద్ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి సమక్షంలో హాజరపరచగా న్యాయస్థానం ఆ వ్యక్తికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించి జైలుకు పంపించాలని ఆదేశించగా, ఆ వ్యక్తిని జైలుకు పంపించనైనదని ఎస్సై భరత్ భూషణ్ తెలిపారు.

## పోచంపల్లిలో రూ.82 లక్షల సిఎంసి నిధులతో అభివృద్ధి పనులు ప్రారంభం

**ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యం**
**కొలను హనుమంత రెడ్డి**



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 6 (సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బహదూర్‌పల్లి 294వ డివిజన్ "డి" పోచంపల్లి గ్రామంలో ప్రజలు ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న రోడ్లు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో సిఎంసి నిధుల నుండి రూ. 82 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు గురువారం కొలను హనుమంత రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పనులు ప్రారంభించారు. మంజూరైన పనుల్లో సురక్ష గ్రీన్ మెడోస్ రోడ్డు అభివృద్ధికి రూ. 20 లక్షలు, గాయత్రీ ఇండస్ట్రీస్ 66 నుండి హోలీ చైల్డ్ స్కూల్ వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ. 15 లక్షలు, మేడ్చల్ రోడ్డు నుండి గాయత్రీ నగర్ కాలనీ వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ. 32 లక్షలు, యూజీడీ పనులకు రూ. 15 లక్షలు కేటాయించారు. ఈ సందర్భంగా హన్మంత రెడ్డి మాట్లాడు తూ, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడం కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని, డివిజన్‌లోని ప్రతి కాలనీ, ప్రతి గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి పనులను మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, టీపీసీసీ ప్రోటోకాల్ వైస్ చైర్మన్ బొంగునూరి కిశోర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు మైసిగారి శ్రీనివాస్, డిసిసి వైస్ ప్రెసిడెంట్ అమరం ముత్యం రెడ్డి, మాజీ సర్పంచ్ రామగౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సుధాకర్ గౌడ్, మాజీ వార్డు సభ్యుడు తిరుపతి రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ నాయకులు సదానంద్, కాలనీ నాయకులు కిషన్ రెడ్డి, ముత్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన గిరి వర్ధన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన నేతలు



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 6 (సింగిడి):** భారతీయ జనతా పార్టీ మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా అధ్యక్షునిగా ఎన్నికైన గిరివర్ధన్ రెడ్డి కి స్థానిక బిజెపి ముఖ్య నేతలు కలిసి శాలువాలు కప్పి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. గిరి వర్ధన్ రెడ్డికి అభినందనలు తెలిపిన వారిలో జిల్లా ఇంచార్జ్ అధ్యక్షులు మల్లారెడ్డి తోపాటు భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్రం మున్సిపల్ సేల్ కో కన్వీనర్ గాజులరామారం డివిజన్ మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరి, నందనం దివాకర్, బక్క శంకర్ రెడ్డి, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు జెకె శేఖర్ యాదవ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బిజెపి నాయకులు జిల్లా నాయకులు, ఓబీసీ మోర్చా నాయకులు, బిజేవైఎం నాయ కులు, వివిధ మోర్చా నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొని శుభాకాంక్షలు తెలియ జేశారు.



## అంతర్‌రాష్ట్ర వాహన దొంగ అరెస్ట్

**10 లక్షల విలువైన వాహనాలు స్వాధీనం**
**పోలీస్ సిబ్బందిని అభినందించిన సీపీ రష్మీ పెరుమాళ్**







**సిద్ధిపేట బ్యూరో, ఆగస్టు 6(సింగిడి):** వికారాబాద్ జిల్లా, భోంరస్పేట మండలానికి చెందిన ఓలా క్యాబ్ డ్రైవర్ అంగోత్ తుల్జా (34) బాధితుడు 3 జూలై 2026 రోజున కుకునూర్పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేయబడింది. ఫిర్యాదుదారు తెలిపిన వివరాల ప్రకారం.. జూలై 2, 2026 రాత్రి 8:00 గంటల సమయంలో ఎల్‌బి నగర్ ఫ్లైఓవర్ కింద క్యాబ్ బుకింగ్ కోసం వేచి ఉండగా పెంద్యాల సుదర్శన్ (32) తండ్రి కోటయ్య, వృత్తి కారు డ్రైవర్, ఖానాపూర్ గ్రామం, బిజినెపల్లి మండలశీ, నాగర్ కర్నూల్ జిల్లాకు చెందిన నిందితుడు వచ్చి కొమురవెల్లి మల్లన్న దర్శనానికి వెళ్ళాలని కారు మాట్లాడుకున్నాడు. అక్కడి నుండి కొమురవెల్లి వెళ్ళి దర్శనం ముగించుకున్నాక, అర్ధరాత్రి 01:00 గంటల ప్రాంతంలో ఆకలిగా ఉందనడంతో కుకునూర్పల్లి వైపు హోటల్ వెతుకుతూ ప్రయాణించారు. మంగోల్ ఎక్స్ రోడ్ వద్ద డ్రైవర్ తుల్జా మూత్ర విసర్జన కోసం కారు పక్కన ఆపగా, "ఏసి బంద్ చేయకు" అని చెప్పిన నిందితుడు, డ్రైవర్ కారు దిగగానే కారు (టి ఎస్ 34 టి బి 7506) ను వేగంగా నడుపుకుంటూ పరారయ్యాడు. గజ్వేల్ ఏసిపి నర్సింలు పర్యవేక్షణలో ఎస్ఐ బాలకృష్ణ సిసిటివి కెమెరాల పరిశీలన, సాంకేతిక సమాచారం ఆధారంగా కుకునూర్పల్లి పోలీసులు తీవ్రంగా శ్రమించి నిందితుడు పెంద్యాల సుదర్శన్‌ను అదుపులోకి తీసుకోవడం జరిగింది. విచారణలో నిందితుడు తన పాత నేరాలను మరియు ఇతర దొంగతనాల వివరాలను అంగీకరించినట్లు పోలీసులు పత్రిక ప్రకటనలో తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం 2019 గజ్వేల్ పరిధిలో ఒక రాజకీయనాయకురాలి వద్ద డ్రైవర్‌గా పనిచేస్తూ రూ. 50,000 దొంగిలించి మొదటిసారి జైలుకు వెళ్లినట్లు తెలిపారు. జైలు నుండి విడుదలయ్యాక గజ్వేల్, నర్సింగి, ఎస్సార్ నగర్, చైతన్యపురి, ఖమ్మం టూ టౌన్, భద్రాచలం, మధురానగర్, మలకపేట, నకిరేకల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో వాహనాల దొంగతనాలకు పాల్పడి పలుమార్లు చంచల్‌గూడ జైలుకు వెళ్ళాడన్నారు. జైలులో పరిచయమైన మిత్రులతో కలిసి ఖమ్మంలో రాయల్ ఎన్‌ఫీల్డ్ హంటర్ బైక్‌ను దొంగిలించి ఒడిశాలో రూ. 30,000 కు విక్రయించాడన్నారు. అలాగే సత్యసాయి జిల్లా సోమందేపల్లి పరిధిలో బెంగళూరు వెళ్తామని చెప్పి టోయోటా ఎటియోస్ కారును (ఏ పి 31 టి పి 2556) కూడా డ్రైవర్‌ను మోసం చేసి ఎత్తుకొని వెళ్లినట్లు చెప్పారు.. కుకునూర్పల్లి పోలీసులు నిందితుడు పెంద్యాల సుదర్శన్ నుండి 10 లక్షల విలువైన వాహనాలు అయిన స్విఫ్ట్ డిజైర్ కారు, టోయోటా ఎటియోస్ కారు, మరియు హంటర్ బైక్‌ను స్వాధీనం చేసుకుని, నిందితుడిని న్యాయస్థానం ముందు జుడీషియల్ రిమాండ్ నిమిత్తం తరలిస్తున్నారని తెలియజేయడమైనది. నిందితుడిని పట్టుకోవడంలో కృషిచేసిన తొగుట సీఐ లతీఫ్, ఎస్ఐ బాలకృష్ణ, కానిస్టేబుల్ రమేష్, రాజు, శివ, రాజేష్, రత్నాకర్, చంద్రం, ఐటీ కోర్ కానిస్టేబుల్ శ్రీకాంత్, నిందితుని పట్టుకోవడం లో సహకరించిన పోలీస్ సిబ్బంది అందరిని సిపి రష్మీ పెరుమాళ్ అభినందించారు.

## నాగారంలో మహంకాళి బోనాల మహోత్సవాలకు ముఖ్య అతిథులకు ఆహ్వానం





**కీసర, ఆగస్టు 6, (సింగిడి):** ఘట్కేసర్ సర్కిల్, నాగారం డివిజన్‌లో ఆగస్టు 9న జరగనున్న శ్రీ మహంకాళి బోనాల మహోత్సవాల సందర్భంగా నిర్వహించే పాలాహారం బండి ఊరేగింపు కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర మంత్రి రామోదర్ రాజనరసింహ, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క), రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు అనిల్ రెడ్డి, కందాడి అంజి రెడ్డిని నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిసి ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాగారం డివిజన్ మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ పంగ హరిబాబు, సీనియర్ నాయకులు చిన్నంరాజు, సత్తీష్ గౌడ్, గణపురం కొండల్ రెడ్డి, తాలీం పాల్గొన్నారు.

# ఎడిటోరియల్

Editorial

## ఆకాశంలో విమానాలు.. నేలపై మార్పు ఎప్పుడు?

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వం చేపట్టే మౌలిక వసతుల ప్రాజెక్టులు కేవలం నిర్మాణాత్మక అభివృద్ధికి మాత్రమే పరిమితం కావు. అవి ప్రాంతీయ ఆర్థిక ప్రగతి, ఉపాధి అవకాశాల విస్తరణ, పెట్టుబడుల ఆకర్షణ, ప్రజా సేవల మెరుగుదలకు కీలక సాధనాలుగా నిలుస్తాయి. కొత్త విమానాశ్రయాలు, జాతీయ రహదారులు, పారిశ్రామిక కారిడార్లు, పోర్టులు, విద్యాసంస్థలు వంటి ప్రాజెక్టులు ఒక ప్రాంత భవిష్యత్ అభివృద్ధికి పునాది వేస్తాయి.

ఆంధ్రప్రదేశ్‌లోని భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం సందర్భంగా వేలాది మంది విద్యార్థినులతో నిర్వహించిన ధింసా నృత్య కార్యక్రమం గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కిందని నిర్వాహకులు పేర్కొన్న ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. దీనిని కొందరు రాష్ట్ర సాంస్కృతిక వారసత్వానికి అంతర్జాతీయ గుర్తింపుగా ప్రశంసించగా, మరికొందరు ప్రజాధన వినియోగం, విద్యార్థుల భాగస్వామ్యం, కార్యక్రమ వ్యయం, పరిపాలనా ప్రాధాన్యతలపై ప్రశ్నలు లేవనెత్తారు. ప్రజాస్వామ్యంలో భిన్న అభిప్రాయాలు వ్యక్తం కావడం సహజమైన ప్రక్రియ.

కలల రన్‌వే.. తెలంగాణ అభివృద్ధికి కొత్త దిశ!

తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన ఆదిలాబాద్ జాయింట్ యూజర్ ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్టు కూడా ప్రాంతీయ అభివృద్ధి దిశగా ఒక కీలక అడుగుగా పరిగణించబడుతోంది. అందుబాటులో ఉన్న ప్రతిపాదనల ప్రకారం సుమారు రూ.2,278.14 కోట్ల అంచనా వ్యయంతో 2,009.23 ఎకరాల భూసేకరణ ప్రతిపాదించబడగా, అందులో భారత వైమానిక దళ అవసరాలకు అధిక భాగం, పౌర విమానయాన సేవలకు ప్రత్యేక భూభాగం కేటాయించే ప్రణాళిక రూపొందించబడింది. ఈ ప్రాజెక్టు అమలులోకి వస్తే ఉమ్మడి ఆదిలాబాద్ ప్రాంతంలో పారిశ్రామిక పెట్టుబడులు, పర్యాటక అభివృద్ధి, రవాణా సౌకర్యాలు, ప్రత్యక్ష--పరోక్ష ఉపాధి అవకాశాలు విస్తరించే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. అయితే ఇటువంటి భారీ ప్రాజెక్టుల అసలు ప్రభావాన్ని వాటి అమలు తర్వాత సాధించే ఆర్థిక, సామాజిక ఫలితాల ఆధారంగా అంచనా వేయడం కూడా అంతే అవసరం.

ప్రచారం ఎంతైనా.. ప్రభావమే అసలైన ప్రమాణం!

ప్రభుత్వాల దృష్టిలో ఇటువంటి ప్రారంభోత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలు రాష్ట్ర ప్రతిష్టను పెంచడం, ప్రాంతీయ సంస్కృతిని విస్తృత స్థాయిలో పరిచయం చేయడం, పెట్టుబడిదారులు, పర్యాటకులు, పరిశ్రమల దృష్టిని ఆకర్షించడం వంటి లక్ష్యాలకు ఉపయోగపడే అవకాశాలు కలిగి ఉంటాయి. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన కార్యక్రమాలు ఒక ప్రాంత ప్రత్యేకతను ప్రపంచానికి చాటడంతో పాటు, ఆర్థిక కార్యకలాపాలకు పరోక్షంగా ప్రోత్సాహం అందించే సాధనాలుగా కూడా పరిగణించవచ్చు. అదే సమయంలో ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజాధనం వినియోగానికి సంబంధించిన వివరాలు, వ్యయ పారదర్శకత, కార్యక్రమాలు లేదా ప్రాజెక్టుల ద్వారా కలిగే ఆర్థిక--సామాజిక ప్రయోజనాలపై స్పష్టమైన సమాచారం ప్రజలకు అందుబాటులో ఉండటం మంచి పరిపాలనకు అవసరమైన అంశం. అభివృద్ధి కార్యక్రమాల విజయాన్ని కేవలం ప్రచారం లేదా ప్రారంభోత్సవాల వైభవంతో కాకుండా, వాటి ద్వారా ప్రజలకు కలిగే దీర్ఘకాలిక ప్రయోజనాలు, ఉపాధి అవకాశాలు, ఆర్థిక ప్రభావం వంటి ప్రమాణాలతో అంచనా వేయడం ప్రజాస్వామ్య విలువలకు అనుగుణమైన విధానం.

## పాత్ర చిన్నదైనా పెద్దగా నవ్వించే నటుడు: సుత్తివేలు

### తెలుగు హాస్య నటనకు చిరునామా: సుత్తివేలు

ఆగస్టు 7...సుత్తివేలు జయంతి

తెలుగు సినిమా చరిత్రలో హాస్యానికి ఉన్న స్థానం అమోఘమైనది. ఆ స్థానం సుస్థిరం చేసేందుకు కారణమైన కొద్దిమంది అపూర్వ నటుల్లో ఒకరు సుత్తివేలు. నవ్వును నాటకీయతగా కాదు, సహజత్వంగా వ్యక్తీకరించిన నటుడు ఆయన. మాటల్లో అమాయకత్వం, భావంలో చిత్తశుద్ధి, ఆయన పాత్రలు తరచూ సామాన్య మనిషి జీవితం నుంచి తీసుకున్న సన్నివేశాల ఆధారంగా ఉండేవి. మధ్యతరగతి మనస్తత్వం, ఆశలబంధం, ఆర్థిక బాధలు, కుటుంబ బంధాలు---ఇవన్నీ హాస్యపు వర్ణచిత్రాలుగా ఆయన పాత్రల ద్వారా కనిపించేవి. ఆయన పాత్రలు మనల్ని నవ్విస్తూనే ఆలోచింపజేసేవి. అలాంటి హాస్యం తెలుగు సినిమా చరిత్రలో అరుదు.



నటనలో నైపుణ్యం ఆయనకు పరిపూర్ణంగా నిండిన లక్షణాలు. ప్రేక్షకులు ఆయనను ఒక్కసారి చూసిన తరువాత మరువలేరు. ఆయన పాత్రలు, సంభాషణలు, ముఖాభినయాలు తెలుగు ప్రేక్షకుల మస్తిష్కాల్లో చిరస్థాయిగా నిలిచి పోయాయి.

సుత్తివేలు అసలు పేరు కురుమద్దాలి లక్ష్మీ నరసింహారావు. కృష్ణా జిల్లా మచిలీపట్నం మండలం భోగిరెడ్డి పల్లిలో 10947 ఆగస్టు 7 న జన్మించారు. పక్కంటి పిన్ని జానకాంబ ఈయనను వేలు అని పిలవడం, నాలుగు స్తంభాలాట సినిమా లో ఈయన పాత్ర పేరు 'సుత్తి' కావడంతో ఆ చిత్ర విజయం తరువాత అందరూ ఈయనను సుత్తివేలు అని పిలిచే వారు.

చిన్ననాటి నుంచి నాటకాల పట్ల ప్రగాఢ ఆసక్తితో పెరిగిన వేలు, మిమిక్రీలో తన ప్రతిభను చాటుతూ స్థానికంగా మంచి పేరు తెచ్చుకున్నారు. నాటక రంగంలో దశాబ్ద కాలంగా అనుభవంతో పాటు, అనేక అవార్డులను అందుకొని, తనకు తానే శిక్షకుడిగా అవతరించిన కళాకారుడు. హాస్యాన్ని ఒక సామాజిక శక్తిగా, ఒక భావ వ్యక్తీకరణ సాధనంగా ఉపయోగించిన నటుడు.

హాస్యబ్రహ్మ జంధ్యాల తన చిత్రం ముద్ద మందారంలో అయనకు రిసెప్షనిష్టుగా చిన్న పాత్రను ఇచ్చాడు. ఇలా 1981 లో సుత్తివేలు సినీరంగ ప్రస్థానం జరిగింది. మల్లె పందిరి, నాలుగు స్తంభాలాట, ఆనంద భైరవి, రెండుజెళ్ళ సీత, శ్రీవారికి ప్రేమలేఖ, చంటబ్బాయి, వందేమాతరం, ప్రతిఘటన, కలికాలం, ఒ సేయ్ రాములమ్మ, చిక్కడు దొరకడు, వంటి చిత్రాల్లో ఆయన హాస్యపాత్రలు మధురమైన అనుభూతులను కలిగించాయి. ముఖ్యంగా, రాజేంద్ర ప్రసాద్‌తో ఆయన కాంబినేషన్ ప్రేక్షకుల హృదయాలను జయించిన జంటగా నిలిచింది. వీరి సంభాషణల దులుపు, సమయస్ఫూర్తి, హావభావాలు అనన్య సాధారణంగా మెప్పించేవి.

జంధ్యాల దర్శకత్వంలో సుత్తివేలు పాత్రలు ప్రత్యేకమైన స్థాయికి చేరుకున్నాయి. జంధ్యాల సంభాషణల రచనకు సరైన ప్రతిరూపంగా ఆయన నటన నిలిచింది. హాస్యంలో విలక్షణత, వాక్చాతుర్యం, శరీర భాషలో స్పష్టత --- ఇవన్నీ కలబోతగా ప్రేక్షకులను ఆహ్లాదపరిచే విధంగా ఆయన నటించగలగడం అతి కొద్దిమందికే సాధ్యమయ్యింది. అతని సంభాషణ నైపుణ్యం ఒక పాఠ్యాంశంగా చెప్పవచ్చు. ఆయన పలికిన కొన్ని వాక్యాలు, అనేక పాఠశాలల నాటకాలలో కూడా పునరావృత మవుతుంటాయి. నాటక రంగానికీ, సినిమాకీ మధ్య ఉన్న సాంకేతిక విభిన్నతను సుత్తివేలు తన శ్రమతో సమన్వయం చేసుకుని నటనలో మార్గదర్శకుడయ్యారు.

ఆయన నటించిన సినిమాల సంఖ్య రెండు వందలకు పైగా. ఒకే తరహా పాత్రల్ని నిరంతరం చేసి, ప్రేక్షకులను విసిగించకుండా, ప్రతి సినిమాలో కొత్త మైనింగ్, కొత్త శైలితో కనిపించే ప్రయత్నం చేశారు. పాత్ర చిన్నదా పెద్దదా అన్న తేడా లేకుండా ప్రతి పాత్రకు ప్రాణం పోసే ప్రయత్నం చేశారు. అందుకే ఆయన నటన ప్రేక్షకులకు ఎప్పుడూ తాజాగానే అనిపించేది.



ఆయన ప్రతిభకు గుర్తింపుగా నంది అవార్డు లభించింది. అయితే అవార్డులకన్నా ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించడం ఆయన నిజమైన విజయంగా భావించేవారు. చివరి రోజుల్లో అనారోగ్యంతో బాధపడిన సుత్తివేలు, 2012 సెప్టెంబర్ 16న గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన మృతి తెలుగు సినీ రంగానికి తీరనిలోటుగా నిలిచింది.

సుత్తివేలు ఒక హాస్యనటుడిగా మాత్రమే కాకుండా, ఒక కళా స్వారస్వతికుడిగా గుర్తింపు పొందిన వాడు. హాస్యంలో నూతన మార్గాలను అన్వేషించిన వాడు. నవ్వుని ఒక నాటి పల్లకిలో కూర్చోబెట్టి ప్రేక్షకుల గుండెల దాకా తీసుకెళ్లిన వాడు. ప్రతి మాటలో మాధుర్యం, ప్రతి చూపులో చాతుర్యం, ప్రతి అభినయంలో మానవతా చింతన. అలాంటి మానవీయ హాస్యాన్ని అందించిన సుత్తివేలును తెలుగు సినీ ప్రపంచం మరచిపోలేదు, మరచిపోదు.

ఈ రోజు ఆయన బతికివుంటే హాస్యానికే కాదు, భావప్రకటనా నైపుణ్యానికి కూడా బ్రాండ్ అంబాసడర్‌గా నిలిచేవారు. తెలుగువారి చలనచిత్ర మేధస్సులో నవ్వులు పండించే సుత్తివేలు ఒక వెలుతురు. ఆ వెలుతురు మరువదగినది కాదు. ఆయన పేరును, నటనను, హాస్యాన్ని తెలుగు సినిమా ఎప్పటికీ కీర్తించుకుంటూ ఉంటుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494

## మళ్లీ మళ్లీ... !

జీవితం మళ్లీ మళ్ళీ రాదు
ఉన్నప్పుడే ఆసాంతం జీవించు !
ప్రియ నేస్తాలు మళ్లీ మళ్ళీ దొరకరు
అందినపుడే ఆస్వాదించు !
ప్రేమించే హృదయం రోజూ దొరకదు
దొరికినప్పుడే గట్టిగా ఆలింగనం చేసుకో !
వయస్సు మళ్ళీ మళ్లీ తిరిగి రాదు
ఉన్నపుడే అన్నింటినీ అందిపుచ్చుకో !
గడిచిన క్షణం మళ్లీ మళ్లీ రానే రాదు
వర్తమానాన్ని సద్వినియోగం చేసుకో !
పెదవి జీరిన మాట వెనక్కి రాదు
పెదవి దాటక ముందే అదుపు చేసుకో !

మధుపాలీ
9949700037



## దేశంలోనే తొలి గ్రంథాలయ సంఘ స్థాపకులు అయ్యంకి



పుట్టడం, గిట్టడం సహజం. జీవించినంతలో సమాజానికి ఉపయోగపడే పనులు చేయడం మానవ ధర్మం. కొంతమంది మాత్రమే తమ జీవితంలో ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేసి తమ జీవితాన్నే ఫణంగా పెట్టి మానవ జాతిలో చిరస్థాయిగా తరతరాలుగా నిలిచిపోతారు . అలాంటి వాటిలో...అయ్యంకి వెంకట రమణయ్య ముఖ్యులు. గ్రంథాలయోద్యమం అనగానే గుర్తుకు వచ్చే పేరు ఆయనదే. "పుస్తకాలే ప్రాణంగా...పుస్తకాలయాలే లోకం"గా జీవించిన వ్యక్తి. గ్రంథాలయోద్యమ పితా మహుడుగా, జీవితాంతం గ్రంథాలయాల అభివృద్ధి కోసం, అద్వితీయంగా, అనన్యంగా, అహర్నిశలూ, బహుముఖ సేవలందించిన గొప్ప వ్యక్తి అయ్యంకి.

అయ్యంకి వెంకట రమణయ్య (1890–1979) గ్రంథాలయోద్యమ కారుడు, ఆయుర్వేదం, ప్రకృతి వైద్యంలో సిద్ధహస్తులు, పత్రికా సంపాదకులు. గ్రంథాలయ సర్వస్వము అనే పత్రికను నిర్వహించారు. అయన గ్రంథాలయ ఉద్యమంలో జీవితాంతం విశేష కృషి సల్పి గ్రంథాలయ పితా మహుడుగా పేరు గాంచారు. అయ్యంకి జన్మదినం గురించి రెండు తేదీలు పేర్కొనబడ్డాయి. ఆయన తూర్పు గోదావరి జిల్లా రామచంద్రపురం తాలూకా అనపర్తి నియోజక వర్గంలోని బిక్కవోలు మండంలో గల కొంకుదురు గ్రామంలో 1890 ఆగస్టు 7న, అలాగే జూలై 24న జన్మించినట్లు పేర్కొనబడింది. తేదీలలో స్వల్ప మార్పులు ఉన్నా, ఖ మహనీయుని గురించి నేటి తరం తెలుసుకోవాల్సిన అవసరం అనివార్యంగా ఉంది. అయన తల్లిదండ్రులు వెంకటరత్నం, మంగమాంబ. తండ్రి వెంకతరత్నం గారు నీటిపారుదల శాఖలో ఉద్యోగి.

1907లోప్రముఖ జాతీయ నాయకుడు, స్వాతంత్ర్య సమర యోధుడు బిపిన్ చంద్రపాల్ రాజమండ్రి లో భారత స్వాతంత్ర్య సమరంలో యువకులు పాల్గొనాలని ఇచ్చిన ఉత్తేజ పూరితమైన ఉపన్యాసాలు విని, చదువుకు స్వస్తి చెప్పి దేశ సేవకు జీవితాన్ని అంకితం చెయ్యటానికి 'రక్షాబంధనం ' కట్టుకొన్నారు.

దేశంలోని పలు సమస్యలకు ముఖ్యకారణం అవిద్య, అజ్ఞానం అని గ్రహించి, అందరినీ విద్యా వంతులుగా, జ్ఞాన వంతులుగా చెయ్యాలని అందుకు గ్రంథాలయాల వ్యాప్తి అవసరమని భావించి ఆ ఉద్యమ వ్యాప్తికి కంకణం కట్టుకొన్నారు.

1910 లో బందరులో "ఆంధ్ర సాహిత్య పత్రిక"ను స్థాపించి, గురజాడ, రాయప్రోలు, శ్రీశ్రీ రచనలను ప్రచురించి, ప్రజలను చైతన్య వంతం చేశారు. 1914లో ప్రథమ ఆంధ్ర రాష్ట్ర గ్రంథ భాండాగార ప్రతినిధుల మహాసభలను విజయ వాడలో నిర్వహించారు. 1919, నవంబరు–14న, చెన్నైలో తొలి "అఖిల భారత పౌర గ్రంథాలయం" ను స్థాపించి, మొదటి మహా సభను నిర్వహించారు. అలాగే 'గ్రంథాలయ సర్వస్వం' (త్రైమాసిక), 'ఇండియన్ లైబ్రరీ జర్నల్', 'కొరడా', 'ప్రకృతి', 'ది ఇండియన్ నేచురోపతి',' 'సహకారం', 'దివ్యజ్ఞాన దీపిక' వంటి పత్రికలను కూడా నడిపారు. 1911లో విజయవాడలో రామమోహన గ్రంథాలయ స్థాపనకు తోడ్పడ్డాడు. 1914లో విజయ వాడలో ఆంధ్రదేశ గ్రంథ భాండాగార, ప్రతినిధుల గ్రంథాలయ మహా సభలు జరిపి భారత దేశంలో తొలిసారిగా గ్రంథాలయ సంఘాన్ని, 1915లో సంఘ పక్షాన గ్రంథాలయ సర్వస్వం పత్రికను స్థాపించడానికి తోడ్పడ్డారు. 1919లో అఖిల భారత పౌర గ్రంథాలయ సంఘాన్ని స్థాపించి, 1924లో ఆ సంఘ పక్షాన ఇండియన్ లైబ్రరీ జర్నల్ అనే ఆంగ్ల పత్రికను ప్రారంభించారు.

1934–1948 మధ్యకాలంలో గ్రంథాలయ యాత్రలను అపూర్వమైన స్థాయిలో పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలలో కార్యదర్శులు నిర్వహించారు. వీరి మూలంగా వందల సంఖ్యలో కొత్త గ్రంథాలయాలు ఏర్పడ్డాయి. మూసి వేసినవి పునరుద్ధరించ బడ్డాయి. 1920, 1934లలో గ్రంథాలయ కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆంధ్రదేశంలోని ప్రతి గ్రామం పర్యటించారు. అయ్యంకి వెంకట రమణయ్య, దేశంలో పూర్తిస్థాయిలో గ్రంథాలయాలను నెలకొల్పిన వ్యక్తిగా పేరు గడించారు.

ఆంధ్రభాషాభివర్ధనీ మండలి, ఆంధ్రపరిషత్తు, కళాపీఠము, దివ్యజ్ఞాన చంద్రికామండలి అనే గ్రంథమాలలను స్థాపించి అనేక ఉత్తమ రచనలను తెలుగు పాఠకులకు అందించారు. గ్రంథాలయోద్యమంలో ఆయన సేవలను గుర్తించి, ఆయన సప్తతి మహోత్సవ సందర్భంగా, గుడివాడలో 'సరస్వతీ సామ్రాజ్య ప్రతిష్ఠాపనాచార్య' బిరుదుతో సత్కరించారు.

1919లో అఖిల భారత పౌర గ్రంథాలయ సంఘాన్ని స్థాపించిన రోజును భారత గ్రంథాలయ సంస్థ గుర్తించి నేషనల్ లైబ్రరీ డే (జాతీయ గ్రంథాలయ వారోత్సవ దినం)"గా దేశమంతటా 1968 నుంచి ప్రతి సంవత్సరం జాతీయ గ్రంథాలయ1968 నుండి, "జరుపుకొను చున్నారు. ఆయన అనేక గ్రంథాలయ యాత్రలను నిర్వహించి, "ప్రజా గ్రంథాలయమే ప్రజల విశ్వవిద్యాలయం" అని చాటి చెప్పారు.

భారత ప్రభుత్వం ఆయన గ్రంథాలయ సేవలకు స్పందించి 1972 లో' 'పద్మశ్రీ'తో .గౌరవించింది. గ్రంథాలయ పితామహ, గ్రంథాలయోద్ధారక, గ్రంథాలయ విశారద, సరస్వతీ సామ్రాజ్య ప్రతిష్ఠాపనాచార్య, సరస్వతీ రమారమణ, గ్రంథాలయ విశారద వంటి బిరుదులు అందుకున్నారు. 1977లో ప్రొఫెసర్ కౌలా అంతర్జాతీయ స్వర్ణపతకం పొందారు.

ఆంధ్రవిశ్వ కళాపరిషత్తు గ్రంథాలయ శాస్త్ర పరీక్షలో ఉత్తమ విద్యార్థికి అయన పేరుతో స్వర్ణ పతకం ఇస్తున్నది. 1979లో అయ్యంకి లైబ్రరీ కమిటీ ఏర్పడి ప్రతి సంవత్సరం ఉత్తమ గ్రంథాలయ కార్యకర్తను సత్కరిస్తోంది. ఆయన తండ్రి వెంకట రత్నం అయ్యంకిలో శ్రీ గంగా పర్వత.వర్ధనీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం నిర్మించారు. వెంకట రమణయ్య 1979, మార్చి 7న మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**

# ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను కొనసాగిద్దాం



**జమ్మికుంట ఆగస్టు 6 (సింగిడి):** ఇల్లందకుంట మండలంలోని సిరిసేడు గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. గ్రామ సర్పంచ్ రేణిగుంట్ల శ్యామల కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ చేసిన సేవలు, అందించిన సిద్ధాంతాలు ఆమోఘమైనవని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వి హుజూరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ ఆలేటి శ్రీరామ్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రేణిగుంట్ల తారక రామ్, ఎమ్.ఎ. ముస్తఫా, నేరెళ్ల దామోదర్, జవ్వాజి చిరంజీవి, జవ్వాజి అనిల్, వినిశెట్టి నాగరాజ్, పుట్ట రాజు, మహంకాళి రాజు, జవ్వాజి రాజు, భోగం మొగిలితో పాటు పలువురు పార్టీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## జయశంకర్ సార్ పోరాటం చిరస్మరణీయం



- తెలంగాణ సాధనకు ఆయన చేసిన త్యాగాలు భావితరాలకు స్ఫూర్తి
- మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సన్న

**కరీంనగర్, ఆగస్టు6(సింగిడి ):** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ చేసిన పోరాటం చిరస్మరణీయమని, ఆయన ఆశయాలు, ఆలోచనలు భావితరాలకు ఆదర్శప్రాయమని కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సన్న అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా గురువారం కరీంనగర్ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆకుల నర్సన్న మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటే జీవిత లక్ష్యంగా అవిశ్రాంతంగా కృషి చేసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు సిద్ధాంతపరమైన బలాన్ని అందించి, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి మార్గదర్శకుడిగా నిలిచారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ఆచరిస్తూ తెలంగాణ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి ఓదెలు, పర్యవేక్షకురాలు సువర్ణ, మార్కెట్ కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.

## జయశంకర్ ఆశయాలను కొనసాగిద్దాం..

**మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్**

**మున్సిపల్ కార్యాలయంలో జయశంకర్ జయంతి వేడుకలు**




**జమ్మికుంట, ఆగస్టు 6,(సింగిడి):** జమ్మికుంట మున్సిపల్ కార్యాలయ ఆవరణలో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ చేసిన సేవలు చిరస్మరణీయమని, ముఖ్యంగా తెలంగాణ మలిదశ ఉద్యమానికి ఆయన సిద్ధాంతపరంగా మార్గనిర్దేశం చేస్తూ ఉద్యమాన్ని ముందుకు నడిపించడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రాజిరెడ్డి ,వికాస్, అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ), శానిటరీ ఇన్స్పెక్టర్ ఐ. రమేష్, సీనియర్ అసిస్టెంట్ భాస్కర్ శ్రీనివాస్, టీపీఎస్ రమేష్, బిల్ కలెక్టర్, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలే బిడ్డకు అమృతం

**రాజుపేటలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు**

**గర్భిణీలు, బాలింతలకు వైద్య పరీక్షలు -- అవగాహన**



**ములుగు ప్రతినిధి, ఆగస్టు 6 (సింగిడి):** వెంకటాపురం మండలం రాజుపేట ఆరోగ్య ఉపకేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉపకేంద్ర వైద్యాధికారి డాక్టర్ కె. నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ పుట్టిన గంటలోపు తల్లిపాలు పట్టించడం, తొలి ఆరు నెలలు కేవలం తల్లిపాలే ఇవ్వాలని సూచించారు. తల్లిపాలు శిశువుకు అవసరమైన పోషకాలు, రోగనిరోధక శక్తిని అందిస్తాయని, తల్లికి కూడా పలు ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని వివరించారు. కార్యక్రమంలో గర్భిణీలకు రక్తపోటు, బరువు, రక్తహీనత పరీక్షలు నిర్వహించి, పోషకాహారం, ఐరన్-ఫోలిక్ యాసిడ్, కాల్షియం మాత్రల వినియోగంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలని సూచించారు. ఆరోగ్య విద్యాధికారి జయశ్రీ, సహాయ నర్సు చంద్రలీల, ఆశా కార్యకర్తలు పాల్గొని తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. చివరగా తల్లిపాల ప్రాధాన్యంపై ప్రమాణం చేయించి కార్యక్రమాన్ని ముగించారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- ప్రోటోకాల్, సౌకర్యాల కల్పనలో ఎలాంటి లోటుపాట్లు ఉండొద్దు
- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా




**కరీంనగర్, ఆగస్టు6(సింగిడి ):** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, అదనపు డీసీపీ వెంకటరమణతో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రోటోకాల్ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ వేడుకలు సజావుగా నిర్వహించాలని సూచించారు. వేదిక వద్ద అతిథులు, స్వాతంత్ర్య సమరయోధులు, ప్రజలు, విద్యార్థులు, మాధ్యమ ప్రతినిధులకు తగిన సీటింగ్, తాగునీరు, గుడారాలు, ధ్వని వ్యవస్థ తదితర సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. వర్షం వచ్చినా కార్యక్రమానికి అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, విద్యుత్, పార్కింగ్, అత్యవసర వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వివిధ ప్రభుత్వ శాఖల పనితీరును ప్రతిబింబించేలా ప్రత్యేక ప్రదర్శనశాలలు, శకటాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వ్యవసాయం, ఉద్యానవనం, మత్స్యశాఖ, వైద్యశాఖ, గృహనిర్మాణం, పంచాయతీరాజ్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, రోడ్డు రవాణా సంస్థ, సెర్ప్, మెప్మా తదితర శాఖలు తమ కార్యక్రమాలను ప్రజలకు తెలియజేసేలా ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు, మాదకద్రవ్యాల నియంత్రణ, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనే చర్యలు, స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులు వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులను ఎంపిక చేసి ప్రశంసాపత్రాలు అందజేయాలని, అంబులెన్స్, అగ్నిమాపక వాహనం, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి పోటీలకు పారమిత విద్యార్థుల ఎంపిక

**జిల్లా స్థాయి పోటీల్లో మూడు స్వర్ణ, ఆరు రజత, ఒక కాంస్య పతకాలతో సత్తాచాటిన పారమిత విద్యార్థులు**



**కరీంనగర్, ఆగస్టు6(సింగిడి):** కరీంనగర్‌లోని పారమిత ఉన్నత పాఠశాల, పారమిత లిటిల్ జీనియస్ విద్యార్థులు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధించారు. విద్యార్థులు మూడు స్వర్ణ, ఆరు రజత, ఒక కాంస్య పతకాలు సాధించి విశేష ప్రతిభ చాటారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్, కవిత ప్రసాద్ తెలిపారు. జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో ప్రాంతీయ క్రీడా పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో తొమ్మిదో తరగతి విద్యార్థిని వి. సిరిచందన జావెలిన్ త్రోలో స్వర్ణ పతకం సాధించింది. మొదటి తరగతి విద్యార్థిని గాలి శ్రేయాన్షి 150 మీటర్లు, 60 మీటర్ల పరుగు పందేల్లో రెండు స్వర్ణ పతకాలు గెలుచుకోగా, ఇల్లందుల అయాన్ బ్రాడ్‌జంప్‌లో స్వర్ణ పతకం సాధించాడు. ఉమ్మే హని (400 మీటర్ల పరుగు), ఆయేషా పర్వీన్ (60 మీటర్ల పరుగు), శనిగరపు తేజవర్ధన్ (60 మీటర్ల పరుగు, బ్రాడ్‌జంప్), ఆరోహి గోనె (200 మీటర్ల పరుగు), విలాస్ కస్తూరి (బ్రాడ్‌జంప్) రజత పతకాలు సాధించగా, తన్విశ్రీ కాంస్య పతకం దక్కించుకుంది. ఆగస్టు 7, 8 తేదీల్లో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగే తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో వీరు పాల్గొననున్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల చైర్మన్ డా. ఇనుగంటి ప్రసాదరావు, డైరెక్టర్లు ప్రసూన, రాకేష్, రశ్మిత, అనుకర్‌రావు, వినోదరావు, వి.యు.ఎం. ప్రసాద్, హనుమంతరావు, ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్, కవిత ప్రసాద్, బాలాజీ, సమన్వయకర్తలు, వ్యాయామ ఉపాధ్యాయులు జిలానీ, చామనపల్లి మహేష్, సాదుల రజిత అభినందించారు.

# ప్రత్యేక సమగ్ర సవరణను వంద శాతం పూర్తి చేయాలి

**క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ బలోపేతంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి**

**జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం**




**కరీంనగర్, ఆగస్టు6(సింగిడి ):** జిల్లాలో ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వంద శాతం పూర్తి చేయడంతో పాటు క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుల సమావేశంలో ఆయన భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని భారీ అప్పుల్లోకి నెట్టిందని విమర్శించారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ఆర్థిక సవాళ్లు ఉన్నప్పటికీ ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల సొంతింటి కలను సాకారం చేస్తోందన్నారు. ప్రతి నియోజకవర్గానికి తొలి విడతలో 3,500, రెండో విడతలో మరో 2,000 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు, హైదరాబాద్‌లో లక్ష ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. దేశంలోనే తొలిసారిగా రూ. 2 లక్షల రైతు రుణమాఫీ అమలు చేసిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500కే వంటగ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం వంటి సంక్షేమ పథకాలు ప్రజలకు చేరుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు సామాజిక మాధ్యమాల ద్వారా చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని పార్టీ శ్రేణులు సమర్థంగా తిప్పికొట్టాలని, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. నాయకులంతా ఐకమత్యంతో పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, ఇకపై ప్రతి 15 రోజులకు ఒకసారి జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు పాల్గొన్నారు.

# జయశంకర్ ఆశయాల సాధనే నిజమైన నివాళి

**తెలంగాణ ప్రయోజనాల పరిరక్షణకు ప్రతిఒక్కరూ కట్టుబడి ఉండాలి**

**జేఏసీ జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు**



**కరీంనగర్, ఆగస్టు6(సింగిడి ):** ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయాల సాధన కోసం కృషి చేయడమే ఆయనకు నిజమైన నివాళి అని ప్రజా సంఘాల జేఏసీ జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా గురువారం కరీంనగర్‌లోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం సమీపంలోని మదీనా కాంప్లెక్స్ వద్ద ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జయశంకర్ విగ్రహానికి పోలాడి రామారావు, జేఏసీ నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ, ఆరు దశాబ్దాల తెలంగాణ ఉద్యమానికి దిక్సూచిగా నిలిచి, ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను ప్రజల్లో రగిలించిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర సాధననే జీవిత లక్ష్యంగా చేసుకుని ఉద్యమానికి సిద్ధాంతపరమైన బలాన్ని అందించిన గొప్ప మేధావిగా ఆయన చరిత్రలో నిలిచిపోతారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రాంత ప్రయోజనాల పరిరక్షణతో పాటు జయశంకర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఆ దిశగా ప్రజా సంఘాల జేఏసీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. అనంతరం నాయకులు "జయశంకర్ సార్ అమర్ రహే" అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు పెండ్యాల కేశవరెడ్డి, కొత్తకొండ రవీందర్ రావు, జన్ను జయరాజు, నర్సయ్య, జిల్లా అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు

- తెలియని వ్యక్తులు ఓటిపి అడిగితే స్పందించవద్దు
- జమ్మికుంట పట్టణ ఎస్ఐ రవి



**జమ్మికుంట, ఆగస్టు 6 (సింగిడి):** సురక్ష కా తిరంగా -- సైబర్ స్వతంత్ర తెలంగాణ' అనేది తెలంగాణ పోలీసులు సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి ఆగస్టు నెలలో ప్రారంభించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమం బుధవారం రోజున స్థానిక జమ్మికుంట (బాలురు) ఉన్నత పాఠశాలలో జమ్మికుంట యస్.ఐ. రవి ఆధ్వర్యంలో ఈ సదస్సు కార్యక్రమం నిర్వహించారు. రోజురోజుకూ పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాలు, డిజిటల్ అరెస్ట్ నకిలీ ట్రేడింగ్ యాప్ మోసాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయడం దీని ముఖ్య ఉద్దేశ్యం అని పేర్కొన్నారు. ఆగస్టు నెల పొడవునా పాఠశాలలు, కళాశాలలు, బహిరంగ ప్రదేశాల్లో ప్రజలకు డిజిటల్ భద్రతపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. డిజిటల్ అరెస్ట్ పట్ల అప్రమత్తత: పోలీసులు లేదా కేంద్ర సంస్థల పేరుతో వీడియో కాల్స్ చేసి భయపెట్టే డిజిటల్ అరెస్ట్ మోసాల గురించి ప్రత్యేక హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

**ట్రేడింగ్ మోసాలు:**

తక్కువ కాలంలో ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించి మోసం చేసే నకిలీ ట్రేడింగ్ యాప్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మీరు మోసపోతే ఏమి చేయాలి? ఒకవేళ మీరు లేదా మీ పరిచయస్తులు ఎవరైనా సైబర్ మోసానికి గురైతే, వెంటనే 1930 జాతీయ సైబర్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలి. సంఘటన జరిగిన వెంటనే (గోల్డెన్ హవర్) ఫిర్యాదు చేయడం ద్వారా మోసపోయిన డబ్బులు రికవరీ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఈ అవగాహన సదస్సులో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాదం సురేష్ బాబు ఉపాధ్యాయులు రాం.రాజయ్య, కె.రవీందర్ రెడ్డి, యం. శ్రీనివాస్, యం.స్వామి, ప్రభాకర్, స్రవంతి, జ్యోతి, లక్ష్మి, వనజ, పద్మ, హేమలత, శైలజ, త్రివేణి, డి. వరదరాజు, వైశాలి తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబాలకు వరం సీఎం సహాయనిధి

**ప్రతి గడపకు సంక్షేమం-ప్రతి ఇంటికి అభివృద్ధి**

**సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేసిన ప్రణవ్..**



**జమ్మికుంట, ఆగస్టు 6 (సింగిడి):** ప్రజలకు ఉపయోగపడే సిఎంఆర్ఎఫ్ చెక్కులను ప్రజలకు త్వరగా అందజేస్తున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి గడపకు సంక్షేమాన్ని, ప్రతి ఇంటికి అభివృద్ధి ఫలాలు ప్రజాపాలన ద్వారా ప్రజలకు చేరవేస్తున్నామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. గురువారం ఇల్లందకుంట మండల పరిధిలోని ఇల్లందకుంట మండలం, చిన్న కోమటిపల్లి, టేకుర్తి, బూజునూరు, రాచపల్లి, మల్లన్నపల్లి, శ్రీరాముల పల్లి, కనగర్తి, లక్ష్మాజీ పల్లి, మల్యాల, వాగొడ్డు రామన్నపల్లి గ్రామాల్లో 24 చెక్కులను దాదాపు ఎనిమిది లక్షలు విలువచేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను నేరుగా ఇంటి, ఇంటికి వెళ్లి లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ పట్టణాల్లో, గ్రామాల్లో తిరుగుతున్నప్పుడు ప్రజలు తమ వద్దకు తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరిస్తున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు నేరుగా అందిస్తున్నామని, పార్టీ కార్యకర్తలకు, నాయకులకు ఇదే సూచన చేశామని తెలిపారు. ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి విషయంలో రాజీపడమని, ఈ సందర్భంగా శ్రీరాములపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు గృహ ప్రవేశంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందకుంట దేవాలయ ఛైర్మెన్ రామారావు, మండల అధ్యక్షుడు పెద్ది కుమార్, జిల్లా అధికార ప్రతినిధులు, డైరక్టర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, వార్డు సభ్యులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 6 (సింగిడి):** అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలకు మెరుగైన వైద్యాన్ని అందించాలనే లక్ష్యంతో కుత్బుల్లాపూర్ బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ సూరారం డివిజన్ కు చెందిన ఇద్దరు నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరు చేయించిన ఎల్ఓసీ పత్రాలను బుధవారం చింతల్ లోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కుటుంబసభ్యులకు అందజేశారు. అందులో భాగంగా129 - జీడిమెట్ల డివిజన్ సంజయ్ గాంధీ నగర్ కు చెందిన రాజేంద్రన్ దివ్యాన తండ్రి శ్రీధరన్ రాజేంద్రన్ కు రూ. 2.75 లక్షలు, జీడిమెట్ల డివిజన్ విశ్వకర్మ కాలనీ అశోక్ కుమార్ పండిత్ తండ్రి సీతారామ్ పండిత్ కు రూ. 3.5 లక్షలు మంజూరు కాగా వాటికి సంబంధించిన పత్రాలను కుటుంబ సభ్యులకు అందజేశారు.

# ప్రభుత్వ పనితీరును ప్రజలు గమనిస్తున్నారు

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- రూ.80 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- విద్యుత్ ప్రమాద బాధిత కుటుంబానికి రూ.5 లక్షల చెక్కు అందజేసిన ఎమ్మెల్యే



**హనుమకొండ, ఆగస్టు 6 (సింగిడి):** దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న కాజీపేట దర్గా రోడ్ నిర్మాణంలో భాగంగా రూ.50 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి బుధవారం శంకు స్థాపన చేశారు. అనంతరం దర్గా ఉత్సవాల సమయంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి రూ.30 లక్షలతో వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులకు కూడా శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాజీపేట దర్గా రోడ్ సమస్య దశాబ్దాలుగా ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని తెలిపారు. బోడగుట్ట, కడిపికొండ, ఇందిరానగర్ తదితర ప్రాంతాలకు వెళ్లే వేలాది మంది ప్రజలు ఈ రహదారిపై ఆధారపడు తున్నారని, గతంలో ఈ సమస్యపై అనేక ధర్నాలు, ఆందోళనలు, పోలీసు పికెటింగ్‌లు జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. దర్గా పెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో సమస్యకు పరిష్కారం లభించడంసంతోషకరమని అన్నారు. నెల రోజుల్లో రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన గడువు విధించినట్లు తెలిపారు. అదేవిధంగా ఆర్ఈసీ రోడ్ నుంచి బయటకు వెళ్లే ప్రధాన రహదారి అభివృద్ధికి సుమారు రూ.20 కోట్ల విలువైన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు ఆయన తెలిపారు. ఆ ప్రతిపాదనలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని, ఎంపీ డాక్టర్ కావ్యతో పాటు సంబంధిత మంత్రులతో కూడా ఈ అంశంపై చర్చించినట్లు వెల్లడించారు. నియోజకవర్గంలో ప్రతి గల్లీలో రోడ్లు, డ్రైనేజీలు, మౌలిక వసతుల కల్పనతో ప్రజా సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అయితే అభివృద్ధిని చూసి ఓర్వలేని కొందరు ప్రతిపక్ష నాయకులు అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. తాము తీసుకొచ్చిన అభివృద్ధి పనులపై కూడా నిరాధార ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు. దర్గా రోడ్, కాజీపేట బస్టాండ్, రైల్వే ఓవర్ బ్రిడ్జి వంటి దశాబ్దాల సమస్యలను పరిష్కరించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుంటే, కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న పనుల విషయంలో కూడా రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడం తగదన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్, ఇతర అభివృద్ధి ప్రాజెక్టులు, పట్టణ మౌలిక వసతుల అభివృద్ధిని కూడా కొందరు కావాలనే అడ్డుకున్నారని ఎమ్మెల్యే ఆరోపించారు. ప్రజల సంక్షేమం కంటే రాజకీయాలకే ప్రాధాన్యత ఇస్తున్న ఇలాంటి అభివృద్ధి నిరోధకులను ప్రజలు గుర్తించాలని పిలుపునిచ్చారు. వరంగల్ నగరం అభివృద్ధి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, గత రెండున్నర సంవత్సరాల్లో అనేక కీలక సమస్యలకు పరిష్కారం చూపామని తెలిపారు. ముప్పై సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తున్న ప్రభుత్వం పనితీరును ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. అభివృద్ధిని అడ్డుకునే శక్తులను ప్రజలు తిరస్కరించి, అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి ప్రజల్లో ఆదరణ పెరగడం స్థానికంగా బీజేపీ,బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు ప్రజలను తప్పు ద్రోవ పట్టించే విధంగా వ్యవహరిస్తున్నారని ఆయన మండిపడ్డారు. అనంతరం ఇటీవల విద్యుత్ ప్రమాదం లో మృతి చెందిన పోతురవేణ శివకుమార్ కుటుంబానికి విద్యుత్ శాఖ ద్వారా మంజూరైన రూ.5 లక్షల ఆర్థిక పరిహార చెక్కును ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కుటుంబ సభ్యులకు అందజేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాజీపేట దర్గా పీఠాధిపతి,రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ కుసుర్ పాషా,మాజీ కార్పొరేటర్లు సర్తాజ్ బేగం,అబూబకర్,జక్కుల రవీందర్,డివిజన్ అధ్యక్షులు రవి, నాయకులు అంకుష్,మట్టెడ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక అక్షరాస్యతపై గ్రామస్తులకు అవగాహన




**కోదాడ, ఆగస్టు 6 (సింగిడి):** అనంతగిరి మండలంలోని పాలవరం గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం-- కోదాడ ఆధ్వర్యంలో బుధవారం ఆర్థిక అక్షరా స్యత, పొదుపు అలవాట్లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బ్యాంకింగ్ సేవల వినియోగం, డిజిటల్ లావాదేవీలు, పొదుపు ప్రాముఖ్యత, బీమా, పెన్షన్ పథకాలు, రుణాల వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్ర త్తలు, సైబర్ మోసాల నివారణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రతి కుటుంబం ఆర్థిక ప్రణాళికతో ముందుకు సాగాలని, ప్రభుత్వ, బ్యాంకుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని వక్తలు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ మట్టపల్లి నరేష్, ఉప సర్పంచ్ బెల్లంకొండ అంజయ్య, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మట్టపల్లి రామకోటయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ మట్టపల్లి శ్రీదేవి, ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ప్రతినిధులు, గ్రామ పంచాయతీ సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే గండ్రను విమర్శించే స్థాయి బీఆర్ఎస్ నాయకులకు లేదు



**భూపాలపల్లి ఆగస్టు 6 (సింగిడి):** భూపాలపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు చేసే అభివృద్ధిని చూసి ఓర్వలేక బిఆర్ఎస్ పార్టీ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారు అన్నారు భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాల యంలో పట్టణ అధ్యక్షుడు దేవాన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దాట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశ నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ నాయకులు స్థాయిని మించి మాట్లాడుతున్నారు అని అన్నారు గతంలో వాళ్ల పార్టీ మాజీ ఎమ్మెల్యే పెట్రోల్ ట్యాంకర్లు అక్రమంగా కర్ర వ్యాపారం చేసి జైలుకు వెళ్లి రావడం కూడా జరిగింది భూములను కబ్జా చేసి వందల ఎకరాలు సంపాదించిన నాయకుడు వారి పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే కావున ఇతర నాయకులు అలాంటి తప్పులు చేస్తారని మా పార్టీ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక అసత్య ఆరోపణలు చేస్తున్నారు అని వారు విమర్శించారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ అప్పం కిషన్ కురిమిళ్ళ శ్రీనివాసు సహదేవు దుర్గం రాధ కో ఆప్షన్ సభ్యులు హఫీస్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## ఇస్రోలో ఉద్యోగం సాధించిన శ్రీనాథ్‌కు సన్మానం



**భూపాలపల్లి ఆగస్టు 6 (సింగిడి):** భూపాలపల్లి మండలం ఆజాంనగర్ గ్రామానికి చెందిన కోరవేణి శ్రీనాథ్ ఇస్రోలో ఎలక్ట్రికల్ విభాగానికి సంబంధించిన పోటీ పరీక్షల్లో విజయం సాధించాడు. ఈ సందర్భంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ బుధవారం శ్రీనాద్ ను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రవి పటేల్ బుధవారం శ్రీనాద్ ను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. రవి పటేల్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా అంతరిక్ష రంగంలో ఎన్నో అద్భుతమైన విజయాలు సాధిస్తూ, దేశ ప్రతిష్టతను ప్రపంచ స్థాయిలో చాటుతున్న ఇస్రో వంటి ప్రతిష్టాత్మక సంస్థలో శ్రీనాథ్ ఉద్యోగం సాధించడం అభినందనీయమని కొనియాడారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన యువకుడు ప్రతిభతో ఇస్రోలో ఉద్యోగం సాధించడం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి జిల్లా, రాష్ట్రం,దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## అమ్మ పేరిట ప్రతిఒక్కరూ మొక్కను నాటాలి

ప్రిన్సిపాల్ వెంకటేషులు




**సూర్యాపేట ప్రతినిధి, ఆగస్టు 6 (సింగిడి):** వాతావరణ సమతుల్యత పర్యావరణ పరిరక్షణ కొరకు అమ్మ పేరుమీద ప్రతి ఒక్కరు ఒక మొక్కను నాటాలని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి. వెంకటేశులు అన్నారు. బుధవారం కళాశాలలో అమ్మ పేరిట ఒక మొక్కను నాటే కార్యక్రమంలో భాగంగా సిటిఓ నాగు నాయక్ ఎన్సిసి విద్యార్థుల తో కలిసి కళాశాల ఆవరణలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాటిన ప్రతి మొక్కను రక్షించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గుర్తు చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా విద్యార్థులు ఖాళీ ప్రదేశాలలో మొక్కలను నాటాలని సూచించారు. భవిష్యత్తు తరాలకు పచ్చని వాతావరణం అందించాలని పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి సామాజిక బాధ్యత అని తెలిపారు అనంతరం మొక్కను నాటి నీరు పోశారు.

## ఘనంగా "పీపుల్స్ ఫిజియోథెరపీ" క్లినిక్ 10వ వార్షికోత్సవ వేడుకలు



**మిర్యాలగూడ, ఆగస్టు 6 (సింగిడి):** పట్టణంలోని డాక్టర్స్ కాలనీలో ఉన్న పీపుల్స్ ఫిజియోథెరపీ క్లినిక్ 10వ వార్షికోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్లినిక్ వ్యవస్థాప కులు డా. ఎస్. రాజేష్ (ఎం.పీ.టీ -- న్యూరో), సీనియర్ ఫిజియోథెరపిస్ట్ మాట్లాడుతూ, గత పది సంవత్సరాలుగా వెన్నునొప్పి, మెడనొప్పి, కీళ్ల నొప్పులు, పక్షవాతం (స్ట్రోక్), నరాల సంబంధిత సమస్యలు, స్పోర్ట్స్ గాయాలు, శస్త్రచికిత్స అనంతర పునరావాసం వంటి అనేక సమస్యలకు ఆధునిక ఫిజియోథెరపీ చికిత్సలను అందిస్తూ, వేలాది మంది రోగులకు సేవలందించడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా క్లినిక్‌పై విశ్వాసం ఉంచి సహకరించిన రోగులు, వైద్యులు, శ్రేయోభిలాషులు మరియు ప్రజలకు డా. రాజేష్ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా నాణ్యమైన, ఆధునిక ఫిజియోథెరపీ సేవలను మరింత విస్తృతంగా అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ బి. ప్రభుదాస్, డి. హరిబాబు, ఏ. చాంప్లా, కే. సుజాత, బి. తిరుపా, జి. మరియన్, ఎస్ఐ ఎస్. శ్రీనివాస్, కే. తిరుమలేశ్, ఎం.డి. శుభానాలీ, సి. హెచ్. లక్ష్మయ్య తదితరులు పాల్గొని, క్లినిక్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

# గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ పెద్దపీట

- గౌరాయిపల్లిలో పర్యటించిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య
- అభివృద్ధి పనుల ప్రారంభం..
- ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై సమీక్ష



**ఆలేరు, ఆగస్టు 6 (సింగిడి):** గ్రామాల సమగ్ర అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం గౌరాయిపల్లి గ్రామంలో బుధవారం ఆయన విస్తృతంగా పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకోవడంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఉదయం గ్రామంలో మార్నింగ్ వాక్ నిర్వహించిన అయిలయ్య ఇంటింటికీ వెళ్లి గ్రామస్తులను ఆప్యాయంగా పలకరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజాప్రతినిధులే నిజమైన సేవకులని ఆయన పేర్కొన్నారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. ఇళ్ల నిర్మాణంలో నాణ్యతకు ఎలాంటి రాజీ పడకుండా నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రెండో విడతలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఆలేరు నియోజకవర్గానికి అత్యధిక ఇళ్ల మంజూరు జరిగేలా ప్రత్యేకంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి, నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. గ్రామాల్లో రహదారులు, తాగునీటి సౌకర్యం, డ్రైనేజీలు, ఇతర మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తూ అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. తదుపరి గ్రామ చేనేత సంఘం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొని సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. చేనేత రంగాన్ని బలోపేతం చేయడానికి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని, చేనేత కార్మికుల అభ్యున్నతికి అన్ని విధాలా అండగా నిలుస్తామని చెప్పారు. గౌరాయిపల్లి గ్రామంలో ఇప్పటికే పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, రానున్న రోజుల్లో మరిన్ని పనులు చేపట్టి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని అయిలయ్య తెలిపారు. ఆలేరు నియోజకవర్గంలోని చెరువులను నీటితో నింపేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటోందని, గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఆలేరు నియోజకవర్గాన్ని తెలంగాణలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ఆలేరు నియోజకవర్గానికి ప్రాధాన్యం కల్పించేలా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని, ప్రతి అర్హ కుటుంబానికి సొంత ఇంటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య స్పష్టం చేశారు.

## పంచాయతీల్లో పడకేసిన క్లోరోస్కోప్ కిట్లు.!

నాణ్యత లేని తాగునీరే ప్రజలకు దిక్కు
జ్వరాల బారిన పడుతున్న ప్రజలు
పట్టించుకోని అధికారులు



**హన్మకొండ, ఆగస్టు 6 (సింగిడి):** మిషన్ భగీరథ జలాల నాణ్యతను పరీక్షించడంలో భాగంగా ప్రభుత్వం పంచాయతీలకు క్లోరోస్కోప్ కిట్లను అందించింది. వర్షాకాలం నేపథ్యంలో ప్రతి రోజు ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించేందుకు వీటి ఉపయోగ బాధ్యత పంచాయితీ కార్యదర్శుల పర్యవేక్షణతో పాటు ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు నీటి నాణ్యత ను పరీక్షించాల్సిన బాధ్యత ఉంది. ఈ క్రమంలోనే ప్రతి పంచాయతీకి ఒక క్లోరోస్కోప్ కిట్టును పంపిణీ చేశారు. వీటి పనితీరు వాడే విధానంపై మిషన్ భగీరథ అధికారులు అవగాహన కల్పించాల్సిన బాధ్యత కూడా అవసరమే.కానీ కొన్ని చోట్ల నామమాత్రంగా వినియోగిస్తుండగా మరి కొన్నిగ్రామాల్లోనీ పంచాయతీలకు కిట్ల జాడ లేదనీ స్పష్టమౌతుంది. ఉన్న పంచాయితీలలో ఉపయోగం లేకుండా పోయాయనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ప్రధానంగా తాగునీటి ట్యాంకులు, చేతిపంపులు బోరు బావులకు చెందిన నీటి నాణ్యత పరీక్షల నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. నిబంధనల మేరకు క్లోరోస్కోప్ కిట్ తో ప్రతిరోజు ట్యాంకు వద్ద,ట్యాంకు నుంచి గ్రామానికి సరఫరా చేసే పైపులైన్ల మధ్యలో చివరి ఇండ్ల వద్ద మరోచోట మొత్తం మూడు చోట్ల రెండు చొప్పున ఆరు నీటి నమూనాలు స్వీకరించి పరీక్షించాల్సి ఉంటుంది.అందులో వచ్చిన ఫలితం ఆధారంగా తాగేందుకు నీరు పనికొస్తుందా లేదా అనేది నిర్ధారించాల్సి ఉంది. అయితే జిల్లాలో ఎక్కడ అమలు కావడం లేదనే విమర్శలు వినవస్తున్నాయి. ట్యాంకులు అపరిశుభ్రత పైపు లైన్ల లీకేజీలతో గ్రామాల్లో తాగునీరు కలుషిత మౌతుంది. తాగు నీటిని నేరుగా సరఫరా చేసే చోట నాణ్యత ఉండటం లేదు. నెలలో మూడు సార్లు ట్యాంకులు శుభ్రం చేయాల్సి ఉండగా ఎక్కడ పాటించడం లేదు. ప్రతిరోజు ట్యాంకుల్లో బ్లీచింగ్ పౌడర్ కలిపిన తర్వాతే నీటిని సరఫరా చేయాలి. క్లోరోస్కోప్ కిట్ల వినియోగంలో మిషన్ భగీరథ, పంచాయితీ అధికారుల మధ్య సంబంధం లోపిస్తుందనే విమర్శలు కూడా లేకపోలేదు. కిట్లను వాడకపోవడంతో అందులోని రసాయనాలు, ద్రావణాలు కరిగిపోయి ఉపయోగం లేకుండా పోయాయని తెలుస్తుంది. నీటిని పరీక్షించిన తర్వాత లోపాన్ని గుర్తించి అధికారులకు సమాచారం ఇస్తే సరిచేసే అవకాశం ఉంది.

**హెచ్చుతగ్గులతో అనర్థాలు..**

నీటిలో క్లోరిన్ శాతం హెచ్చుతగ్గులతో అనర్థాలు ఎదురవుతున్నాయనీ ఆరోపణ విలువస్తున్నాయి. పదివేల లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంకులు 45 గ్రాముల బ్లీచింగ్ పౌడర్ ను నీటిలో కలిపి సరఫరా చేయాలి. లీటర్ నీటిలో 0.2 మిల్లీ గ్రాముల నుంచి 1.5 మిల్లీగ్రాముల లోపు క్లోరిన్ ఉండాలి. భగీరథ జలాల శుద్ధి చేసిన తర్వాతే వదులుతున్న తాగు నీరు పైప్లైన్ లీకేజీలతో క్లోరిన్ శాతం పెరగడం,తగ్గడం జరుగుతుంది. వర్షాకాలం నేపథ్యంలో అతిసారం వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉందనీ పలు గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 210 గ్రామపంచాయతీలకు క్లోరోస్కోప్ కిట్లను అందచేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా వర్షాకాలం నేపథ్యంలో నీటి నాణ్యతను పరీక్షించేందుకు క్లోరోస్కోప్ కిట్లను ఉపయోగించి ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలని ప్రజలు కోరుతున్నారు.

## వివాదాలకు రాజీమార్గమే శాశ్వత పరిష్కారం

గ్రామాల్లో విస్తృత న్యాయ అవగాహన సదస్సులు




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, ఆగస్టు 6 (సింగిడి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కొంపెల్లి, తండా, గొర్లవీడు, ఆన్ సాన్‌పల్లి గ్రామాల్లో మొబైల్ న్యాయ అవగాహన వ్యాన్ ద్వారా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామీణ ప్రజల్లో చట్టాలపై అవగాహన పెంపొందించడంతో పాటు వివాదాలను రాజీమార్గంలో పరిష్కరించుకోవాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కంప అక్షయ మాట్లాడుతూ, కోర్టు కేసుల్లో చిక్కుకుని ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలు, న్యాయ సహాయం పొందలేని నిస్సహాయులు, కుటుంబ, సివిల్, ప్రామిసరీ నోట్ తదితర వివాదాల్లో ఉన్నవారు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. అర్హులైన వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. అలాగే జాతీయ న్యాయ సేవాధికార సంస్థ అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పిస్తూ, టోల్‌ఫ్రీ నంబర్ 15100 ద్వారా కూడా సేవలు పొందవచ్చని వివరించారు. సూపరింటెండెంట్ రఘురామ్ మాట్లాడుతూ, చిన్నచిన్న వివాదాలను కోర్టుల వరకు తీసుకెళ్లకుండా రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలని, లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. గ్రామాల్లో సోదరభావంతో కలిసిమెలిసి జీవించడం వల్ల సామాజిక ఐక్యత బలోపేతమవుతుందని అన్నారు. కార్యక్రమంలో కొంపెల్లి సర్పంచ్ సడాలా శ్రీకాంత్, ఉపసర్పంచ్ మద్రి శ్రీనివాస్, తండా సర్పంచ్ పాల్తియా నిర్మల--సతీష్, ఉపసర్పంచ్ గుగులోత్ వాలు నాయక్, గొర్లవీడు సర్పంచ్ లావణ్య సాగర్ రెడ్డి, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది అంబాల దేవేందర్, కె. వెంకటేష్, ఎం. రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాలే శిశువుకు తొలి హక్కు తొలి సహజ టీకా

- ఐసీడీఎస్ ఆలేరు ప్రాజెక్టు కార్యాలయంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



**ఆలేరు, ఆగస్టు 6 (సింగిడి):** తల్లిపాలే ప్రతి శిశువుకు తొలి హక్కు, సంపూర్ణ పోషకాహారం, తొలి సహజ టీకా అని ఐసీడీఎస్ ఆలేరు ప్రాజెక్టు సీడీపీఓ స్వరాజ్యం రేఖల పేర్కొన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా బుధవారం ఆలేరు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో గర్భిణులు, బాలింతలు, వారి భర్తల కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన ప్రతి శిశువుకు ప్రసవం జరిగిన తొలి గంటలోపే తల్లిపాలను ప్రారంభించడం అత్యంత కీలకమని చెప్పారు. పుట్టిన వెంటనే వచ్చే ముర్రుపాలు (కొలస్ట్రం) శిశువుకు తొలి సహజ టీకా వంటివని, ఇవి శిశువులో రోగనిరోధక శక్తిని పెంచి అనేక అంటువ్యాధుల నుంచి రక్షిస్తాయని వివరించారు. మొదటి ఆరు నెలల వరకు పూర్తిగా తల్లిపాలే ఇవ్వాలని, ఈ కాలంలో నీరు, జంతుపాలు లేదా ఇతర ఆహార పదార్థాలు ఇవ్వకూడదని సూచించారు. అనంతరం వయస్సుకు తగిన అనుబంధ పోషకాహారాన్ని ప్రారంభిస్తూ రెండు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం వరకు తల్లిపాలను కొనసాగించడం శిశువు ఆరోగ్యకరమైన ఎదుగుదలకు ఎంతో అవసరమన్నారు. తల్లిపాలు శిశువుకు అవసరమైన అన్ని పోషకాలను అందించడమే కాకుండా మెదడు అభివృద్ధి, శారీరక ఎదుగుదల, రోగనిరోధక శక్తి పెంపునకు దోహదపడతాయని తెలిపారు. అలాగే తల్లులకు కూడా రొమ్ము క్యాన్సర్, అండాశయ క్యాన్సర్ వంటి వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడంలో తల్లిపాలు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. తల్లి--శిశు మధ్య ఆప్యాయత, భావోద్వేగ బంధాన్ని బలోపేతం చేయడంలో కూడా తల్లిపాల ప్రాధాన్యం ఎంతో ఉందన్నారు. ప్రతి కుటుంబం తల్లిపాలను ప్రోత్సహించే వాతావరణాన్ని కల్పించాలని, గర్భిణులు, బాలింతలకు కుటుంబ సభ్యులు అన్ని విధాలా సహకరించాలని పిలుపునిచ్చారు. తల్లిపాలే ప్రతి బిడ్డకు తొలి హక్కు, ప్రతి తల్లికి మద్దతు ఇవ్వడం కుటుంబం, సమాజం బాధ్యత. ఆరోగ్యవంతమైన, పోషకాహార లోపం లేని తెలంగాణ నిర్మాణానికి అందరూ కలిసి కృషి చేయాలి" అని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధికారులు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తూ పలు సూచనలు చేశారు. శిశువు పుట్టిన గంటలోపు తల్లిపాలు ప్రారంభించడం, తొలి ఆరు నెలలు పూర్తిగా తల్లిపాలే ఇవ్వడం, అనంతరం అనుబంధ పోషకాహారంతో పాటు తల్లిపాలను కొనసాగించడం వంటి అంశాలను వివరించారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ ఎఫ్ హెచ్ ఎస్) గణాంకాల ప్రకారం, పుట్టిన గంటలోపు తల్లిపాలు ప్రారంభించే శాతం గత సర్వేతో పోలిస్తే పెరిగినప్పటికీ, తొలి ఆరు నెలలు పూర్తిగా తల్లిపాలు ఇచ్చే విషయంలో ఇంకా మరింత అవగాహన, కుటుంబ సహకారం అవసరమని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్లు దివ్య, ఉమా రాణి, అండాలు, నజమున్నిసా, జ్యోతి, మనోహర, పోషణ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ ప్రతికంఠం రత్నం రాజు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ

- పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ భాస్కర్

**వనపర్తి ప్రతినిధి, ఆగస్టు 6 (సింగిడి):** పోలీసు సబ్ ఇన్స్పెక్టర్, కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వనున్నట్లు పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ గద్దె భాస్కర్, రాంకీ ఫౌండేషన్ అధ్యక్షుడు రామ్ రెడ్డి లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పి.మధుకర్ స్వామి (డీసీపీ) సారథ్యంలో రాష్ట్ర పోలీసు శాఖలో సబ్-ఇన్స్పెక్టర్, కానిస్టేబుల్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్, రాంకీ ఫౌండేషన్, లైన్స్‌క్లబ్ ఆఫ్ గ్రీన్ ల్యాండ్స్ ఆఫ్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ ఉచిత రెసిడెన్షియల్ శిక్షణకు అర్హులైన అభ్యర్థులు నేటినుండి దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. దరఖాస్తులు పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ ఫేస్‌బుక్ పేజీ, యూట్యూబ్ ఛానల్, టెలిగ్రామ్ గ్రూప్ లేదా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న క్యూఆర్ కోడ్ లేదా లింక్ ద్వారా సమర్పించవచ్చన్నారు. దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ ఆగస్టు 12వ తేదీ రాత్రి 9:00 గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థుల ఎంపిక కోసం ఆగస్టు 16వ తేదీ ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 10 పరీక్షా కేంద్రాలలో అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు వారు వెల్లడించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అభ్యర్థులకు వనపర్తి పరీక్షా కేంద్రంగా ఉంటుందని పేర్కొన్నారు. అర్హత పరీక్షలో మెరిట్ ఆధారంగా ఎంపికైన 300 మంది అభ్యర్థులకు నాగర్‌కర్నూల్ జిల్లా వట్టెంలోని పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ క్యాంపస్‌లో పూర్తిగా ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ అందించడం జరుగుతుందని చెప్పారు. ఈ శిక్షణ తెలంగాణ ప్రభుత్వం నిర్వహించే పోలీసు నియామక ప్రక్రియలోని మెయిన్ పరీక్ష వరకు నిరంతరంగా కొనసాగుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్- 9542433427కు సంప్రదించాలని కోరారు.

# సైబర్ నేరాలకు అప్రమత్తతే అస్త్రం

మోసానికి 1930కు ఫిర్యాదు చేయండి

కేటీపీపీ ఉద్యోగులకు సైబర్‌పై సూచనలు

జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, ఆగస్టు 6 (సింగిడి):** డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు కొత్త రూపాల్లో విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ పిలుపునిచ్చారు. భూపాలపల్లి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఘనపూర్ మండలం చెల్పూర్‌లోని కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టు (కేటీపీపీ)లో "సురక్షా కా తిరంగా" కార్యక్రమం సందర్భంగా ఉద్యోగులకు నిర్వహించిన సైబర్ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆన్‌లైన్ లావాదేవీల సమయంలో తెలియని వ్యక్తుల ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకులు, ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దని సూచించారు. డిజిటల్ అరెస్ట్, ఇన్వెస్ట్‌మెంట్, ట్రేడింగ్, కేవైసీ అప్‌డేట్, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, లోన్ యాప్స్, క్రిప్టో కరెన్సీ పెట్టుబడుల పేరుతో జరుగుతున్న మోసాల పట్ల ప్రత్యేక అప్రమత్తత అవసరమన్నారు. సైబర్ మోసానికి గురైన వెంటనే తొలి గంట (గోల్డెన్ అవర్) అత్యంత కీలకమని, ఆలస్యం చేయకుండా 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయడం లేదా ఙఙఙ.ఎఎవతీఎతీఅఎవ.స్త్రశీజ.ఱఅలో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. తక్షణ చర్యలతో మోసపోయిన నగదును నిలిపివేసి తిరిగి పొందే అవకాశాలు మెరుగుపడతాయని వివరించారు. లోన్ యాప్స్ ద్వారా రుణాలు తీసుకోవద్దని, బ్యాంకుల ద్వారానే రుణాలు పొందాలని, అధిక లాభాల పేరుతో పెట్టుబడులు పెట్టాలని ప్రలోభపెట్టే వ్యక్తులను నమ్మవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జెన్‌కో ఇన్‌చార్జి సీఈ కోటేశ్వరరావు, అదనపు ఎస్పీ నరేష్ కుమార్, భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు, ఘనపూర్ సీఐ కర్ణాకర్ రావు, కేటీపీపీ అధికారులు, ఉద్యోగులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# పచ్చి కూరగాయల పప్పు..

## దీని ముందు చికెన్.. మటన్ కూడా పనికిరావు



**కావాల్సిన పదార్థాలు:**

ఒక కప్పు కంది పప్పు, నాలుగు టమాటాలు, నాలుగు పచ్చిమిర్చి, నాలుగు బీన్స్, నాలుగు బంగాళాదుంప, కొద్దిగా కాలీఫ్లవర్, రెండు ఉల్లిపాయలు, ఒక టేబుల్ స్పూన్ అల్లం-వెల్లుల్లి పేస్ట్, కొద్దిగా తాలింపు గింజలు, రుచికి సరిపడా ఉప్పు, ఒక టేబుల్ స్పూన్ పసుపు, కొద్దిగా కారం, ఇంకా నూనెను తీసుకోవాలి.

**పప్పును బాగా ఉడికించుకోవాలి:**
ముందుగా ఒక కప్పు కంది పప్పును తీసుకుని కనీసం మూడు రెండు సార్లు కడిగి, కనాలుగు ప్పుల నీరు, ఇంకా దీనిలో ఒక టేబుల్ స్పూన్ పసుపు, అలాగే పప్పు ఉడకడానికి నూనెను వేసి ప్రెజర్ కుక్కర్‌లో వీటిని బాగా ఉడికించాలి. మీరు ఇంట్లో చేసేటప్పుడు కూడా ఇలాగే చేయండి.

**కూరగాయలను మెత్తగా ఉడికించుకోవాలి:**

పప్పు బాగా ఉడికిన తర్వాత మీరు కట్ చేసుకున్న కూరగాయలు వేసి, వాటిలో కొద్దిగా అంటే రుచికి సరిపడా ఉప్పు, మళ్ళీ టేస్టింగ్ సాల్ట్ వేసి కూరగాయలు మెత్తగా అయ్యే వరకు దీని మీద మూత పెట్టి ఈ పప్పును బాగా ఉడికించాలి. ఇలా ఉడికిస్తే పప్పు మరింత రుచిగా ఉంటుంది.

**టమోటాలను బాగా ఉడికించుకోవాలి :**
ఇక ఇప్పుడు దీనిలో కట్ చేసిన టమోటా ముక్కలు, ఒక టేబుల్ స్పూన్ కారం వేసి స్టవ్ మీద ఉంచి మెత్తగా అయ్యే వరకు బాగా ఉడికించాలి. అలాగే, దీనిలో ఒక గ్లాస్ నీళ్లు పోసి, ఇంకా మంచి రుచి రావాలంటే ఈ పప్పును 10 నిమిషాల పాటు మీడియం మంట మీద గ్యాస్ మీదే ఉంచి ఉడికించాలి.

**పప్పును పోపు పెట్టుకోవాలి:**

ఇప్పుడు రెండో సారి మళ్ళీ స్టవ్ వెలిగించి చిన్న పాన్ పెట్టుకుని దానిలో 4 టేబుల్ నూనె చేసి పోపు గింజలు, నాలుగు ఎండుమిర్చి, కొద్దిగా జీలకర్ర, 5 కరివేపాకు ఆకులు కూడా దీనిని పోపు పెట్టుకోవాలి. ఆ తర్వాత కట్ చేసిన ఉల్లిపాయ, నాలుగు పచ్చిమిర్చి ముక్కలు, అల్లం-వెల్లుల్లి పేస్ట్ కలపాలి. అంతే, పచ్చి కూరగాయల పప్పు రెడీ.



# రోటి పచ్చడి..

## తింటే భోజనం ప్లేట్ ఖాళీ కావడం ఖాయం!



బెండకాయ రోటి పచ్చడికి కావాల్సిన పదార్థాలు: పావుకిలో బెండకాయలు, ఒక ఉల్లిపాయ, 10 పచ్చిమిర్చి, 6 వెల్లుల్లి రెబ్బలు, చిన్న నిమ్మకాయంత చింతపండు, ఒక టేబుల్ స్పూన్ జీలకర్ర , ఒక టేబుల్ స్పూన్ ధనియాలు, రుచికి సరిపడా ఉప్పు, రెండు టేబుల్ స్పూన్స్ నూనె, అలాగే తాలింపు కోసం అర టీ స్పూన్ ఆవాలు, అర టీ స్పూన్ మినప్పప్పు, రెండు ఎండు మిర్చి, నాలుగు కరివేపాకులు తీసుకోవాలి.

బెండకాయ రోటి పచ్చడి తయారీ విధానం: ముందుగా బెండకాయలను తీసుకుని బాగా కడిగి వాటిని బాగా ఆరనివ్వాలి. ఇంకా వీటిని చిన్న చిన్న ముక్కలుగా కట్ పెట్టుకోవాలి. పాన్‌లో ఒక స్పూన్ ఆయిల్ వేసి అర టేబుల్ స్పూన్ జీలకర్ర, అర టేబుల్ స్పూన్ ధనియాలు, నాలుగు పచ్చిమిర్చి, నాలుగు వెల్లుల్లి కూడా వేయించి పక్కన పెట్టుకోవాలి.

అదే పాన్‌లో ఇంకో స్పూన్ ఆయిల్ వేసి నాలుగు బెండకాయ ముక్కలను వేసి బాగా వేయించాలి. ఇంకా ఈ బెండకాయలో జిగురు పూర్తిగా పోయి వాటిని గోల్డ్ కలర్లోకి వచ్చే వరకు వీటిని బాగా వేయించాలి. ఇప్పుడు కట్ చేసిన ఉల్లిపాయ ముక్కలు కూడా వేసి రెండు నిమిషాల వేయించాలి. ఇంకా వీటితో పాటు చింతపండును కూడా కొద్దీ పాటు నానబెట్టి రెడీ చేసుకోవాలి.

ఇప్పుడు మిక్సీలో వీటిని బాగా వేయించి ఇంకా వీటితో పాటు కొద్దిగా జీలకర్ర, ఒక టేబుల్ స్పూన్ ధనియాలు, నాలుగు పచ్చిమిర్చి, నాలుగు వెల్లుల్లి, కొద్దిగా చింతపండు, వీటిలో ఉప్పు వేసి మెత్తగా పట్టుకోవాలి. ఆ తరవాత వేయించిన బెండకాయకాను వేసి రోటిలో దంచుకోవడమే. మిక్సీ పట్టుకున్న పచ్చడిని దీనిలో కొద్దిగా దంచుకోవాలి. చివర్లో ఈ తాలింపు వేసి మంచిగా కలిపితే టేస్టీ టేస్టీ బెండకాయ రోటి పచ్చడి రెడీ.

రాగి సంకటి, జొన్న రొట్టెలోకి సూపర్ : మిక్సీలో వీటిని మెత్తగా చేయకుండా కచ్చా పచ్చాగా దంచితే మంచి రుచి వస్తుంది. ఇంకా ఈ బెండకాయ రోటి పచ్చడిని వేడి వేడి అన్నంలో కలిపి తింటే డబుల్ రుచితో మంచిగా ఉంటుంది. అంతే కాదు, వీటిని రాగి సంకటి, జొన్న రొట్టెలు, చపాతీలతో తింటే వదలకుండా తింటారు.






వేసవి కాలం రాగానే దాహం, అలసట సహజం. ఈ సమస్యలను అధిగమించడానికి మార్కెట్లో దొరికే కృత్రిమ కూల్ డ్రింక్స్ కంటే, మన స్థానిక బెర్రీలే ఉత్తమం. మన ఆహార సంప్రదాయాల్లో భాగమైన జామూన్, ఫల్సా వంటి పండ్లు రోగనిరోధక శక్తిని పెంచి మనల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. అద్భుతమైన రుచి, పోషకాలను అందించే ఆ దేశీ బెర్రీల గురించి తెలుసుకుందాం!

# సమ్మర్‌లో ఈ ఫ్రూట్స్ తినకపోతే చాలా మిస్ అయినట్టే..?

**వేసవిలో లభించే అద్భుతాలు**

వేసవి ఎండల నుంచి రక్షణ పొందడానికి మరియు శరీరానికి కావాల్సిన పోషకాలను అందించడానికి మనకు దొరికే స్థానిక పండ్లు ఎంతో సహాయపడతాయి. విదేశీ బ్లూబెర్రీలు, రాస్ప్‌బెర్రీల కోసం వెతకాల్సిన అవసరం లేదు, మన భారతదేశంలోనే ఎంతో కాలంగా వాడుకలో ఉన్న అద్భుతమైన బెర్రీలు ఎన్నో ఉన్నాయి.



**జామూన్ (నేరేడు):**
వేసవిలో అందరూ ఎదురుచూసే పండు ఇది. దీని ముదురు ఊదా రంగు, తీపి మరియు పులుపు కలిసిన రుచి ఎంతో బాగుంటుంది. వేసవిలో మనల్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది.

**ఫల్సా:**
చిన్నపాటి ఊదా రంగు పండు ఇది. దీన్ని ఎక్కువగా చల్లని పానీయాలు చేయడానికి ఉపయోగిస్తారు, ఇది శరీరానికి తక్షణ ఉల్లాసాన్ని ఇస్తుంది.

**కరోందా:**
వీటిని ఎక్కువగా పచ్చళ్లు, చట్నీలు చేయడానికి ఉపయోగిస్తారు. వీటి పుల్లని రుచి వంటకాలకు ప్రత్యేకతను తెస్తుంది.

**మల్బరీ:**
దేశవ్యాప్తంగా లభించే ఈ పండ్లు చాలా రసభరితంగా, తియ్యగా ఉంటాయి.

**రస్‌భరీ, మహువా:**
ఇవి కొన్ని ప్రాంతాలకే పరిమితమైనా, స్థానికులు వీటిని ఎంతో ఇష్టంగా తింటారు. ఇవి సంప్రదాయ ఆహారంలో భాగం.



**ఆరోగ్యంపై ప్రభావం**

ఈ పండ్లు కేవలం రుచికరమే కాదు, ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు శరీర కణాలను దెబ్బతినకుండా కాపాడతాయి. విటమిన్-సి అధికంగా ఉండటం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. పీచు పదార్థం (ఫైఅవతీ) జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది మరియు

సీజనల్ పండ్లను తినడం వల్ల తాజాగా పండించిన పంటను మనం ఆస్వాదించవచ్చు. ఇవి ఎక్కువ దూరం ప్రయాణించి రావు కాబట్టి, వాటి పోషకాలు అలాగే ఉంటాయి. వీటిని నేరుగా తినవచ్చు లేదా జ్యూస్‌లు, డెజర్ట్‌లలో వాడుకోవచ్చు. మీరు తదుపరిసారి మార్కెట్‌కు వెళ్ళినప్పుడు, ఈ దేశీ బెర్రీలను ఎంచుకోండి. వేసవిని సహజమైన రుచులతో, ఆరోగ్యంతో ఆస్వాదించండి. మన దేశీయ పండ్ల వైభవాన్ని గుర్తించి, వాటిని మన దైనందిన ఆహారంలో భాగంగా మార్చుకుందాం. ఇవి మనల్ని ఆరో గ్యంగా ఉంచడమే కాకుండా, మన సంప్రదాయాలను కూడా గౌరవించినట్లు అవుతుంది.



# స్టాక్ మార్కెట్ Stock Market

### మార్కెట్లపై ఐటీ దెబ్బ..

## నష్టాలతో ముగిసిన సూచీలు

దేశీయ మార్కెట్ల వరుస ర్యాలీకి బ్రేక్ పడింది. గత ఐదు సెషన్లలో లాభాలను ఆర్జించిన సూచీలు శుక్రవారం నష్టాలతో ముగిశాయి. టెక్ దిగ్గజం యాక్సెంచర్ ఆందోళనలు దేశీయ ఐటీ షేర్లను కుదిపేశాయి. దీంతో మార్కెట్లు పతనమయ్యాయి. చివర్లో కాస్త కొనుగోళ్లు జరిగినా.. సూచీల కు నష్టాలు తప్పలేదు. సెన్సెక్స్ 600 పాయింట్లు కోల్పోగా.. నిఫ్టీ 24వేల మార్క్‌ను కష్టంగా నిలబెట్టుకుంది.

ఐటీ షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడంతో ఆరంభం నుంచే సూచీలు ఢీలా పడ్డాయి. 76,852.86 పాయింట్ల వద్ద మొదలైన సెన్సెక్స్ ఒక దశలో ఏకంగా 940 పాయింట్లు దిగజారి 76,649 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని తాకింది. సెషన్ చివర్లో కనిష్ఠాల వద్ద కొనుగోళ్ల మద్దతు లభించడంతో నష్టం కొంత తగ్గింది. నేటి ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 607.08 పాయింట్లు పతనమై




76,802.90 వద్ద ముగిసింది. అటు నిఫ్టీ ) కూడా 26,373.20 - 24,047.20 మధ్య కదలాడింది. చివరకు 154.90 పాయింట్లు తగ్గి 24,013.10 వద్ద స్థిరపడింది. డాలర్‌తో పోలిస్తే మన కరెన్సీ రూపాయి మారకం విలువ 7 పైసలు పెరిగి 94.33 వద్ద ముగిసింది.

అంతర్జాతీయ టెక్ దిగ్గజం యాక్సెంచర్ తన ఆదాయ వృద్ధి అంచనాలను తగ్గించడంతో పాటు భవిష్యత్తులో డిమాండ్ బలహీనంగా ఉండొచ్చని పేర్కొంది. దీంతో ఈ రంగంపై ఆందోళనలు మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఫలితంగా నేటి ట్రేడింగ్‌లో ఐటీ కంపెనీల షేర్లు భారీగా కుదేలయ్యాయి. నిఫ్టీలో ఇన్ఫోసిస్ 6.75శాతం, టీసీఎస్ 3.55శాతం, టెక్ మహీంద్రా 2.63శాతం, హెచ్‌సీఎల్ టెక్నాలజీ 2.59శాతం మేర కుంగాయి. ఎటర్నల్, భారతీ ఎయిర్‌టెల్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎన్టీపీసీ, నెస్లే షేర్లు రాణించాయి. అమెరికా మార్కెట్లలో యాక్సెంచర్ షేర్లు గురువారం ఏకంగా 17శాతం మేర కుంగడం గమనార్హం.

### స్టార్‌లింక్‌కు పోటీగా

## శాట్‌కామ్ రంగంలోకి జియో

### ఆకాశ్ అంబానీ

**దిల్లీ:** టెలికాం సేవల విభాగంలో అగ్రగామిగా దూసుకుపోతున్న జియో... ఇప్పుడు స్వదేశీ కమ్యూనికేషన్ ఉపగ్రహాల ద్వారా అంతరిక్షం నుంచి కనెక్టివిటీని అందించేందుకు సిద్ధమవుతోంది. ఈ మేరకు శాట్‌కామ్ రంగంలో తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలని కంపెనీ చూస్తోందని జియో ప్లాట్‌ఫామ్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఆకాశ్ అంబానీ తెలిపారు. ప్రస్తుతం శాటిలైట్ కమ్యూనికేషన్స్ విభాగంలో ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్, ఫ్రాన్స్‌కు చెందిన యుటెల్‌శాట్ వంటి విదేశీ కంపెనీల హవా నడుస్తోంది. ఈ విభాగంలో జియో కూడా అడుగుపెట్టబోతోంది.

"జియో భారతదేశాన్ని భూమిపై అనుసంధానించింది. ఇప్పుడు అంతరిక్షం నుంచి అనుసంధానించాలి. జియో నెట్‌వర్క్ చేరుకోలేని మారుమూల గ్రామాలు, ద్వీపాలు, సరిహద్దు ప్రాంతాలు ఇంకా ఉన్నాయి. వాటిని అనుసంధానం చేయడానికి శాటిలైట్ కనెక్టివిటీ ఉపయోగపడుతుంది. ఇందుకోసం సొంతంగా లో ఎర్త్ ఆర్బిట్ శాటిలైట్ వ్యవస్థను అభివృద్ధి చేయడాన్ని జియో పరిశీలిస్తోంది" అని రిలయన్స్ ఇండస్ట్రీస్ వార్షిక సాధారణ సమావేశంలో




ఆకాశ్ అంబానీ వెల్లడించారు.

దీర్ఘకాలంలో సొంతంగా శాటిలైట్ వ్యవస్థను ఏర్పాటు చేసుకుంటూనే.. మరోవైపు సేవల లభ్యతను వేగవంతం చేయడానికి తాము అంతర్జాతీయ సంస్థలతో శాటిలైట్ సామర్థ్యాన్ని లీజుకు తీసుకుంటామని ఆకాశ్ అంబానీ తెలిపారు. దీనివల్ల మన కనెక్టివిటీ అవసరాలను జియో వేగంగా తీర్చడంతో పాటు ప్రపంచ స్థాయి భారతీయ శాటిలైట్ బ్రాడ్‌బ్యాండ్ ప్లాట్‌ఫారమ్‌కు పునాది వేస్తుందని వివరించారు. అలాగే, జియో తన సొంత గ్రౌండ్ స్టేషన్ మౌలిక సదుపాయాలను కూడా నిర్మిస్తోందని చెప్పారు. అంతరిక్ష రంగంలో జియో ఆత్మనిర్భరత వైపు అడుగులు వేస్తోందన్నారు.

### రిలయన్స్ జియో ఐపీఓ..

## సెబీకి ముసాయిదా పత్రాలు దాఖలు

మదుపరులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న 'జియో ఐపీఓ'కు సంబంధించి కీలక అప్‌డేట్ వచ్చేసింది. ఈ ఐపీఓకు సంబంధించిన డ్రాఫ్ట్ పేపర్లను మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీకి సమర్పించింది. అంతకుముందు జియో ప్లాట్‌ఫామ్స్ బోర్డు డీహెచ్‌ఆర్‌పీకి ఆమోదం తెలిపింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ వార్షిక సాధారణ సమావేశం (ఏజీఎం)లో ఐపీఓ పత్రాలను నేడే సమర్పించనున్నట్లు ముకేశ్ అంబానీ వెల్లడించిన కాసేపటికే సెబీకి ఈ పత్రాలు చేరాయి.

"ఇది నాతో పాటు రిలయన్స్ కుటుంబానికి, కోట్లాది మంది వాటాదారులకు భావోద్వేగభరిత క్షణం. జియో ఐపీఓకు సంబంధించిన డ్రాఫ్ట్ పేపర్లను బోర్డు ఆమోదించింది. ఈ రోజే సెబీకి సమర్పిస్తాం. ఈ ఏడాది రిలయన్స్‌కు జియో ఐపీఓ అత్యంత ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది. ఇది మా వాటాదారులకు గణనీయమైన విలువను అందించడంతో పాటు కొత్త పెట్టుబడిదారులకు ఆకర్షణీయమైన పెట్టుబడి అవకాశాన్ని కల్పిస్తుందని విశ్వసిస్తున్నా. ప్రపంచ స్థాయి సామర్థ్యం కలిగిన సాంకేతిక సంస్థలను భారత్ నిర్మించగలదని జియో లిస్టింగ్ ప్రపంచానికి నిరూపిస్తుంది" అని ముకేశ్ అంబానీ వెల్లడించారు.

**27 కోట్ల షేర్లు**
ఈ ఐపీఓ ద్వారా సుమారు 4




బిలియన్ డాలర్ల (సుమారు రూ.37,700 కోట్లు) నిధులు సేకరించాలని భావిస్తున్నారు. ఈ పబ్లిక్ ఇష్యూలో 27 కోట్ల కొత్త షేర్లను ఇన్వెస్టర్లకు జారీ చేయనున్నారు. ఐపీఓ ద్వారా వచ్చే మొత్తాన్ని కంపెనీ తీసుకున్న అప్పులను తీర్చడానికి ఉపయోగించనున్నారు. మిగిలిన నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాల కోసం ఉపయోగిస్తారు. డ్రాఫ్ట్ పేపర్లు దాఖలు చేసే నాటికి.. ప్రమోటర్ సంస్థ అయిన రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు జియో ప్లాట్‌ఫార్మ్‌లో 66.43 శాతం వాటా ఉంది.

గతేడాది నిర్వహించిన రిలయన్స్ ఏజీఎం సందర్భంగా జియో ఐపీఓ గురించి ముకేశ్ అంబానీ ప్రకటన చేశారు. 2026కు తొలి అర్ధభాగంలోనే జియో ఐపీఓ ఉంటుందని అప్పట్లో తెలిపారు. అయితే, ఈ ఏడాదిలో రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు విలువ క్షీణించడం, పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల రిలయన్స్ ప్రధాన ఆదాయ వనరు అయిన పెట్రోకెమికల్ వ్యాపారంపై ప్రభావం పడడం వంటి పరిణామాలతో ఈ ప్రక్రియ ఆలస్యమైంది.

### తగ్గిన బంగారం.. వెండి ధరలు..

# రూ.1.50లక్షల దిగువకు పసిడి



దేశీయ మార్కెట్లో బంగారం, వెండి ధరలు దిగొచ్చాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతలు చల్లారడం, చమురు ధరలు పడిపోవడం వంటి పరిణామాలతో ఈ లోహాలకు డిమాండ్ తగ్గింది. దీంతో వీటి ధరలు తగ్గుముఖం పట్టాయి. హైదరాబాద్ మార్కెట్‌లో శుక్రవారం 24 క్యారెట్ల మేలిమి 10 గ్రాముల పుత్తడి ధర రూ.1,49,270గా ఉంది. క్రితం రోజుతో పోలిస్తే దాదాపు రూ.3000కు పైనే తగ్గింది. ఇక, కేజీ వెండి ధర రూ.2.37లక్షలు పలికింది. వెండి ధర ఒక్క రోజే రూ.8,600 తగ్గడం గమనార్హం.

అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ఈ లోహాల ధరలు దిగొచ్చాయి. ఔన్సు పుత్తడి ధర 4,139 డాలర్లు, ఔన్సు వెండి ధర 63.85 డాలర్లుగా ఉంది. కమొడిటీ ఎక్స్ఛేంజీ మార్కెట్‌లో గోల్డ్ ఫ్యూచర్స్ ధర రూ. 1.46 లక్షలకు పడిపోయింది. సిల్వర్ ఫ్యూచర్స్ ధర రూ.2.30లక్షలుగా కొనసాగుతోంది.
అమెరికా-ఇరాన్ యుద్ధం ముగియడం, ఫెడ్ ప్రకటనతో అంతర్జాతీయ మార్కెట్లు కోలుకున్నాయి. అటు డాలర్‌తో పోలిస్తే మన కరెన్సీ రూపాయి విలువ కూడా బలపడుతోంది. చమురు ధరలు యుద్ధం మునుపటి స్థితికి దిగొస్తున్నాయి. ఈ కారణాలు బంగారం, వెండి ధరలపై ప్రభావం చూపిస్తున్నాయని బులియన్ విశ్లేషకులు చెబుతున్నారు. అటు దేశీయంగానూ కొనుగోళ్లు తగ్గడం కూడా వీటి ధరల పతనానికి కారణమవుతున్నట్లు పేర్కొంటున్నారు.



ప్రభాతనవ
SINGIDI తెలుగు దినపత్రిక
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శుక్రవారం
7-8-2026

## పట్టణ ప్రగతి మా ప్రభుత్వ లక్ష్యం



**అచ్చంపేట (సింగిడి:** మార్నింగ్ వాక్ లో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే వంశీకృష్ణనగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని వివిధ వార్డులలో ఎమ్మెల్యే వంశీకృష్ణ మార్నింగ్ లో భాగంగా ప్రజల ను తమ వార్డు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అచ్చంపేట పట్టణంలోని 4వ వార్డు చింతల్ బస్తిలో స్థానిక మున్సిపల్ చైర్మన్, మాజీ ఎంపీపీ రామనాథం తో కలిసి ఎమ్మెల్యే వంశీకృష్ణ పర్యటించారుబస్తిలోని ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని, రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలు తదితర మౌలిక వసతులను దశలవారీగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అచ్చంపేట పట్టణాన్ని సమగ్ర పట్టణ ప్రణాళికలో భాగంగా అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేసి, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకువస్తామనీ చెప్పారు. ఇప్పటికే వివిధ వార్డులలో అభివృద్ధి పనుల గురించి సీసీ రోడ్లు డ్రైనేజీ వ్యవస్థ వీధి దీపాలు తదితర పనులు వేగంగా సాగుతున్నాయని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఖాదర్, కౌన్సిలర్ ఆకుల వెంకటేష్, విష్ణువర్ధన్ రెడ్డి, మల్లేష్, హాలరాజు, మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు

## అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు



**హుస్నాబాద (సింగిడి):** హుస్నాబాద్ మండలం గాంధీనగర్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తల్లిపాల వారోత్సవాలు, అన్నప్రాసన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పోలు సంపత్ చేతుల మీదుగా అంగన్వాడీ చిన్నారులకు యూనిఫార్మ్‌లను పంపిణీ చేశారు. అనంతరం గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ, తల్లిపాలు శిశువుకు ప్రకృతి ప్రసాదించిన సంపూర్ణ ఆహారమని, మొదటి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం ద్వారా పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఎదుగుతారని అన్నారు. గర్భిణీలు, బాలింతలు పాలు, గుడ్లు, ఆకుకూరలు, పప్పుధాన్యాలు, పండ్లు వంటి పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారం, ఆరోగ్య సేవలు, చిన్నారుల సంక్షేమ కార్యక్రమాలను ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకుని అంగన్వాడీ కేంద్రాలను తప్పనిసరిగా ఉపయోగించుకోవాలని కోరారు. అంగన్వాడీ టీచర్ లక్ష్మి మాట్లాడుతూ, గర్భిణీలు, బాలింతలు క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రానికి వచ్చి ప్రభుత్వం అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని, తల్లిపాల ప్రాముఖ్యతను ప్రతి కుటుంబం గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, గ్రామ కార్యదర్శి, గ్రామస్తులు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, అంగన్వాడీ చిన్నారులు పాల్గొన్నారు.

## రోడ్డు నిబంధనలతోనే ప్రాణాలకు రక్షణ –ఎస్ఐ




**వేములపల్లి, (సింగిడి):** ప్రతి ఒక్కవాహనదారుడు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కలిగి ఉన్నప్పుడే రహదారి ప్రమాదాల బారిన పడకుండా తమ ప్రాణాలను కాపాడుకోగలరని వేములపల్లి ఎస్ఐ డి.వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో వాహనదారులకు ప్రత్యేకంగా రోడ్డు భద్రతా అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అలాగే నాలుగు చక్రాల వాహనాలు నడిపేవారు సీట్ బెల్ట్ ధరించాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, ప్రయాణంలో మొబైల్ ఫోన్ మాట్లాడడం లాంటి నిర్లక్ష్యపు చర్యల వల్ల ఘోర ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయే ముప్పు ఉందని హెచ్చరించారు. ఇటీవల జరుగుతున్న ద్విచక్ర వాహన ప్రమాదాల్లో హెల్మెట్ ధరించకపోవడం వల్లే అత్యధికంగా మరణాలు సంభవిస్తున్నాయని, ఈ విషయాన్ని గుర్తించి ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ వాడాలని కోరారు. మైనర్లకు తల్లిదండ్రులు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు ఇవ్వకూడదని, ఒకవేళ ఇస్తే పిల్లలతో పాటు తల్లిదండ్రులపై కూడా చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం కలవరపెడుతోందని, తల్లిదండ్రులు తమ పిల్లల నడవడికపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలని సూచించారు. అలాగే సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ఉండేందుకు తగిన జాగ్రత్తలు వహిస్తే ఆర్థిక నష్టాలను నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు పుట్టల సందీప్‌కుమార్, పెదపంగ సైదులు, దేశిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వాహనదారులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జ్ఞానానికి నిలయం.. యువతకు మార్గదర్శి గ్రంథాలయం

### హుజూర్‌నగర్ ప్రభుత్వ గ్రంథాలయాన్ని పరిశీలించిన జిల్లా సెక్రటరీ రామచంద్ర నాయక్



**హుజూర్‌నగం (సింగిడి: ):** పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు ప్రభుత్వ గ్రంథాలయాలు ఎంతో ఉపయోగకరమైన వేదికలని, వాటిని మరింత సమర్థవంతంగా వినియోగించేలా సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని జిల్లా సెక్రటరీ రామచంద్ర నాయక్ అన్నారు. బుధవారం హుజూర్‌నగర్ ప్రభుత్వ గ్రంథాలయాన్ని ఆయన పరిశీలించి, అక్కడి పాఠకులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉద్యోగ అభ్యర్థులు ప్రభుత్వ సెలవు రోజుల్లో కూడా గ్రంథాలయాన్ని తెరిచి ఉంచాలని కోరుతూ ఆయనకు స్థానికులు వినతిపత్రం అందజేశారు. వినతిపై స్పందించిన రామచంద్ర నాయక్, సంబంధిత ఉన్నతాధికారులతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే విద్యార్థులు, నిరుద్యోగుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని గ్రంథాలయ పని వేళలను ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కొనసాగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రంథాలయం అనేది కేవలం పుస్తకాలు చదివే స్థలం మాత్రమే కాకుండా, జ్ఞానాన్ని పెంపొందించే కేంద్రం, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువతకు నిత్య అధ్యయన వేదిక అని అన్నారు. ప్రశాంతమైన వాతావరణం, పుస్తకాల అందుబాటు, దినపత్రికలు, పోటీ పరీక్షల మెటీరియల్ వంటి సౌకర్యాలను యువత సద్వినియోగం చేసుకుంటే జ్ఞానవంతులే కాకుండా ప్రయోజకుల అవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఇన్‌చార్జి శ్రీధర్ రెడ్డి, ఉద్యోగ అభ్యర్థులు, పాఠకులు పాల్గొన్నారు.

# బోడేపూడి జీవితం నేటి తరానికి ఆదర్శం

### సిపిఐ(ఎం) రాష్ట్ర సీనియర్ నాయకులు పి.సోమయ్య

**ఖమ్మం (సింగిడి:)** రైతు బాంధవుడు అమరజీవి కామ్రేడ్ బోడేపూడి వెంకటేశ్వరరావు జీవితం నేటి తరానికి ఆదర్శం అని సిపిఐ(ఎం) రాష్ట్ర సీనియర్ నాయకులు పి.సోమయ్య అన్నారు. సిపిఐ(ఎం) వైరా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మాజీ శాసనసభ్యులు, శాసనసభా పక్ష నాయకుడు, అమరజీవి కామ్రేడ్ బోడేపూడి వెంకటేశ్వరరావు 29వ వర్ధంతి పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్ అధ్యక్షతన స్థానిక మిట్టపల్లి గార్డెన్ లో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా బోడేపూడి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం జరిగిన సభలో టి. సోమయ్య మాట్లాడుతూ నేడు దేశంలో, రాష్ట్రంలో పాలకులు ప్రజా వ్యతిరేక విధానాలు, రైతుల పట్ల పాలకులు అమలు చేస్తున్న రైతు వ్యతిరేక చట్టాలు రైతులకు గుదిబండగా ఉన్నాయని విమర్శించారు. రైతులు వ్యవసాయం చేయడానికి అనేక సమస్యలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి వచ్చిందని అన్నారు. గిట్టుబాటు ధరలు లేక, వ్యవసాయంపై ప్రభుత్వాలు పెట్టిన ఆంక్షల వలన రైతులు పంటలు పండించడానికి, విత్తనాలు కొనే దగ్గర నుండి పంటను అమ్ముకునే వరకు అనేక రూపాల్లో నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు వ్యతిరేక అనేక ఆంక్షలు నేడు పాలకుల పాలనలో కనిపిస్తున్నాయని ఎద్దేవా చేశారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో రైతాంగ సమస్యలు ఎక్కడుంటే అక్కడ రైతుల కోసం పనిచేసిన ఒక నిజాయితీ గల ప్రజాప్రతినిధిగా, రైతు బాంధవుడుగా పేరు



తెచ్చుకున్న బోడెపూడి వెంకటేశ్వరావు ధన్యజీవి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి కృష్ణ, వైరా రూరల్ కార్యదర్శి బాణాల శ్రీనివాసరావు, కొణిజర్ల మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు, నాయకులు మచ్చా మణి, తోట నాగేశ్వరావు, తూము సుధాకర్, గుడిమెట్ల రజిత, పైడిపల్లి సాంబశివరావు, కొంగర సుధాకర్, మల్లెంపాటి రామారావు, హరి వెంకటేశ్వరావు, కామినేని రవి, గుమ్మా నరసింహారావు, రాచబంటి బత్తిరన్న, తోట కృష్ణవేణి, షేక్ నాగుల్ పాషా, పారుపల్లి శ్రీనాథ్ బాబు, బాజోజి రమణ, శాఖా కార్యదర్శులు, పార్టీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అమ్మ పాలు ముద్దు ,డబ్బా పాలు వద్దు

### నేటి బాలలే రేపటి పౌరులు

### తోగ్గూడెం లో జరిగిన తల్లి పాల వారోత్సవాలులి

### పాల్గొన్న సర్పంచ్ కుంజా వినోద్



**ములకలపల్లి, (సింగిడి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట నియోజకవర్గం ములకలపల్లి మండలం (జగన్నాధపురం) తోగ్గూడెం గ్రామంలో నిర్వహించిన. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుంజా వినోద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ కుంజా వినోద్ మాట్లాడుతూ, తల్లిపాలు శిశువుకు ప్రకృతి ప్రసాదించిన సంపూర్ణ



ఆహారమని, పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం వల్ల శిశువు ఆరోగ్యంగా ఎదగడంతో పాటు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. ప్రతి తల్లి తొలి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలను మాత్రమే అందించాలని, అనంతరం పోషకాహారంతో పాటు రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లిపాలను కొనసాగించాలని సూచించారు. తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రతి కుటుంబంలో అవగాహన పెరగాలని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తల్లిపాలే బలమైన పునాది అని పేర్కొన్నారు. అనంతరం జరిగిన శ్రీమంతం కార్యక్రమంలో పాల్గొని ఆశీర్వదించారు తదుపరి తల్లిపాల వారోత్సవాల ర్యాలీ నిర్వహించారు సెక్రటరీ సునీష్ స్కూల్ హెచ్ యమ్ రమాదేవి అంగన్వాడీ సూపర్ వైజర్ భవాని జగన్నాధపురం కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ చేకుర్తి రామాచారి కాంగ్రెస్ సీనియర్ నాయకులు సోయం బోడప్ప గాదెగోని జగదీష్ స్థానిక బి యల్ ఎ ,సున్నం నాగేష్ మిడియం నారాయణ ,కూరం రామకృష్ణ ములకలపల్లి మండల బియల్ఎ కోఆర్డినేటర్ ,సురభి రాజేష్ యన్ యస్ యు ఐ మండల అధ్యక్షుడు ,గుంట్రు సాయి పూనెం వెంకటేష్ జగన్నాధపురం సోషల్ మీడియా అధ్యక్షులు అంగన్వాడి టీచర్లు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ వద్దు, స్టీల్ వస్తువులు ముద్దు





**వెల్దుర్తి, (సింగిడి):** మాసాయిపేట మండలంలోని మాసాయిపేట గ్రామపంచాయతీలో ప్లాస్టిక్ వస్తువులు, వాడొద్దని స్టీల్ వస్తువులు, వాడాలని భోజనానికి, మంచినీరు త్రాగడానికి, గ్రామ కార్యదర్శి ఆలోచించి సర్పంచ్ వీరన్న గారి కృష్ణారెడ్డి అనుసరించి 15? వేల రూపాయలు సుమారు ఖర్చు అయిందని గ్రామ కార్యదర్శి తెలిపారు అదే విధంగా గ్రామ సర్పంచ్ వీరన్న గారికి కృష్ణారెడ్డి జిల్లా పంచాయతీ శాఖ అధికారి ఆధ్వర్యంలో ప్రారంభం చేశారు అనంతరం మాసాయిపేట మండలం లో పనిచేస్తున్న ఎంపీడీవో, వివిధ గ్రామాల కార్యదర్శులు, సమక్షంలో గ్రామ సర్పంచ్ వీరన్న గారి కృష్ణారెడ్డి అధికారికి శాలువాతో సన్మానం చేశారు, అనంతరం తిరిగి గ్రామ సర్పంచ్ వీరన్న గారి కృష్ణారెడ్డిని శాలువాతో సన్మానం చేశారు అదే విధంగా మాసాయిపేట అభివృద్ధి కోసం చాలా విషయాలు భవనాల గురించి చాలా అభివృద్ధి కోసం జిల్లా అధికారితో చర్చించారు జిల్లా అధికారి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విగ్నేశ్వర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి వార్డు సభ్యులు, పెరమండ రమేష్, ప్రశాంత్, సఫాయి కార్మికులు తదితరులు ఉన్నారు

# సోషలిజం అజేయం..పోరాటాల ద్వారానే అది సాధ్యం





**వైరా (సింగిడి):** సిపిఎం పార్టీ కొణిజర్ల, వైరా టౌన్, వైరా రూరల్ మండలాల పార్టీ సభ్యుల రాజకీయ శిక్షణా తరగతులు బుధవారం వైరా మిట్టపల్లి గార్డెన్ లో ప్రారంభమయ్యాయి. రెండు రోజులపాటు జరగనున్న ఈ శిక్షణా తరగతులను పార్టీ సీనియర్ నాయకులు వనమా చిన్న సత్యనారాయణ జండా ఆవిష్కరణ చేసి ప్రారంభించారు. ప్రిన్సిపాల్ గా పార్టీ జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి కృష్ణ వ్యవహరించారు. పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు పి సోమయ్య కమ్యూనిస్టు పార్టీ మూల సూత్రాలు నిర్మాణం అనే అంశంపై బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషలిజం అజేయం, అసమానతలు లేని సమాజాన్ని స్థాపించటమే కమ్యూనిస్టుల లక్ష్యంగా పనిచేయాలన్నారు. కమ్యూనిస్టు పార్టీ పేద ప్రజల, రైతుల, కార్మికుల అసమా నతలకు గురయ్యే ప్రజలందరి కోసం పనిచేస్తుందన్నారు. మధ్యాహ్నం రాజకీయ విద్యా విభాగం జిల్లా బాధ్యులు బోడ పట్ల రవీందర్ మతం మతోన్మాదం అనే అంశంపై బోధించారు. భారతదేశంలో ఒక క్రమ పద్ధతిలో కేంద్ర ప్రభుత్వం రాజకీయాల్లోకి, అన్ని రంగాలలో మతాన్ని చొప్పిస్తూ మతోన్మాద రాజకీయాలకు పాల్పడుతుందన్నారు. పది సంవత్సరాల కాలంలో పెద్ద ఎత్తున దాడులు జరుగుతున్నాయి అన్నారు. అన్ని రంగాలలో బిజెపి విధానాలను అమలు జరిగే విధంగా చేస్తుందన్నారు. భవిష్యత్తులో కేంద్ర ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా రైతులు, విద్యార్థులు, కార్మికులు పెద్ద ఎత్తున దేశంలో ఆందోళనలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఏర్ప డిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్, వైరా రూరల్ కార్యదర్శి బాణాల శ్రీనివాసరావు, కొణిజర్ల మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు, కొంగర సుధాకర్, మచ్చా మణి, తాతా పద్మ, గుడిమెట్ల రజిత, పైడిపల్లి సాంబశివరావు,హరి వెంకటేశ్వరావు, బోయినపల్లి శ్రీనివాసరావు, తోట నాగేశ్వరావు,మాగంటి తిరుమలరావు, అన్నవరం వెంకటేశ్వర్లు,చింతపల్లి ప్రసాద్, బాణాల వెంకట్రావమ్మ, కంచర్ల అనిత తదితరులు పాల్గొన్నారు.

# వైరా పోలీసుల చొరవతో ఒంటరి మహిళకు కృత్రిమ కాలు ఏర్పాటు

**వైరా, (సింగిడి:** మానవ తా దృక్పథంతో స్పందించిన వైరా పట్టణ పోలీసులు మరోసారి తమ సేవాతత్పరతను చాటుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ కృష్ణా జిల్లా, రెడ్డిగూడెం మండలం, నాగ లూరు గ్రామానికి చెందిన ఉప్పుటల జమలమ్మ (56)కు వైరా పట్టణ ఎస్ఐ పుష్పాల రామారావు చొరవతో ఆధునిక కృత్రిమ కాలును అందజేశారు. జమలమ్మ గత ఏడాది మధు మేహం కారణంగా ఒక కాలును కోల్పోయారు. ఒంటరి మహిళగా జీవిస్తున్న ఆమెకు నిత్యజీవితంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతు న్నాయి. తనకు వచ్చే వృద్ధాప్య పెన్షన్‌తోనే జీవనం సాగిస్తున్న ఆమె, కృత్రిమ కాలు ఏర్పాటు చేయాలని వైరా పట్టణ ఎస్ఐ పుష్పాల రామా రావును ఆశ్రయించారు. ఆమె పరిస్థి తిని తెలుసుకున్న ఎస్ఐ వెంటనే స్పందించి, విజయవాడకు చెందిన స్వచ్ఛంద సేవకుడు, రిటైర్డ్ విద్యుత్ శాఖ ఉద్యోగి శ్రీనివాసరావు సహకా రాన్ని తీసుకున్నారు. ఆయన ఆర్థిక సహాయంతో ఎవల్యూషన్ ప్రోస్థెటిక్స్ సంస్థ ద్వారా అత్యాధునిక కృత్రిమ కాలును కొనుగోలు చేసి, విజయ వాడలో జరిగిన కార్యక్రమంలో జమలమ్మకు అమర్చేందుకు ఏర్పా టు చేశారు. ఈ సందర్భంగా జమలమ్మ మాట్లాడుతూ, మామూ లుగా నడిచే అవకాశం కల్పించిన వైరా పట్టణ ఎస్ఐ పుష్పాల రామా రావు, ఆర్థిక



సహకారం అందించిన శ్రీనివాసరావుకు జీవితాంతం రుణ పడి ఉంటాను అని భావోద్వేగంగా తెలిపారు. సమాజంలో ఆపదలో ఉన్నవారిని గుర్తించి వారికి అండగా నిలవడం పోలీసుల



సామాజిక బాధ్యతలో భాగమని, వైరా పట్టణ పోలీసులు చేపడుతున్న ఇటువంటి సేవా కార్యక్రమాలు ప్రజలకు ఆద ర్శంగా నిలుస్తున్నాయని పలువురు ప్రశంసించారు.

## నష్టపోయిన రైతులను ప్రభుత్వాలు ఆదుకోవాలి

### తల్లాడ లో అఖిల భారత ఐక్యరైతు సంఘం ఆధ్వర్యంలో ఎమ్మార్వో కి వినతిపత్రం

**తల్లాడ, (సింగిడి:)** తల్లాడ మండల కేంద్రం లో ఉన్న రైతంగ సమస్యల పై అఖిల భారత ఐక్య రైతు సంఘము వైరా డివిజన్




ఆధ్వర్యంలో రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టి కి తీసుకొని వెళ్లే అందుకు ఎమ్మార్వో కరుణాకర్ రెడ్డి కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వైరా డివిజన్ కార్యదర్శి పాశం అప్పారావు మాట్లాడుతూ వర్ష భావం లేక పంటలు వేసి నష్టబోయిన రైతంగాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాల ఆదుకోవాలని ఎకరానికి 12000 నష్ట పరిహారం ఇవ్వాలని రాష్టం లో ఖరీఫ్ సీజన్లో వర్షాలు లేక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వారిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో అఖిల భారత ఐక్య రైతు సంఘము మండల కార్యదర్శి కొండ వెంకటేశ్వర్లు,ఏస్కె జానీ, పుల్లమ్మ, వెంకులు, లల్మియా, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## వైరా ఎమ్మెల్యేను కలిసిన కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి,గోవిందు శ్రీనివాసరావు



**తల్లాడ, (సింగిడి:)** టిపిసిసి ఆదేశాల మేరకు మండలం, గ్రామ కమిటీలను, ఎన్నుకునేందుకు ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అన్ని మండలాలకు ఇన్చార్జీలను నియమించింది. దీనిలో భాగంగా ఏన్కూర్ మండలానికి ఇంచార్జి గా జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందు శ్రీనివాసరావు ను టీపీసీసీ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీ నియమించింది. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఏన్కూరు మండలం ఇన్చార్జి గోవింద్ శ్రీనివాసరావు బుధవారం వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్ నాయక్ తో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు, ఈ సందర్భంగా వైరా శాసన సభ్యులు రాందాస్ నాయక్ ను గోవింద్ శ్రీనివాసరావు ఏనుకూరు మండలం ఇన్చార్జిగా నియమించినందుకు గాను శుభాకాంక్షలు తెలియజేసి ఎమ్మెల్యే ను శాలువ తో సన్మానించారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ ఏన్కూర్ మండ లంలోని అన్ని కమిటీలు చాలా పారదర్శకంగా నియ మించాల న్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారిని ప్రత్యేకంగా గుర్తించి వారికి పార్టీలో సముచిత స్థానం కల్పించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను బలంగా ప్రజల్లోకి తీసుకు వెళ్లే విధంగా కృషి చేయాలి అన్నారు. ఈ సందర్భంగా గోవిందు శ్రీనివాసరావు మాట్లాడుతూ హై కమాండ్ ఆదేశాల మేరకు కట్టుబడి పని చేస్తానని కమిటీలు ఎన్నిక పారదర్శకంగా ఉండేలా చూస్తానని, పార్టీ కోసం కష్టపడ్డ వారికి సముచిత స్థానం కలిపించే విధంగా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా తాజా రాజకీయాల పై చర్చించారు. తనను ఏనుకూరు మండలం ఇన్చార్జి గా నియమిం చినందుకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ కి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్ర మంలో అన్నారుగూడెం యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇండ్ల రంగ, ఏనుకూరు మండలం స్థానిక ప్రజాప్రతినిధులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## సామాజిక న్యాయం దిశగా ఉద్యమించాలి

### జిల్లాలో టీజేఎస్ ను క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయండి.



### టీజేఎస్ వ్యవస్థాపకులు, ఎమ్మెల్సీ ప్రో.కోదండరామ్

**పాలేరు (సింగిడి: ):** తెలంగాణ ప్రజల ఆకాంక్షలైన నిధులు.. నియమాకాలు. నీళ్లు, సామాజిక న్యాయం దిశగా ఉద్యమించాలని తెలంగాణ జన సమితి వ్యవస్థాపకులు, ఎమ్మెల్సీ ప్రో.కోదండరామ్ సూచించారు. టీజేఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడుగా ఎన్నికైన మాదాసు శ్రీనివాసరావు హైద్రాబాద్ లో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన ను ఘనంగా సన్మానించారు. తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లా డారు.. ఖమ్మం జిల్లాలో పార్టీని బలోపేతం చేయాలని సూచిం చారు. గ్రామీణ ప్రాంతం బూత్ కమిటీ నుంచి మండలం, పట్టణాలలో అన్ని కమిటీలు పూర్తి చేయాలని సూచించారు. సామాజిక న్యాయం దిశగా జనసమితి జెండా కింద ప్రజలను ఏకం చేయాలని సూచించారు. పార్టీని క్షేత్ర స్థాయిలో తిరుగులేని శక్తిగా నిలపాలని సూచించారు. జిల్లాలో పార్టీని బహుజన ప్రజా ఉద్యమాల వేదికగా తీర్చిదిద్దటానికి ప్రతీ ఒక్కరూ సహక రించాలని నూతన అధ్యక్షుడు మాదాసు శ్రీనివాసరావు కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యాక్షుడు అంబటి శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పల్లె వినయ్కుమార్, గోపగాని శంకర్రావు, మేకపోతుల నర్సయ్య,జిల్లా నాయకులు మందడి వెంకటేశ్వ రరావు,తీగ రాములు, మోహన్రావు, నాగేశ్వరరావు, వెంకట్రావ్ పాల్గొన్నారు.

## మాడ్గుల మండలంలో యువకుడు అదృశ్యం





**ఆమనగల్లు, (సింగిడి:)** మా డ్గుల మండల పరిధిలోని చాంద్రా యణ పల్లి గ్రామానికి చెందిన మానుపాటి నరేష్ (24) అనే యువకుడు అదృశ్యమయ్యాడు. కుటుం బ కలహాలతో మనస్థాపం చెంది ఈ నెల 3వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు ఇంటి నుంచి వెళ్లిన నరేష్ తిరిగి రాలేదని తల్లి వెంకటమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బంధువులు, చుట్టుపక్కల గాలిం చినా ఆచూకీ లభించకపో వడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిస్తే మాడ్గుల పోలీస్ స్టేషన్లో తెలపాలని కోరారు.



ప్రభాతనవ సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శుక్రవారం 7-8-2026

## విద్యార్థులకు ఉచిత నోట్ పుస్తకాల పంపిణీ



**పెద్దేరు, (సింగిడి):** ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం ఉచితంగా నోట్ పుస్తకాలు పంపిణీ చేయడం అభినందనీయమని పెద్దేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు పేర్కొన్నారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పించడం ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు గణనీయమైన ఊరటనిస్తున్నట్లు వారు తెలిపారు. బుధవారం పెద్దేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ప్రభుత్వం సరఫరా చేసిన ఉచిత నోట్ పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఇప్పటికే ప్రభుత్వం విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలను అందించిందని, ఇప్పుడు నోట్ పుస్తకాలను కూడా పంపిణీ చేయడంతో విద్యార్థులు ఎలాంటి అదనపు ఖర్చు లేకుండా విద్యను కొనసాగించే అవకాశం కలుగుతోందని అధ్యాపకులు వివరించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్ ఫీజు లేకుండా ప్రవేశాలు కల్పించడంతో పాటు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను ఉచితంగా అందించడం వల్ల విద్యార్థులపై ఆర్థిక భారం గణనీయంగా తగ్గుతోందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ విద్యా సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలతో చదువుకుని ప్రతిభ కనబర్చాలని అధ్యాపకులు సూచించారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల పెద్దేరు ప్రథమ సంవత్సరం ప్రవేశాల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో చేరడం పట్ల కళాశాల అధ్యాపక, బోధనేతర సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థలపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో రోజురోజుకూ పెరుగుతున్న విశ్వాసానికి ఇదే నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఓబుల్‌రెడ్డి, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## చిన్నారులకు శ్రీరామరక్ష ముర్రుపాలు



**వేములపల్లి, (సింగిడి):** చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యానికి, శారీరక వికాసానికి తల్లి ముర్రుపాలు శ్రీరామరక్షగా నిలుస్తాయని వేములపల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ పుట్టల సందీప్ కుమార్ తెలిపారు. ఐసిడిఎస్ దామరచర్ల ప్రాజెక్టు పరిధిలోని వేములపల్లి మండల కేంద్రంలో బుధవారం సిడిపిఓ ఉత్తర్వుల మేరకు తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు సామూహిక అన్నప్రాసన వేడుకను ఏర్పాటు చేయగా సర్పంచ్ పుట్టల సందీప్ కుమార్ హాజరై చిన్నారులకు తొలిసారి ఆహారం తినిపించారు. అనంతరం ఐసిడిఎస్ సూపర్వైజర్ పరిమి రజని అంగన్వాడీ కేంద్రానికి వచ్చిన తల్లులతో సమావేశమై పలు విషయాలను వివరించారు. శిశువు జన్మించిన మొదటి గంటలోనే తల్లి పాలు పట్టించడం అత్యంత అవసరమని తెలిపారు. ముర్రుపాలు చిన్నారి శరీరంలో వ్యాధి నిరోధక శక్తిని అపరిమితంగా పెంచుతాయని, జీవిత కాలానికి రక్షణ కల్పించే మొదటి టీకా లాగా పనిచేస్తాయని పేర్కొన్నారు. పుట్టిన రోజు నుంచి ఆరు నెలల వయస్సు వరకు కేవలం తల్లిపాలు మాత్రమే పట్టించాలని సూచించారు. ఏడో నెలకు అడుగుపెట్టిన తరువాత చిన్నారులకు అన్నప్రాసన చేసి గుడ్డు, పప్పు ధాన్యాలతో కూడిన పోషకాహారాన్ని అలవాటు చేయాలని, దీంతో పాటు రెండేళ్ల వయస్సు వరకు తప్పనిసరిగా తల్లిపాలు అందిస్తూ ఉండాలని అవగాహన కల్పించారు. తల్లులందరూ ఈ విషయాలను గుర్తించి పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ పరిమి రజని, వార్డు మెంబర్లు హాజీ, మాతంగి సుధీర్, హెల్త్ సూపర్వైజర్ శాంత, ఏఎన్ఎంలు శైలజ, సునీత, అంగన్వాడీ టీచర్లు జయమ్మ, శశికళ, పద్మ, రజిత, ఆశా వర్కర్లు విగ్నేశ్వరి, ప్రేమలత, ఆయా యాదమ్మ, బాలింతలు, గర్భిణులు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

బి.కె. హరిప్రసాద్‌ను కలిసిన

## బీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పానుగంటి విజయ్ గౌడ్



**మునుగోడు, (సింగిడి)::** బెంగళూరు వేదికగా ఈనెల 7వ తారీఖున అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగనున్న చారిత్రాత్మక, జాతీయ ఓబీసీ మహాసభ' కు ముఖ్య అతిథిగా హాజరుకావాలని కోరుతూ కర్ణాటక పీసీసీ అధ్యక్షులు, బి.కె. హరిప్రసాద్ ని బీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పానుగంటి విజయ్ గౌడ్ బుధవారం బెంగళూరులో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు . బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మార్గదర్శకత్వంలో, జాతీయ ఓబీసీ మహాసభ సందర్భంగా ఈ భేటీ జరిగింది. జాతీయ బీసీ ప్రతినిధులు భవన్ రామ్ తైవడే, సచిన్ రాజోర్ కార్, తాటికొండ విక్రమ్ గౌడ్, కనకాల శ్యామ్ కురుమ, రావుల కోల్ నరేష్ ప్రజాపతి, లక్ష్మణ్ జిత్ లతో కలిసి పానుగంటి విజయ్ గౌడ్ పాల్గొని కేపీసీసీ అధ్యక్షులను ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పానుగంటి విజయ్ గౌడ్ మాట్లాడుతూ. దేశంలో ఓబీసీల సామాజిక, రాజకీయ, ఆర్థిక హక్కుల రక్షణ కోసం, దేశవ్యాప్త కుల గణన మరియు చట్టసభల్లో బీసీ రిజర్వేషన్ల సాధనే ప్రధాన డిమాండ్లతో ఈ మహాసభను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ చారిత్రాత్మక పోరాటంలో కర్ణాటకలో బలమైన ఓబీసీ దిగ్గజం అయిన బి.కె. హరిప్రసాద్ మద్దతు యావత్ దేశ బీసీ సమాజానికి కొండంత అండ అని పేర్కొన్నారు. జాతీయ కమిటీ ఆహ్వానానికి కేపీసీసీ అధ్యక్షులు సానుకూలంగా స్పందిస్తూ, ఆగస్టు 7న జరిగే మహాసభకు తాను తప్పకుండా హాజరవుతానని స్పష్టమైన హామీ ఇచ్చారని విజయ్ గౌడ్ వెల్లడించారు. ఆగస్టు 7న బెంగళూరులో సాగబోయే ఈ చారిత్రాత్మక 11వ జాతీయ ఓబీసీ మహాసభను విజయవంతం చేయాల్సిందిగా యావత్ దేశంలోని బీసీ ప్రజానీకానికి, యువజన, విద్యార్థి సంఘాలకు పానుగంటి విజయ్ గౌడ్ పిలుపునిచ్చారు.

## మండల అభివృద్ధిపై నేడు ప్రత్యేక సమీక్ష

**వేములపల్లి, (సింగిడి):** వేములపల్లి మండల పరిధిలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై సమగ్రంగా చర్చించేందుకు బుధవారం ప్రత్యేక మండల సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జితేందర్‌రెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు ఈ సమావేశం ప్రారంభం కానుంది. మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్‌రావు ఈ సమావేశానికి అధ్యక్షత వహిస్తారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు విధిగా సకాలంలో పూర్తిస్థాయి ప్రగతి నివేదికలతో హాజరు కావాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, వివిధ శాఖల పరిధిలో జరుగుతున్న పనుల పురోగతిని సమీక్షించేందుకు ఈ సమావేశం ఎంతగానో దోహదపడుతుందన్నారు. అధికారులు అందరూ ముందస్తు ప్రణాళికలతో వచ్చి సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# మేనిఫెస్టో హామీలు అమలేదీ?

### పీఆర్టీయూటీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుసునపు కిరణ్ కుమార్




**మహాముత్తారం, (సింగిడి):** కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయా లని, లేనిప క్షంలో సెప్టెంబర్ 1 నుంచి ప్రత్యక్ష ఉద్యమానికి శ్రీకారం చుడతామని ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (పీఆర్టీయూటీఎస్) జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కుసునపు కిరణ్ కుమార్ హెచ్చరించారు. మహాముత్తారం మండలంలోని ములుగుపల్లి ఉన్నత ప్రాథమిక పాఠశాల, కొర్లకుంట యూపీ ఎస్, దొబ్బలపాడు మోడల్ స్కూల్, మహాముత్తారం, నిమ్మగూడెం, యామన్‌పల్లి కేజీబీవీ పాఠశాల ల్లో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండల అధ్యక్షుడు భుక్య రవినాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే పీఆర్టీయూ టీఎస్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఉపాధ్యాయులందరూ సంఘంలో సభ్యత్వం స్వీకరించి ఐక్యంగా పోరాటానికి సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. ఉపాధ్యాయులకు క్యాష్‌లెస్ హెల్త్ కార్డు లు అందేలా సంఘం కృషి చేస్తోందని తెలిపారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, అలాగే కాంగ్రెస్ మేనిఫెస్టోలో హామీ ఇచ్చినట్లుగా అన్ని సీపీఎస్ ఉద్యోగులకు ఓపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగు లకు ఆరు నెలలకొక సారి ఇవ్వాల్సిన ఐదు డీఏలు పెండింగ్‌లో ఉండటం సరికాదని, వాటిని వెంటనే విడుదల చేయాలని కోరారు. రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పీఆర్సీని మంచి ఫిట్‌మెంట్‌తో ప్రకటించి అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహాధర్నాకు ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి అజ్మీరా రవీందర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కామిడి సతీష్‌రెడ్డి, హెచ్‌ఎంఏ సురేందర్‌రెడ్డి, జిల్లా బాధ్యులు దాసరి రాజేంద్రప్రసాద్, మండల నాయకులు కొంకల గీతారెడ్డి, చైతన్య నాగరాజు, సతీష్‌కుమార్, షరీఫ్, సుధాకర్ రెడ్డి, లావుడ్య ప్రకాష్‌తో పాటు జిల్లా, మండల, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# జిల్లా గ్రామీణా అభివృద్ధి అధికారి విద్య చందన

### మూకమామిడి పంచాయతీలో స్టిచ్చింగ్ హబ్, వివో బిల్డింగ్ లను పరిశీలించిన





**ములకలపల్లి, (సింగిడి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట నియోజకవర్గం ములకలపల్లి మండలం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అడిషనల్ కలెక్టర్ మరియు జిల్లా గ్రామీణా అభివృద్ధి అధికారి విద్య చందన. బుధవారం ములకలపల్లి మండలంలో మూకమామిడి పంచాయతీ లో పాఠశాలల యూనిఫామ్ స్టిచ్చింగ్ హబ్ ను పరిశీలించిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అడిషనల్ కలెక్టర్ జిల్లా గ్రామీణా అభివృద్ధి అధికారి విద్య చందన. ఈ సందర్భంగా స్టిచ్చింగ్ హబ్ లో ఎంత మంది టైలర్స్ కూడు తు న్నారు. రోజుకు ఎన్ని యూనిఫామ్ లు కుడుతు న్నారు మరియు ఏ ఏ పాఠశాలల యూనిఫామ్ లు కుడుతున్నారు అని వివరాలు తెలుసుకున్నా రు. పాఠశాలలు ప్రారంభించి రెండు నెలలు గడుస్తున్నా యూనిఫాములు తయారు కాకపోవ డం ఈనెల ఆగస్టు 10 పదివ తారీకు లోగ ట్రైబల్ వెల్ఫేర్ గురుకులాలకు ఒక జత యూనిఫామ్ తయారు చేయాలని. మిగతా యూనిఫామ్ లు ఈనెల ఆగస్టు 13 పదముడివ తేదీ లోగ పూర్తిచే యాలని ఆదేశించారు. ఏకలవ్య మోడల్ రెసిడెన్షి యల్ పాఠశాల మరియు కాలేజీలకు ఒక జత యూనిఫాం తప్పకుండా అందించాలని టైలర్స్ లకు ఆదేశించారు. అనంతరం మూకమామిడి గ్రామపంచాయతీ లో నిర్మిస్తున్న గ్రామ సమైక్య భవనాలను విఓ బిల్డింగ్ పరిశీలించా రు. అనంతరం స్థానిక సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి తో మాట్లాడుతూ. ఈనెల చివరి వారంలోపు గ్రామ సమైక్య భవనాలను పూర్తి చేయించాలని సంబంధిత అధికారులకు కాంట్రాక్టర్ లకు తెలియజేయాలని సూచించారు. పంచాయితీలో ప్రతి ఇంటికి ఇంకుడు గుంటలు నిర్మించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి, ఎంపీడీఓ సత్యనారాయణ, ఈజీఎస్ ఏపీడి వెంకట రమణయ్య, ఏపీఎం రామ్ కుమార్, సీసీ కె వెంకటేశ్వర్లు, వివోఏ స్వయం లలిత, పంచాయితీ సెక్రటరీ దోమల అరుణ్ కుమార్ వివో అధ్యక్షురాలు, మహిళలు పంచాయితీ సిబ్బంది మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# రాజీవ్ సాగర్ జాప్యానికి కాంగ్రెస్ ప్రభుత్వాలే కారణం

### కేసీఆర్ కలల ప్రాజెక్టు సీతారామ ప్రాజెక్టు: కోడి అమరేందర్ యాదవ్




**అశ్వాపురం, (సిండిడి):** సీతమ్మసాగర్ ప్రాజెక్టు పనులకు అడ్డుపడింది కాంగ్రెస్ పార్టీయేనని, రాజీవ్ సాగర్ ప్రాజెక్టును తొమ్మిదేళ్లపాటు జాప్యం చేసి పూర్తి చేయలేకపోయిందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ యాదవ్ ఆరోపించారు. అశ్వాపురంలోని బీఆర్ఎస్ మండల పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజీవ్ సాగర్ ప్రాజెక్టుకు 2005లో శంకుస్థాపన చేసినప్పటికీ, 2014 మే వరకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండి కూడా ప్రాజెక్టును పూర్తి చేయలేకపోయిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం, గోదావరి జలాలను ఆంధ్రప్రదేశ్‌కు తరలించే విధానాన్ని నిలువరించేందుకు ప్రాజెక్టును రీడిజైన్ చేసి, 6.5 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో అప్పటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు సీతారామ ప్రాజెక్టును రూపకల్పన చేశారని పేర్కొన్నారు. 2017లో సీతారామ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి, ఐదేళ్లలోనే 90 శాతానికి పైగా పనులు పూర్తి చేసి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సాగునీరు అందించే దిశగా బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రాజెక్టు పనుల్లో ఎలాంటి పురోగతి లేకుండా, గతంలో నిర్మించిన వ్యవస్థ ద్వారానే నీటిని తరలిస్తూ ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు. సీతారామ ప్రాజెక్టు డీపీఆర్‌లో మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం లేకపోయినా, అప్పటి ఎమ్మెల్యే రేగా కాంతారావు చొరవతో 2023 జనవరిలో రూ. 25 కోట్ల నిధులు మంజూరు చేయించి పనులకు శ్రీకారం చుట్టారన్నారు. అనంతరం ఎన్నికల నియమావళి కారణంగా కాంట్రాక్టర్ పనులను నిలిపివేశారని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లు పూర్తయినా మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం నిర్మాణంలో ఆశించిన పురోగతి సాధించలేదని విమర్శించారు. స్థానిక రైతుల అవసరాలను విస్మరించి ఖమ్మం జిల్లా రైతులకు సాగునీరు అందించే ప్రయత్నం జరుగుతుండగా, బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన ఉద్యమాల ఫలితంగానే మారెళ్లపాడు పనులు తిరిగి ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. ప్రస్తుతం కూడా పనులు నత్తనడకన సాగుతున్నాయని, రైతుల ఆగ్రహానికి గురికాకుండా ఉండేందుకే మంత్రులు, ప్రజాప్రతినిధులు పర్యటనలు చేస్తున్నారని అన్నారు. రైతులను ఆదుకున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, రైతు బంధు, సాగునీరు, ధాన్యం కొనుగోళ్ల ద్వారా రైతుకు అండగా నిలిచిందని తెలిపారు. సీతమ్మ బ్యారేజ్‌కు 37 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో పనులు వేగంగా సాగుతున్న సమయంలో కాంగ్రెస్ నాయకులే కోర్టుల్లో కేసులు వేసి పనులను నిలిపివేశారని ఆరోపించారు. ఇప్పుడు అదే ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు తామే తీసుకొచ్చామని చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం రైతులకు యూరియా ఎరువులు కూడా సకాలంలో అందించలేకపోతోందని, రోజుకో యాప్ పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని అన్నారు. మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం ద్వారా పినపాక నియోజకవర్గంలోని ప్రతి చివరి ఎకరాకు సాగునీరు అందే వరకు బీఆర్ఎస్ రైతుల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. అలాగే అశ్వాపురం మండలంలోని 24 గ్రామపంచాయతీల పరిధిలోని చెరు వులు, కుంటలు నిండే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని హెచ్చరిం చారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మర్రి మల్లారెడ్డి, ఈదర సత్యనారాయణ, వెన్న అశోక్ కుమార్, నేలపట్ల సత్యనారాయణ రెడ్డి, చిలక వెంకటరమయ్య, మండల యువజన అధ్యక్షుడు గద్దాల రామకృష్ణ, ఆనందాపురం సర్పంచ్ ముర్రం సమయ్య, ఉప సర్పంచ్ దేవనబోయిన మహేష్, శివారపు డాక్టర్ బాబు, మందా హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికుల సహజ మరణానికి రూ. 5 లక్షలు ఇవ్వాలి

### టి యు సి ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబశివుడు




**అమరచింత, (సిండిడి):** తెలంగాణ ప్రగతిశీల భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం(టి యు సి ఐ) వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ దగ్గర రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం(టి యు సి ఐ) జిల్లా ప్రధాన కార్యదర్శి సి. రాజు అధ్యక్షత వహించగా ముఖ్యవక్తంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబశివుడు వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి పి అరుణ్ కుమార్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఖ మోష, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ రాజు, తెలంగాణ ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం, జిల్లా అధ్యక్షులు టి యు సి ఐ జిల్లా అధ్యక్షులు ప్రసాద్ ప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న సంక్షేమ పథకాలలోని సహజ మరణం ప్రమాద మరణం ఇన్సూరెన్స్‌ను ప్రైవేటు ఇన్సూరెన్స్ వాళ్లకు ఇచ్చిన దాన్ని రద్దు చేయాలని మరియు సిఎస్సి ఆరోగ్య పరీక్షలు రద్దుచేసి హెల్త్ కార్డులు ఇవ్వాలని, 60 సంవత్సరాల దాటిన భవన నిర్మాణ కార్మికులకు కనీస పెన్షన్ నెలకు 9000 రూపాయలు ఇవ్వాలని, సహజ మరణానికి 5 లక్షల రూపాయలు ఇవ్వాలని డెలివరీ మ్యారేజ్ గిఫ్ట్ లకు ఇచ్చే సంక్షేమ పథకాన్ని లక్ష రూపాయలకు పెంచాలని సంక్షేమ బోర్డు ద్వారానే యధావిధిగా కొనసాగించాని డిమాండ్ చేశారు. అదేవిధంగా భవన నిర్మాణ కార్మికులకు చదువు లేక అక్రమంగా సకాలంలో రెన్యువల్ చేసుకోలేని కార్మికులకు ప్రభుత్వమే రెన్యువల్ చేయాలని పెండింగ్ క్లైయిమ్స్‌ను వెంటనే పరిష్కరించాలని అదేవిధంగా ఐటిఐ లకు మంజూరు చేసిన 667కోట్లు నిధులను నిలిపివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది లేనిపక్షంలో అన్ని కార్మిక సంఘాలను కార్మికులను కలుపుకొని పెద్ద ఎత్తున పోరాటాలకుపూనుకుంటామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం, అఖిలభారత ఐక్య రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటయ్య, చింతలన్న, కురుమన్న లు ప్రసంగించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జి చెన్నయ్య, కురుమన్న, తిరుపతి, మన్యం, కురుమన్న, రాజు, రాజు, వెంకటేష్, సీనియర్ తాపీ మేస్త్రీలు ఈదన్న, చిన్న బాలస్వామి, మాల వెంకటన్న, వద్దె రాములు, చిన్న, బాలయ్య, అంజి, దేవన్న, మన్నెం, రాజు, యాకోబు, రవి, శేఖర్, రాజన్న, బీచ్ పల్లి, నాగన్న, శ్రీశైలం, తిప్పన్న, మైబు, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం అండగా, బాధితుడికి

## రూ.3 లక్షల సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ

గంగారాం గ్రామానికి చెందిన శ్యామ్ సాగర్ కుటుంబానికి పత్రాలు అందజేసిన ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి



**బిజినపల్లి (సిండిడి):** నాగర్‌కర్నూల్: నిరుపేదల వైద్య చికిత్సకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ఎంతో ఊతమిస్తోందని ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం గంగారాం గ్రామానికి చెందిన గుంటి శ్యామ్ సాగర్ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ శస్త్రచికిత్స అవసరమైన పరిస్థితి ఏర్పడటంతో కుటుంబ సభ్యులు నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డిని కలిసి ఆర్థిక సహాయం అందించాలని కోరారు. బాధితుడి పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి వెంటనే స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ. 3 లక్షల విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసీ) మంజూరు చేయించారు. మంజూరైన ఎల్ఓసీ పత్రాన్ని ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ, పేద ప్రజలకు అత్యవసర వైద్య చికిత్స అందించడంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఆర్థిక ఇబ్బందులతో వైద్యం అందని పరిస్థితుల్లో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తోందని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని, అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు హరీష్ రెడ్డి, వీరేందర్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం



**మహాదేవపూర్ (సిండిడి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం బెగ్లూర్ లో పలు బాధిత కుటుంబాలను సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కట్కం అశోక్ పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు ఆదేశాల మేరకు గ్రామంలో ఇటీవల మరణించిన బోల్లి సమ్మయ్య కుటుంబానికి 5 వేల రూపాయల ఆర్థిక స హాయం, కాంగ్రెస్ కార్యకర్త కారు కొములయ్య కుటుంబానికి 10 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేసి వారి కుటుంబాలను పరామర్శించి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని ధైర్యాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఆకుల రాజయ్య, ఉప సర్పంచ్ సదానంద చారి, మండల కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బుర్రి శివరాజ్, నాయకులు దోమల రాజేష్, పోచయ్య, శంకరయ్య, తిరుపతి, శ్రీను, కోటేష్ తో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎం జె పి బాలికల పాఠశాలలో ప్రత్యేక వైద్య శిబిరం




**కమలాపూర్, (సిండిడి):** మండలంలోని ఎంజెపి బాలికల పాఠశాలలో ప్రాథమికఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక వైద్య శిబిరాన్నినిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో మొత్తం 53 మంది విద్యార్థినులకు మలేరియా,
డెంగ్యూ నిర్ధారణ పరీక్షలతో పాటు హిమోగ్లోబిన్ (హెచ్‌బీ) స్థాయి పరీక్షలునిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేసి, తగిన వైద్యసలహాలు అందించా రు. అనంతరం విద్యార్థినులకు హెచ్ పి వి ప్రాముఖ్యతను, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణ చర్యలు, సీజనల్వ్యాధుల లక్షణాలు నివారణ మార్గాలపై అవగాహన కల్పించారు. పరిశుభ్రమైనపరిసరాలు, సురక్షితమైన తాగునీరు, దోమల పెరుగుదలను అరికట్టడం ద్వారావ్యాధులను నివారించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులునాగరాజు, అరుణ్ , హెచ్ ఈ ఓ రవీందర్, హెచ్ వి అమృత, టీబీ నోడల్ పర్సన్ప్రభాకర్, హెల్త్ అసిస్టెంట్లు రవీందర్, రాము, గోవర్ధన్ బాబు, పాఠశాలప్రిన్సిపాల్ సౌజన్య, స్టాఫ్ నర్స్ అనిత తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మి గణపతికి విశేష అభిషేకాలు



**అల్వాల్, (సిండిడి):** కామాజిగూడ డైరీ ఫార్మ్ రోడ్ ల వెలిసినమరకత శ్రీ లక్ష్మీ గణపతి దేవస్థానం లో ప్రపంచ అరుదైన అత్యంత విశిష్టమైన మరకతంతో మలిచిన మరకత శ్రీ లక్ష్మీ గణపతి స్వామి దేవాలయంలో బుధవారం స్వామివారికి సుప్రభాత సేవ, వస్త్రాలంకరణ సేవ, 32 ఔషధీకృత ద్రవ్యాలతో విశేష అభిషేకాలు, లక్ష్మీ గణపతి మూల మంత్రము శ్రీ మహాలక్ష్మి హోమం నిర్వహించిన ఆలయ వ్యవస్థాపకులు కార్యనిర్వహకులు డాక్టర్ మోత్కూరు సత్యనారాయణ శాస్త్రి. ఈ పూజ లో పాల్గొన్న భక్తులకు ఆరోగ్యము, ఆయురారోగ్య, ఐశ్వర్య అభివృద్ధి, వ్యాపార అభివృద్ధి, ధన ప్రాప్తి, సర్వ కార్యసిద్ధి కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధి కి పాటుపడి స్వామి వారి కృపకు పాత్రులు కావాలని భక్తులను కోరారు.

ప్రభాతనవ సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం

Singidi
శుక్రవారం
7-8-2026

## ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలపై కఠిన చర్యలు తీసుకోవాలి

### నేరేడుచర్ల ఎస్సైకు బీఆర్ఎస్ నేతల వినతి



**హుజూర్నగర్ (నేరేడుచర్ల) (సింగిడి ):**వ్యవసాయ సంక్షోభంతో సతమత మవుతున్న రైతులను మరింత ఇబ్బందులకు గురిచేస్తున్న ట్రాన్స్‌ఫార్మర్లు, కాపర్ వైర్లు తదితర విద్యుత్ పరికరాల దొంగతనాలను చేస్తున్న వారిని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు నేరేడుచర్ల ఎస్సై గోపాల్‌రెడ్డికి బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు రాపోలు నవీన్‌కుమార్ మాట్లాడుతూ, ఈ సీజన్‌లో ఎలినినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, పంటల నష్టం, నకిలీ విత్తనాలు, నకిలీ పురుగుమందులు, అధిక పెట్టుబడులతో రైతులు ఇప్పటికే తీవ్ర ఆర్థిక, మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని ఇలాంటి సమయంలో రైతుల ట్రాన్స్‌ఫార్మర్లు, కాపర్ వైర్లు, ఇతర విద్యుత్ పరికరాలను దొంగిలించడం అత్యంత అమానవీయ చర్య అని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఆస్తులపై కన్నేసిన దొంగలను గుర్తించి చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని, గ్రామీణ ప్రాంతాల్లో పోలీస్ గస్తీని పెంచి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నను రక్షించడం సమాజం, ప్రభుత్వం, పోలీస్ వ్యవస్థ అందరి బాధ్యత అని పేర్కొన్నారు. రైతుల కష్టార్జిత సంపాదనను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడే వ్యక్తులు తమచర్యలను విరమించుకోవాలని, రైతుల పట్ల మానవత్వంతో వ్యవహరించాలని నవీన్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కల్లూరు మాజీ సర్పంచ్ పల్లెపంగ నాగరాజు, రైతు నాయకులు రాంరెడ్డి, అంజిబి నాగయ్య, కంపసాటి రాంమూర్తి, అంజలి మాధవి, మాతంగి శేఖర్, అరె శ్రీకాంత్, షేక్ నాగుల్, మీరా తదితరులు పాల్గొన్నారు

## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

### రాఘవ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పులిపలుపుల మహేష్

**ఆలేరు, (సింగిడి ):**గ్రామాలు, పట్టణాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరా లను ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని రాఘవ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పులిపలుపుల మహేష్ అన్నారు. బుధవారం ఆలేరు పట్టణ కేంద్రంలో రాఘవ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో, మెడిసిటీ హాస్పిటల్స్ వైద్య బృందం సహకా రంతో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిం చారు. ఈ శిబిరానికి పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై వైద్య సేవలను వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా వైద్యులు మొత్తం 480 మందికి వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి వైద్య సలహాలు, మందు లు అందజేశారు. పరీక్షల అనంతరం 80 మందిని తదుపరి చికిత్సలు, వివిధ రకాల శస్త్రచికిత్సల కోసం మెడిసిటీ హాస్పిటల్‌కు రిఫర్ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.



శిబిరాన్ని ఉద్దేశించి పులిపలుపుల మహేష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను నిరంతరం నిర్వహిస్తున్నామని చెప్పారు. వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స పొందడం ద్వారా తీవ్రమైన ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని పేర్కొన్నారు. ప్రజలు ఉచిత వైద్య సేవలను నిర్లక్ష్యం చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెడిసిటీ హాస్పిటల్స్ వైద్య బృందం, స్థానిక మాజీ వార్డు కౌన్సిలర్ యాట శివ, నాలుగో వార్డు కౌన్సిలర్ బీజని కళ్యాణ్ మధు, మంగ నరసింహులు, పంతం కృష్ణ, ఖర్జీద్ పాషా, రాఘవ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు కల్లెం జితేందర్, మోరిగాడి సిద్ధులు, గుండ్రాజు నరసింహారావు, కొత్వాల్ సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధే లక్ష్యంగా తుర్రంవారిగూడెంలో గ్రామసభ

### డ్రైనేజీలు, పారిశుధ్యం, మౌలిక వసతుల మెరుగుదలపై గ్రామస్థుల విజ్ఞప్తి



**అశ్వాపురం, (సింగిడి ):**అశ్వాపురం మండలంలోని తుర్రంవారి గూడెం గ్రామపంచా యతీ కార్యాల యంలో బుధవారం గ్రామ సర్పంచ్ కుంజ జాన్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సమావేశంలో ఉప సర్పంచ్ ధరావత్ హర్ష, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై విస్తృతంగా చర్చించారు. గ్రామంలో ప్రస్తుతం వీధి దీపాల నిర్వహణ, తాగు నీటి సరఫరా వ్యవస్థ సంతృప్తిక "రంగా ఉందని గ్రామస్థులు అభిప్రాయ పడు తూ, ఈ సేవలను మరింత విస్తరించి అభివృద్ధి చేయాలని కోరారు. అలాగే మురుగునీటి సమస్య తలెత్తకుండా సైడ్ డ్రైనేజీలను క్రమం తప్పకుండా శుభ్రం చేయడంతో పాటు అవసరమైన ప్రాం తాల్లో కొత్త డ్రైనేజీల నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. పారిశుధ్యం, ఇతర మౌలిక వసతులను కూడా మరింత మెరుగుపరచాలని గ్రామస్థులు కోరా రు. ఈ సందర్భంగా సర్పంచ్ కుంజ జాన్ మాట్లాడుతూ, గ్రామంలో ఇప్పటికే కల్పిస్తున్న సౌకర్యాలను మరింత మెరుగుపరిచేందుకు కృషి చేస్తామని తెలిపారు. సైడ్ డ్రైనేజీలతో పాటు గ్రామంలోని అన్ని సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. గ్రామాభివృద్ధికి ప్రజల సహకారం ఎంతో అవసరమని, అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి ఎం. షారోన్, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## బస్వాపూర్ సొసైటీ విభజనకు

## త్వరలో పరిష్కారం: షబ్బీర్ అలీ హామీ



**బిక్కనూరు, (సింగిడి ):**బస్వాపూర్ సొసైటీ విభజన అంశంపై తెలంగా ణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీని బస్వాపూర్, గుర్జకుంట, రాగ్యాట్లపల్లి గ్రా మాల ప్రజాప్రతినిధులు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజే శారు. ఈ సందర్భంగా బస్వాపూర్ సర్పంచ్ తుడుం పద్మ సామి, గుర్జకుంట సర్పంచ్ సంతోష్, రాగ్యాట్లపల్లి సర్పంచ్ భాగ్యమ్మ నీలంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బాగారెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకుడు తుడుం ప్రదీప్ తదితరులు సొసైటీ విభజనతో పాటు పలు గ్రామాలకు సంబంధించిన సమస్యలను షబ్బీర్ అలీ దృష్టికి తీసుకెళ్లారు. వారి వినతిపై స్పందించిన షబ్బీర్ అలీ బస్వాపూర్ సొసైటీ విభజన సమస్యను అత్యంత త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే గ్రామాల అభివృద్ధికి సంబంధించిన పలు సమస్యలపై సంబంధిత అధికారులతో వెంటనే ఫోన్‌లో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు.

# భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసమే రీ సర్వే

### ప్రతీ రైతుకు హద్దులు పెట్టి..మ్యాఫ్ అందిస్తాం.

### సర్వే కు ప్రతీ రైతు తప్పకుండా రావాల్సిందే.

### కొంగర భూ రీసర్వే సభలో కలెక్టర్ దివాకర టి.ఎస్.



**పాలేరు (సింగిడి )::**ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ రీ సర్వే తో భూ సమస్యలు వంద శాతం పరిష్కారం అవుతుందని జిల్లా కలెక్టర్ టీ.ఎస్.దివాకర టి.ఎస్.పేర్కొన్నారు. మండలం లోని కొంగర లో బుధవారం జరిగిన భూ భారతి... భూ సర్వే గ్రామ సభలో పాల్గొన్నారు. రైతుల నుంచి వివిధ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. సర్వే యొక్క ఉద్దేశ్యం ను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు... పాసు పుస్తకంలో భూమి ఉండి... క్షేత్ర స్థాయిలో భూమి లేకున్నా.... పట్టాదారు లో భూమి తక్కువ ఉండి....సాగు ఎక్కువగా ఉన్నా...ఈ సమస్యలను ఈ సర్వే తో పరిష్కారం అవుతుందన్నారు. ప్రతీ రైతు భూ రీ సర్వేలో పాల్గొనాలని సూచించారు. 24 గంటల ముందే నోటీసులు అంధిస్తారని తెలిపారు. కావునా ప్రతీ రైతు సర్వేలో పాల్గొనాలని సూచించారు. సర్వే అనంతరం రైతులు అభ్యంతరం వ్యక్తం చేయవచ్చునన్నారు. 60 రోజులు అనంతరం భూ భారతిలో పెడతామన్నారు. వంద శాతం శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. రైతుల మధ్య వివాదం ఉన్న భూముల పై క్షేత్ర స్థాయిలో విచారణ నిర్వహించి డిస్పోజల్ కేటగిరి లో ఉంచుతామన్నారు. సర్వే మొత్తం ఆధునిక టెక్నాలజీ తో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కొలతల ద్వారా ఎంత వస్తే అంత ఇక శాశ్వతం అన్నారు. అందుకే ప్రతీ రైతు ఖచ్చితంగా ఉండాలన్నారు. భూ భారతి లో నమోదు అనంతరం హద్దులు నిర్ణయించి... కొత్త పట్టాదారు పాసు పుస్తకంతో పాటు మ్యాఫింగ్ తో సహా అందిసా మన్నారు. గ్రామాలలో ఉండే గెట్ల పంచాయతీ లు తొలిగిపోతాయ న్నారు. సర్వే పకడ్బందీగా జరగాలి..రైతులంతా సర్వేలో పాల్గొనాలని సూచించారు. అభ్యంతరాలు ఉంటే తహశీల్దార్ కు ఫిర్యాదు చేయవచ్చు నన్నారు. రైతులు సర్వేలో పాల్గొని వారి గెట్ల ను చూయిం చుకోవాలని సూచించారు. సర్వే అంతా బహిరంగంగానే జరుగుతుం దన్నా రు. ఇందులో ఎలాంటి దాపరికాలు ఉండవన్నారు. ప్రతీ ఒక్కరికి న్యాయం జరగాలని రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉద్దేశ్యమన్నారు. జిల్లాలో బేతుపల్లి, కాకరవాయి లో సర్వే శర వేగంగా జరుగుతుందన్నారు. కొంగర కు త్వరలోనే 10 ప్రత్యేక బృందాల ద్వారా సర్వే ప్రారంభిస్తారన్నారు. అనంతరం బుద్దారంలో నిర్మాణంలో గ్రామ సమాఖ్య భవనం ను పరిశీలించారు. మండలంలో నిర్మాణంలో ఉన్న 21 భవనాలను నెల లోపు పూర్తి చేయించాలని ఆదేశించారు. పనుల పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, తహశీల్దార్ పి.రాంప్రసాద్, ఎంపీడీఓ యం.యర్రయ్య. డిప్యూటీ తహశీల్దార్ కనకం నరసింహారావు, మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ ఆలస్యం మధుసూధర్రావు, సర్పంచ్ కృష్ణకుమారి, చిట్టూరి శ్రీనివాసరావు, నల్లాని మల్లిఖార్జున్రావు, ఈవూరి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జైల్ భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి



**(సింగిడి )::**కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్పొరేట్ అనుకూల, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 10న నిర్వహించే జైల్ భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం మండల అధ్యక్షులు పాదూరి శశిధర్రెడ్డి, సిఐటియు జిల్లా నాయకులు శ్రీనివాస్, రైతు సంఘం జిల్లా నాయకులు పాల్వాయి రామ్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకురాలు పెంటమల్ల సుకన్య, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు పాతూరి గోవర్ధన మాట్లాడారు. నాటి క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కార్పొరేట్ పెట్టుబడిదారులకు, మతోన్మాదులకు వ్యతిరేకంగా కార్మికులు, రైతులు, ప్రజలు సమైక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. లేబర్ కోడ్స్ ఫైనల్ రూల్స్ నోటిఫికేషన్, విత్తన చట్ట సవరణల ద్వారా కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజువారీ పని వేళలను 8 గంటల నుంచి 12 గంటలకు పెంచుకునేలా యాజమాన్యాలకు వెసులుబాటు ఇచ్చి, ఉద్యోగ భద్రతను ప్రశ్నార్థకం చేశారని విమర్శించారు. విదేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల వల్ల జీరో సుంకంతో దిగుమతులు పెరిగి దేశీయంగా పత్తి, ఇతర పంటల ధరలు పడిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. కనీస మద్దతు ధరల చట్టం, రుణ విమోచన చట్టం తీసుకురావడంలో కేంద్రం నిర్లక్ష్యం వహిస్తోందని చెప్పారు. ఉపాధి హామీ పథకాన్ని దెబ్బతీస్తూ, పేదలకు అందే ఆహార భద్రత బియ్యం కోటాపై కోతలు విధించేందుకు సవరణలు తెస్తున్నారని మండిపడ్డారు. ఈ ప్రజా వ్యతిరేక నిర్ణయాలను తిప్పికొట్టేందుకు ఈ నెల 10న చేపట్టే జైల్ భరోలో కార్మికులు, రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కోడిరెక్క వెంకన్న, పొదిళ్ల వెంకన్న, వెంకటేశం, సంపత్, శ్రీనివాస్ రెడ్డి, రైతులు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డి అభివృద్ధికి రూ.105 కోట్ల నిధులు







**కామారెడ్డిప్రతినిధి, (సింగిడి )::**కామారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వ సలహా దారు మహమ్మద్ అలీ షబ్బీర్ కృషితో వివిధ శాఖల నుంచి భారీ నిధులు మంజూరయ్యాయి. పంచాయతీరాజ్ శాఖ ద్వారా గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి రూ. 75.19 కోట్లు, రహదారుల అభివృద్ధికి ఆర్‌డబీ శాఖ ద్వారా రూ. 30 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా షబ్బీర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కను కలిసి సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే రహదారుల అభి వృద్ధి నిధులు మంజూరు చేసిన ఆర్‌డబీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. షబ్బీర్ అలీ మాట్లాడుతూ, కామారెడ్డి సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా మరిన్ని నిధులు తీసుకురావడానికి కృషి చేస్తున్నామని చెప్పారు. త్వరలోనే ఎఫ్‌డీఏ కింద రూ. 45 కోట్లు, సీఆర్ఆర్ కింద రూ. 32 కోట్లు కూడా మంజూరు కానున్నాయని వెల్లడించారు. గ్రామీణ మౌలిక సదుపాయాలు, రహదారులు, తాగునీటి వసతుల అభివృద్ధికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు షబ్బీర్ కృషిని అభినందించారు.

# తైబజార్ వేలం నిర్ణయం ఉపసంహరించుకోవాలి

### పేదలపై భారం మోపే నిర్ణయాలను విరమించాలి:

### సీపీఎం ఆందోళన



**ఆలేరు,(సింగిడి ):** ఆలేరు మున్సిపాలిటీ పాలకవర్గం ఇటీవల జరిగిన సాధారణ సమావేశంలో తీసుకున్న తైబజార్ వేలం, జేసీబీ కొనుగోలు వంటి నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం పార్టీ నాయకులు డిమాండ్ చేసారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కార్యాల యం ఎదుట సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, అనంతరం కమిషనర్ శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ నాయకుడు మోరీగాడి రమేష్ మాట్లాడుతూ తైబజార్‌ను వేలం వేసి తోపుడు బండ్ల వ్యాపారులు, ఫుట్‌పాత్ వ్యాపారులు, ద్విచక్ర వాహనాలపై కూరగాయలు తదితర వస్తువులు విక్రయించే చిరు వ్యాపారుల నుంచి రుసుములు వసూలు చేయాలన్న నిర్ణయం పేదలపై అదనపు భారం మోపేదిగా ఉందని విమర్శించారు. మున్సిపాలిటీ ఆదాయాన్ని పెంచుకునేందుకు ఇతర మార్గాలు అనేకం ఉన్నప్పటికీ, వాటిని పక్కనబెట్టి పేదలపై భారం మోపే చర్యలకు పాల్పడడం సరికాదన్నారు. ప్రైవేటు పాఠశాలలు, ఫంక్షన్ హాళ్ల నుంచి మున్సిపల్ చట్టాల ప్రకారం పన్నులు పూర్తిస్థాయిలో వసూలు చేస్తే లక్షల రూపాయల ఆదాయం సమకూరుతుందని తెలిపారు. ఇటీవల వివాదాస్పదంగా మారిన ఓ ప్రైవేటు పాఠశాలకు ఉన్నతాధికారుల జోక్యంతో కొలతలు వేసి పన్నులు విధించడం ద్వారా ఒక్క పాఠశాల నుంచే రూ. 2 లక్షల అదనపు ఆదాయం మున్సిపాలిటీకి వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుంచి వందలాది ఇళ్లను ఆన్‌లైన్ పన్ను వ్యవస్థలో నమోదు చేయడంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా సుమారు 150 నుంచి 200 ఇళ్లకు ఇప్పటికీ పన్నులు విధించలేని పరిస్థితి నెలకొందని అన్నారు. దాదాపు 20 ఏళ్లుగా పన్నులు చెల్లిస్తున్నప్పటికీ తమ ఇళ్లను మున్సిపల్ రికార్డుల్లో నమోదు చేయాలని కోరినా అధికారులు స్పందించడం లేదని, దీనివల్ల ప్రజలు ఇళ్ల కొనుగోలు, అమ్మకాల సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇదే నిర్లక్ష్యం మున్సి పాలిటీ ఆదాయానికి కూడా నష్టం కలిగిస్తోందన్నారు. కచ్చా కాలువలు, మురు గు కాలువల పూడిక తొలగింపు కోసం సుమారు రూ. 50 లక్షలతో జేసీబీ కొనుగోలు చేయాలన్న ప్రతిపాదన పై కూడా అభ్యంతరం వ్యక్తం చేశారు. ముందుగా పట్టణంలో ఎంత మేరకు కచ్చా కాలువలు, జేసీబీ అవసరమయ్యే మురుగు కాలువలు ఉన్నాయో సమగ్రంగా పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఆలేరు ప్రధాన రహదారి పై దుమ్ము, ధూళి కార ణంగా ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వర్షాకాలంలో నీరు నిలిచి రహదారి చెరువును తలపిస్తోందన్నారు. దీనికి శాశ్వత పరిష్కారంగా ప్రధాన రహదారికి ఇరువైపులా ఫుట్‌పాత్‌లు నిర్మించి బీటీ రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ వద్ద ఉన్న నిధులను ముందుగా మురుగు కాలువలు, సీసీ రోడ్లు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి విని యోగించి, ఆ తర్వాతే జేసీబీ వంటి యంత్రాల కొనుగోలుపై ఆలోచిం చాలని కోరారు. తైబజార్ వేలం నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోకపోతే పట్ట ణంలోని చిరు వ్యాపారులందరినీ సమీకరించి మున్సిపల్ కార్యాలయాన్ని దిగ్బంధనం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నా యకులు వడ్డేమాన్ బాలరాజు, ఘనగాని మల్లేష్, మోరీగాడి అశోక్, మోరీగాడి అంజయ్య, ఘనగాని రాజు, డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు యాసారపు ప్రసాద్, బర్ల సిద్ధులు, ఎం.డి. ఖలీల్, ఘనగాని కిష్టయ్య, ఎం.డి. మతీన్ తదితరులు పాల్గొన్నారు.

# వెలువర్తిలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



**వలిగొండ, (సింగిడి ):** మండలంలోని వెలువర్తి గ్రామంలో అంగన్వాడి సెక్టర్ 1,2,3 కేంద్రాలల్లో అంగన్వాడీ టీచర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది, బుధవారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ చేముడాల అనిత, పంచాయతీ కార్యదర్శి గిరిబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది మాట్లాడుతూ తల్లిపాలలో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో తల్లిపాలు ఎంతో కీలకమని వివరించారు. బిడ్డ పుట్టిన మొదటి గంటలోనే తప్పని సరిగా ముర్రుపాలు పట్టాలని పిలుపునిచ్చారు. తల్లిపాలు బిడ్డను అనేక రకాల వ్యాధుల నుండి కాపాడుతా యని,ముర్రు పాలు పిల్లల జీర్ణశయాన్ని శు భ్రపరుస్తాయని తెలిపారు. తల్లి, బిడ్డల ఆరోగ్యమే సమాజానికి ముఖ్యాంశమని, ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు నీలమ్మ, రమాదేవి, సంధ్యారాణి, ఏఎన్ఎం సాలమ్మా, ఆశ వర్కర్లు, లక్ష్మీనర్సమ్మ, నమ్రత, లక్ష్మి, బాలింతలు, గర్భిణీలు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

### సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి: సీఐ ఎల్లయ్య



**అశ్వాపురం, (సింగిడి )::**నేటి డిజిటల్ యుగంలో రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అశ్వాపురం సీఐ సీహెచ్. ఎల్లయ్య సూచించాంరు. బుధవారం అశ్వాపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వ హించారు. ఈ సందర్భంగా సీఐ ఎల్లయ్య మాట్లాడుతూ, అపరి చిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, అను మానాస్పద లింకులను నమ్మవద్దని సూచించారు. ఓటీపీ, బ్యాం కు ఖాతా వివరాలు, ఏటీఎం పిన్ వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు వెల్లడించవద్దని చెప్పారు. సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నందున అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఆన్‌లైన్ మోసాలకు గురైన వెంటనే జాతీయ సైబర్ హెల్ప్‌లైన్ 1930 కు ఫిర్యాదు చేయడంతో పాటు, సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదిం చాలని సూచించారు. అప్రమత్తతతో వ్యవహరిస్తే సైబర్ నేరాలను చాలా వరకు నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ముత్యాలరావు, అశ్వాపురం సర్పంచ్ బానోత్ సోదరులాల్, ఉప సర్పంచ్ తుళ్లూరి ప్రకాశ్‌రావు, పంచాయతీ కార్యదర్శి యాకూబ్, పోలీసు సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలు బిడ్డకు రక్షణ కవచం

### అంగన్వాడి కేంద్రంలో

### తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాలు



**ఆళ్లపల్లి, (సింగిడి ):** మండల కేంద్రంలోని మర్కోడు గ్రామపంచాయితి అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మర్కోడు గ్రామపంచాయతీ సర్పంచ్ సుతారి రమాదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం అంతకుమించి బాలింతకు ఆరోగ్యకరం అని తెలిపారు. అంగన్వాడీ ఉపాధ్యాయులు పూనెం జయశ్రీ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే పాలు ఇవ్వడం ప్రారంభించాలి. అలా రెండేళ్ల వయసు వరకు ఇయ్యవచ్చు మొదటి ఆరు నెలలు పూర్తిగా తల్లిపాలే ఇవ్వాలి కానీ కొంతమంది తల్లులు తల్లిపాలు ఇస్తే శరీరాకృతిలో తేడా వస్తుందని భావించి శిశువుకు డబ్బా పాలు పట్టించడం వలన బిడ్డ ఎదుగుదల పై ప్రభావం చూపుతుందని, అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయి అని హెచ్చరించారు. పాలు పట్టించడం వల్ల శిశువు తో పాటు తల్లి కూడా ఆరోగ్యంగా ఉంటారు అని గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు అవగాహన కల్పించారు . ఈ వారోత్సవల్లో కొమరం జయచిత్ర, చందా కోటమ్మ, కొమరం సుభద్ర, కొమరం విజయ, పడిగ శిరీష, కొమరం లీలావతి, కోరం పద్మ, అంగన్వాడీ ఆయా కోరం లక్ష్మి మహిళా మండల నాయకురాలు ఎస్ కే పర్వీన్ గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు

## పాఠశాలలో డ్రైనేజీ సమస్యకు



## తక్షణ పరిష్కారం: బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి



**ఎల్బీ నగర్, (సింగిడి ):** గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని త్యాగరాజ నగర్ కాలనీలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో డ్రైనేజీ సమస్య కారణంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తాజా మాజీ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి కి స్థానికులు తెలియజేయగా, వెంటనే స్పందించారు. అనంతరం జలమండలి అధికారులతో కలిసి పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించి, డ్రైనేజీ సమస్యను యుద్ధప్రాతిపదికన పరిష్కరింపజేశారు. సమస్యకు తాత్కాలిక పరిష్కారం కాకుండా శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని, భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జలమండలి సిబ్బంది శ్రీకాంత్, ప్రశాంత్, త్యాగరాజ నగర్ కాలనీ వాసులు మురళి, శ్రవణ్, బీజేపీ నాయకులు రఘునందన్ జోషి, వంశీ గంగపుత్ర, పవన్, రాము తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ నాయకురాలు జ్యోతి యాదవ్ భర్త అకస్మిక మృతి



**అల్వాల్,(సింగిడి ):** కాంగ్రెస్ మహిళ సీనియర్ నాయకురాలుటెంపుల్ అల్వాల్ 192 వ డివిజన్ అధ్యక్షులు జ్యోతియాదవ భర్త శ్రీనివాస్ యాదవ్ అకాల మృతి పట్ల వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజే స్తున్నాము. శ్రీనివాస్ యాదవ్ ఆత్మకు శాంతి కలగాలని పలువురు పార్టీలకు అతీతంగా ప్రగాఢ సానుభూతి తెలిపారు

## హెచ్‌పీవీ టీకాతో గర్భాశయ క్యాన్సర్‌కు శాశ్వత రక్షణ సాధ్యం: డాక్టర్ సృజన

అర్హులైన ప్రతి బాలిక తప్పనిసరిగా వ్యాక్సిన్ తీసుకోవాలి..

అపోహలకు తావివ్వొద్దు: డాక్టర్ సృజన



**బిజినపల్లి, (సింగిడి):** గర్భాశయ క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధిని హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిలోమా వైరస్) టీకాతో సమర్థవంతంగా నివారించవచ్చని, 9 నుంచి 14 సంవత్సరాల వయస్సు గల ప్రతి బాలిక తప్పనిసరిగా ఈ వ్యాక్సిన్ తీసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ సృజన పిలుపునిచ్చారు. బిజినపల్లి పట్టణంలోని ఆల్ సెయింట్స్ మోడల్ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థినులు, ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా హెచ్‌పీవీ వైరస్ కారణంగా గర్భాశయ క్యాన్సర్ వచ్చే ప్రమాదం అధికంగా ఉంటుందని, అయితే సరైన వయస్సులో టీకా తీసుకుంటే భవిష్యత్తులో ఆ వ్యాధి బారిన పడకుండా రక్షణ పొందవచ్చని స్పష్టం చేశారు. హెచ్‌పీవీ టీకాపై ప్రజల్లో ఉన్న అపోహలను పూర్తిగా వీడి, అర్హులైన ప్రతి బాలిక వ్యాక్సిన్ తీసుకునేలా తల్లిదండ్రులు ముందుకు రావాలని సూచించారు. మహిళల ఆరోగ్య సంరక్షణలో హెచ్‌పీవీ టీకా ఒక కీలక రక్షణ కవచమని, ముందస్తు జాగ్రత్తే ప్రాణాలను కాపాడగలదని ఆమె పేర్కొన్నారు. అనంతరం విద్యార్థినులు అడిగిన ప్రశ్నలకు డాక్టర్ సృజన సమగ్రంగా సమాధానాలు ఇచ్చి టీకా వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. హెల్త్ సూపర్‌వైజర్ బి. సుజాత, ఏఎన్ఎం శ్వేత, ఆశా కార్యకర్తలు వెన్నెమ్మ, సరస్వతి కూడా విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల యాజమాన్యం జోసెఫ్, రీతూ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో బాలికల ఆరోగ్య పరిరక్షణకు ఇటువంటి అవగాహన కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాలకు విచ్చేసి హెచ్‌పీవీ టీకా ప్రాధాన్యాన్ని వివరించిన డాక్టర్ సృజనతో పాటు వైద్య సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొని ఆసక్తిగా విని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

## సైబర్ మోసాలకు అడ్డుకట్ట వేయాలి

సైబర్ భద్రతపై అవగాహన అవసరం: జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర.




**బిక్కనూరు, (సింగిడి)::** ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. బిక్కనూరు మండలంలో నిర్వహించిన సైబర్ నేరాల అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఫోన్ కాల్స్, నకిలీ లింకులు, ఓటీపీలు, క్యూ ఆర్ కోడ్లు, సోషల్ మీడియా ద్వారా సైబర్ మోసాలు జరుగుతున్నాయని తెలిపారు. అపరిచితులకు బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం, డెబిట్, క్రెడిట్ కార్డు వివరాలు, ఓటీపీలు, యూపీఐ పిన్ వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఇవ్వవద్దన్నారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం బిక్కనూరు గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజల్లో సైబర్ భద్రతపై అవగాహన పెరగడం చాలా అవసరమన్నారు. అనుమానాస్పద ఫోన్ కాల్స్, సందేశాలు, లింకులను నమ్మవద్దని, ఏదైనా అనుమానం వచ్చిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటే సైబర్ నేరాలను చాలా వరకు నివారించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా సైబర్ మోసాల నుంచి రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించి, సైబర్ భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డి ఎస్ పి మధుసూదన్, గ్రామ సర్పంచ్ రేఖ సుదర్శన్, సీఐ జగదం నరేష్, ఎస్‌ఐ అనిల్, పోలీస్ సిబ్బంది, ఉప సర్పంచ్, వార్డ్ సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు, ప్రజాప్రతినిధులు, వివిధ పాఠశాలల విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ నోటిఫికేషన్

## విడుదల చేయాలి

బి ఏనుగు రాకేష్ రెడ్డి.



**మిర్యాలగూడ (సింగిడి):** 317 జీవోను రద్దు చేసి వెంటనే మెగా డీఎస్సీ ని ప్రకటించి నిరుద్యోగులకు న్యాయం చేయాలని బి ఆర్ఎస్ పార్టీ నాయకులు ఏనుగు రాకేష్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మిర్యాలగూడలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ రేవంత్ పాలనలో తెలంగాణలో విద్యా వ్యవస్థ కుంటుపడిందని రెండు లక్షల ఉద్యోగాలను చెప్పిన రేవంత్ నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లారని అధికారంలోకి రాగానే 317 జీవో రద్దు చేస్తామని ఇప్పటివరకు మాట ఎత్తడం లేదని విమర్శించారు. సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి ఓపిఎస్ తీసుకొస్తామని చెప్పి మాట తప్పారని ఉద్యోగులకు ఇప్పటివరకు పిఆర్సీ కూడా ప్రకటించలేదని ఆరు పీఆర్సీలు పెండింగ్ లో ఉన్నాయని దుయ్యబట్టారు. తెలంగాణకు ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రిని కూడా కేటాయించలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎన్.బి .ఆర్ ఫౌండేషన్ చైర్మన్ నల్లమోతు సిద్ధార్థ,బి ఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఎండి. ఇలియాస్ ఖాన్, పెద్ది శ్రీనివాస్ గౌడ్, ఎండి. మగ్దుం పాషా,ధనావత్ చిట్టిబాబు నాయక్, గంగుల బిక్షం యాదవ్, యర్రమల్ల దినేష్,ఎండి. షోయబ్,చీదల్ల వెంకటేశ్వర్లు, పునాటి లక్ష్మీనారాయణ,భూక్య రాంబాబు, ఎక్క మనిదీప్, వల్లపట్ల వినోద్,గయాస్, గంట శ్రావణ్ రెడ్డి,రఫీ, వీర నాయక్,వద్య శివ నాయక్, రామావత్ వినోద్ నాయక్,షేక్ మస్తాన్,అలీం, దోనేటి సైదులు, తుమ్మల ఫణి కుమార్,కాతోజు వినోద్ కుమార్, కోర్రపిడత లింగారాజు,మహిమూద్, రాజేష్, షేక్ ఫయాజ్, నాగరాజు,అబిలాస్,వినయ్,నాగయ్య,చిన్న నాయక్, తదితరులు పాల్గొన్నారు.




# తక్షణమే పీఆర్సీ ప్రకటించాలి

– టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పి. శ్రీనివాస్ గౌడ్





**పెబ్బేరు (సింగిడి):** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను తక్షణమేపరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్ యుటీఎఫ్)జిల్లా కార్యదర్శి పి. శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీఎస్‌యూటీఎఫ్ పెబ్బేరు మండల యూనియన్ సభ్యత్వ నమోదు ప్రచార కార్యక్రమంలో భాగంగా రెండు రోజుల పాటు జిల్లా కార్యదర్శి పి. శ్రీనివాస్ గౌడ్ జెడ్పీ,ఎంపీపీఎస్, మోడల్ స్కూల్, కేజీబీవీతో పాటు పలు ప్రభుత్వ విద్యాసంస్థలను సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో సమావేశమై విద్యారంగ సమస్యలు,ప్రభుత్వ పాఠశాలల పరిస్థితులు, ఉద్యోగుల పెండింగ్ డిమాండ్లపై విస్తృతంగా చర్చించారు. సమస్యల పరిష్కారం కోసం టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టనున్న దశలవారీ పోరాట కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు ఐక్యంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నూతన పీఆర్సీని ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ ఉద్యోగుల పెండింగ్ ఏరియర్స్ బిల్లులనువెంటనే చెల్లించాలని కోరారు. జీఓ నెం. 25ను సవరించి ప్రతి ప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని, 40 మంది విద్యార్థులు ఉన్న ప్రతి పాఠశాలలో తరగతికో ఉపాధ్యాయుడిని కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. సీపీఎస్ విధానాన్ని పూర్తిగా రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మోడల్ స్కూల్ ఉపాధ్యా యులకు 010 హెడ్ ఆఫ్ అకౌంట్ ద్వారా వేతనాలు చెల్లించాలని, కేజీబీవీ ఉద్యోగులకు టైమ్ స్కేల్ అమలు చేసి సమ్మె కాలపువేతనాలను విడుదల చేయా లని కోరారు. అలాగే మోడల్ స్కూల్, గురుకుల, కేజీబీవీ ఉపాధ్యాయులు, ఉద్యోగులకు హెల్త్ కార్డుల సౌకర్యాన్ని వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో దశలవారీ ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఆగస్టు 7న పాఠశాల స్థాయిలో నిరసన కార్యక్రమాలు, ఆగస్టు 12, 13 తేదీల్లో మండల కేంద్రాల్లో వినతిపత్రాల సమర్పణ, ఆగస్టు 19న జిల్లా కేంద్రంలో ధర్నా, చివరిగా ఆగస్టు 29న రాష్ట్ర రాజధానిలో మహాధర్నా నిర్వహిం చనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పిలు పునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు తిమ్మప్ప, చెన్నకేశవ్, మండల అధ్యక్షుడు నరసింహ, ప్రధాన కార్యదర్శి నరసింహ, మండల కోశాధికారి శ్రీనివాసులు, నాయకులు వెంకటేశ్వర్లు, సమీ, గోపాల్ నాయక్ పాల్గొన్నారు.

## కార్పొరేట్ సేవలో పాలకులు.. కార్మికుల బడ్జెట్‌లో మొండిచేయి..

మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి..

సిఐటియు మండల కన్వీనర్ మురిహరి రఘు డిమాండ్..

**దమ్మపేట, (సింగిడి)::** కేంద్ర బడ్జెట్‌లో మధ్యాహ్న భోజన కార్మికులకు నిధులు కేటాయించకుండా, జీతాలు పెంచడంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సిఐటియు మండల కన్వీనర్ మురిహరి రఘు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ) జగపతిని కలిసి, ఈ నెల 10వ తేదీన దేశవ్యాప్తంగా నిర్వహించనున్న 'జైలు భరో' ఆందోళన కార్యక్రమ పోస్టర్‌ను విడుదల చేసి, వినతిపత్రం సమర్పించారు. మురిహరి రఘు మాట్లాడుతూ.. ఆకాశాన్నం టుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెంచడంలో పాలకులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కష్టజీవుల సంక్షేమాన్ని తుంగలో తొక్కి, కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నాయని విమర్శించారు. నేడు దేశాన్ని ప్రజాప్రతి నిధులు కాకుండా బహుళజాతి కంపెనీల దిగ్గజాలు శాసిస్తున్నాయని, 'క్విట్ ఇండియా' స్ఫూర్తితో కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా కార్మికులంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని, మధ్యాహ్న భోజన కార్మికులకు తక్షణమే రూ. 10,000 వేతనం పెంచాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో వంటకు అవసరమైన గ్యాస్ సిలిండర్లు,



కోడిగుడ్ల ఖర్చును ప్రభుత్వమే నేరుగా భరించాలన్నారు. ఈ న్యాయమైన డిమాండ్ల సాధనకై ఈ నెల 10న జరిగే 'జైలు భరో' కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కవులూరి రామకృష్ణ, సత్యవతి, జయ, ఈశ్వరమ్మ, సుగుణ, సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బాలికల పాఠశాలకు ప్రింటర్ ను అందజేసిన సార్ప్ స్వచ్ఛంద సంస్థ



**యాదాద్రి భువనగిరి(సింగిడి):** ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు సౌకర్యార్థం కోసం'సార్ప్' స్వచ్ఛంద సంస్థసొసైటీ ఫర్ యాక్షన్ విత్ రూరల్ పూర్ ఎన్జీఓ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఒక ప్రింటర్‌ను విరాళంగా అందజేశారు. లండన్‌లో నివసిస్తున్న ఎన్. అనిత తన భర్త డాక్టర్ ఎన్. రాజేంద్రప్రసాద్ జన్మదినాన్ని (జూలై 20) పురస్కరించుకుని ఈ ప్రింటర్‌ను స్పాన్సర్ చేశారు. సార్ప్ ఎన్జీఓ అధ్యక్షురాలు డాక్టర్ బి. ప్రమీల ఆధ్వర్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులకు, విద్యార్థినులకు ఈ ప్రింటర్‌ను అందించారు. ఈ సందర్భంగా ఎన్. అనిత పంపిన సందేశాన్ని నిర్వాహకులు చదివి వినిపించారు. సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న ఈ రోజుల్లో పాఠశాలకు ప్రింటర్ ఎంతో అవసరమని, ఇది బాలికల విద్యాభివృద్ధికి, వారి సాధికారతకు ఎంతో ఉపయోగపడుతుందని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ కౌన్సిలర్లు సుచరిత రెడ్డి, బర్రె పూజిత, సఖి సెంటర్ కౌన్సిలర్ వెన్నెల ప్రోగ్రాం మేనేజర్ సూరి నేని శ్రీనివాస్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని చదువుకోవాలని, సమాజంలో ఆదర్శప్రా యమైన మహిళలుగా ఎదగాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా బాలికల సాధికారత, విద్య యొక్క ప్రాముఖ్యత మరియు మహిళలు, పిల్లల రక్షణ కోసం ప్రభుత్వం అందుబాటులో ఉంచిన టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ల వినియోగంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. పాఠశాల విద్యాభివృద్ధికి మద్దతుగా నిలిచి ప్రింటర్ అందించిన ఎన్. అనిత – డాక్టర్ రాజేంద్రప్రసాద్ దంపతులకు 'సార్ప్' ఎన్జీఓ ప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేక హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్‌మా స్టర్, సార్ప్ సంస్థ వ్యవస్థాపకులు బర్రె సుదర్శన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేష్, సార్ప్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఇల్లందు జడ్జి స్వరూపకు న్యాయ శాస్త్రంలో డాక్టరేట్

**ఇల్లందు (సింగిడి):** ఇల్లందు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న స్వరూప కమటం కు ప్రతిష్టాత్మకమైన ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి న్యాయ విభాగంలో గౌరవ డాక్టరేట్ పట్టా దక్కింది. అరుదైన ఘనత సాధించిన ఇల్లందు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జ్ స్వరూప కాటం ఉస్మానియా యూనివర్సిటీ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, గైడ్ ప్రొఫెసర్ ఎస్. బి. ద్వారకానాథ్ , ప్రొఫెసర్ విజయలక్ష్మి చేతుల మీదుగా ఇటీవల కాలంలో స్వీకరించినారు. ఈ సందర్భంగా బుధవారం ఇల్లందు బార్ అసోసియేషన్ సభ్యులు కోర్టు సిబ్బంది మెజిస్ట్రేట్ స్వరూప కమటం ను కోర్టు హాల్ నందు పుష్పగుచ్చం ఇచ్చి శాలువాతో ఘనంగా సత్కరించి, కేక్ కటింగ్ చేయించినారు, అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ వారు మాట్లాడుతూ, ప్రతిష్టాత్మక ఉస్మానియా యూనివర్సిటీ నుండి డాక్టరేట్ సాధించడం ఆనందంగా ఉందని నా తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్లే ఈ స్థితికి చేరగలిగానని, ప్రతి ఒక్కరు కష్టపడి చదివి వారి భవిష్యత్తుకు వాళ్ళు పునాదులు వేసుకోవాలని, ఇతర విషయాలపై దృష్టి పెట్టకుండా విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని, విద్య మంచి మార్గంలో నడిపిస్తుందని మార్గదర్శకులుగా మారాలని ఈ సందర్భంగా తెలిపినారు. అనంతరం బార్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ ఇంతటి ప్రతిష్టాత్మక ఘనత సాధించిన జడ్జిగారు మన ఇల్లందు కోర్టుకు రావడం గర్వకారణం అని వారు ఎంచుకున్న అంశం రైట్ టు ఈక్వల్ ప్రొటెక్షన్ ఆఫ్ లా అండర్ ది కాన్స్టిట్యూషన్ ఆఫ్ ఇండియా అనే అంశం ఎంచుకొని సాధించిన తీరు స్ఫూర్తిదాయకమని, అంకిత భావానికి నిదర్శనమని, వారు ఎల్.ఎల్.బి, ఎల్ ఎల్ ఎం విద్యను అభ్యసించే సమయంలో మూడు బంగారు పతకాలు సాధించి విశ్వవిద్యాలయాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చారని వారు ఇల్లందు కోర్టుకు రావడం సేవలు అందించడం మన అందరి అదృష్టంగా భావిస్తున్నామని ముమ్ముందు ఇలాంటి మరెన్నో డాక్టరేట్లు సాధించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరుకుంటున్నామని తెలిపినారు. ఈ కార్యక్రమంలో జడ్జి తో పాటు ఇల్లందు బార్ అసోసియేషన్ సభ్యులు సీనియర్, జూనియర్, మహిళ న్యాయవాదులు, డి.ఎస్.పి





వెంకన్నబాబు కోర్టు సూపరిడెంట్ శ్రీరంగం రామకృష్ణ, కోర్టు సిబ్బంది పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పండరి–స్వరూప కుటుంబానికి

## శ్రీ మాత సేవ ట్రస్ట్ అండ

**కామారెడ్డిప్రతినిధి, (సింగిడి):** కామారెడ్డి జిల్లా పెద్దకొడప్గల్‌కు చెందిన పండరి--స్వరూప కుటుంబం వరుస విషాదాలు, అనారోగ్య సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ విషయం తెలుసుకున్న శ్రీ మాత సేవ చారిటబుల్ ట్రస్ట్ "నెలకొక మంచి పని--నెలకొక సేవ" కార్యక్రమంలో భాగంగా బుధవారం కుటుంబానికి 25 కిలోల బియ్యం, కిరాణా సామగ్రి, కూరగాయలను అందజేసింది. భవిష్యత్తులోనూ ఆర్థికంగా అండగా ఉంటామని ట్రస్ట్ సభ్యులు హామీ ఇవ్వగా, దాతలు ముందుకు వచ్చి ఈ కుటుంబాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.



## డిగ్రీ స్పెషల్ ఫేజ్ అడ్మిషన్ల కోసరాచివరి అవకాశం



**కొడంగల్, ఆగష్టు 05(నినాదం) :** ప్రభుత్వ డిగ్రీ కళాశాల కొడంగల్ లో దోస్త్ ద్వారా డిగ్రీ చివరి ఫేజ్ అడ్మిషన్ల ప్రక్రియ రేపటి నుండి ప్రారంభమవుతుందని ప్రిన్సిపాల్ డా. బి. శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 06 వ తేదీ నుండి 11 వ తేదీ వరకు రిజిస్ట్రేషన్స్ , మరియు 12వ తేదీ వరకు వెబ్ ఆప్షన్స్ కి అవకాశం ఉంటుం దని ఆయన తెలి పారు. దోస్త్ చివరి దశలో చేరిన విద్యా ర్థులకు కూడా స్కాలర్షిప్ మరియు ఫీజు రీఇంబర్స్ మెంట్ వర్తిస్తుందని ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకో వాలని తెలియ జేశారు. బి. ఎ, బి. కామ్, కంప్యూటర్ అప్లికేషన్స్ బి. ఎస్సీ బి. జడ్. సి , ఎం. పి. సి , ఎం. పి. సి. ఎస్ మరియు బి. ఎస్సీ హెల్త్ కేర్ కో ంర్సులలో సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇతర వివరాలకు కళాశాలలోని కార్యాలయంలో సంప్రదిం చాలన్నారు.

## గుడుంబా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

2 లీటర్ల గుడుంబా స్వాధీనం



**ఎల్బీనగర్, (సింగిడి):** గుట్టుచప్పుడు కాకుండా గుడుంబా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన సంఘటన సరూర్ నగర్ పోలీసులు బుధవారం చోటుచేసుకుంది. సిఐ శ్రీశైలం యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చంపాపేట్ అంజి రెడ్డి నగర్ హాట్స్ ప్రాంతంలో దేపావత్ వెంకట్ రామ్ అక్రమంగా నాటుసారా నిల్వ చేసి విక్రయిస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు దాడి నిర్వహించినట్లు తెలిపారు. దాడి సమయంలో సుమారు 2 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొన్నట్లు వెల్లడించారు. నిందితుడిపై తెలంగాణ నిషేధ చట్టం, ఇతర సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేయబడినట్లు తెలిపారు. దర్యాప్తు కొనసాగు తోందన్నారు. సరూర్‌నగర్ పోలీసులు, పోలీస్ స్టేషన్ పరిధిలో నాటుసారా తయారీ, నిల్వ, రవాణా, విక్రయాలలో పాల్గొనే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలు గమనించిన వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

## పెద్ది సంతాప సభకు విస్తృత ఏర్పాట్లు

స్థలాన్ని పరిశీలించిన పోచంపల్లి, ఎర్రబెల్లి.



**నల్లబెల్లి, (సింగిడి)** ఈ నెల 10న నిర్వహించనున్న మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ పెద్ది సుదర్శన్‌రెడ్డి సంతాప సభ విజయ వంతానికి బీఆర్ఎస్ పార్టీ నాయకులుఏర్పాట్లను ముమ్మరం చేశారు. సభా వేదిక ఏర్పాట్లు, ప్రజల రాకపోకలు, పార్కింగ్, ఇతర మౌలిక సదుపాయాలపై బుధవారం పార్టీ ముఖ్య నేతలు స్థల పరిశీలన నిర్వహించి నిర్వాహకులకు పలు సూచనలు చేశా రు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ,ప్రజానాయకుడు పెద్ది సుదర్శన్‌రెడ్డికి నివాళిగా నిర్వహించే సంతాప సభకు పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కూడా ఏర్పాట్లను పరిశీలించి సభను క్రమబద్ధంగానిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలనిసూచించారు. స్థల పరిశీలనలో వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవ్‌రెడ్డి, మాజీ చైర్మన్ మర్రి యాదవ్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భరత్‌కుమార్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు డాక్టర్ బానోత్ సారంగపాణి, జిల్లా, మండల, గ్రామస్థాయి పార్టీ నాయకులు పాల్గొ న్నారు. సభకు భారీగా ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున అన్ని ఏర్పాట్లు పకడ్బందీగాచేపడుతున్నట్లు నాయకులు తెలిపారు.

తుమ్మలచెరువులో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు..

## తల్లి పాలతోనే శిశువులకు సంపూర్ణ ఆరోగ్యం

–సీడీపీఓ మంగతార




**అశ్వాపురం, (సింగిడి):** తల్లి పాలు శిశువులకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించే అమూల్యమైన ఆహారమని బూర్గంపాడు ప్రాజెక్టు సీడీపీఓ మంగతార అన్నారు. అశ్వాపురం మండలంలోని తుమ్మలచెరువు రైతు వేదికలో బుధవారం మల్లెలమడుగు సెక్టార్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీడీపీఓ మంగతార మాట్లాడుతూ, పుట్టిన తొలి గంటలోనే శిశువుకు తల్లిపాలు ఇవ్వడం ఎంతో అవసరమని తెలిపారు. తొలి ఆరు నెలల పాటు శిశువుకు తల్లిపాలు మాత్రమే అందించాలని, అవి శిశువు ఎదుగుదలకు, వ్యాధి నిరోధక శక్తి పెంపొందించేందుకు ఎంతో దోహదపడతాయని వివరించారు. తల్లిపాల ప్రాముఖ్యతపై గర్భిణీలు, బాలింతలకు అవగాహన కల్పించా రు. అనంతరం గర్భిణీకి సంప్రదాయబద్ధంగా శ్రీమంతం నిర్వహించి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ ధనలక్ష్మి, తుమ్మలచెరువు గ్రామ సర్పంచ్ నరేష్, గ్రామ కార్యదర్శి దినేష్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణీలు, బాలింతలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎండోమెంట్ భూముల్లో

## అక్రమ దుకాణాల తొలగింపు



**అమరచింత, (సింగిడి)** ఆత్మకూరు పురపాలక సంఘం పరిధిలో ఉన్న ఎండోమెంట్ భూముల్లో అక్రమంగా వెలిసిన దుకాణాలను బుధవారం మున్సిపల్ అధికారులు తొలగించారు. పురపాలక సంఘం పరిధిలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) ఆదేశాల మేరకు, ఎండోమెంట్ భూముల్లో ఏర్పాటు చేసిన అక్రమ దుకాణాలను మున్సిపల్ రెవెన్యూ సిబ్బంది సంయు క్తంగా తొలగించారు. ఎండోమెంట్ భూములను ఆక్రమించి ఏర్పాటు చేసిన మిగిలిన దుకాణాల యజమానులను కూడా వెంటనేఆక్రమణలను తొలగించి, స్థలాలను ఖాళీ చేయాలని అధికారులు హెచ్చరించారు. ప్రభుత్వ/ఎండోమెంట్ భూములను ఎటువంటి అనుమతులు లేకుండా ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామనిఅధికారులు స్పష్టం చేశారు. ప్రజలు ప్రభుత్వ భూములను ఆక్రమించకుండా, అధికారుల సూచనలను పాటించాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ సీత్యా నాయక్, టీపీ పి ఓ రాజు, మున్సిపల్ రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# అనుష్క కోసం 12 ఏళ్ల క్రితం....



ఈ శుక్రవారం విడుదల కానున్న తెలుగు చిత్రాల్లో 'కింగ్ జాకీ క్వీన్' ఒకటి. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్, ప్రచార చిత్రాలతో ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించిన ఈ పీరియాడిక్ క్రైమ్ డ్రామాపై సినీ వర్గాల్లో మంచి అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రానికి మరో ప్రత్యేకత ఏమిటంటే.. ప్రముఖ దర్శకుడు కిరణ్ కుమార్ చివరిసారిగా దర్శకత్వం వహించిన సినిమా ఇదే కావడం. దీక్షిత్ శెట్టి, శశి ఓదెల, యుక్తి తరేజా ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని ఎస్ఎల్వీ సినిమాస్ బ్యానర్‌పై నిర్మాత సుధాకర్ చెరుకూరి నిర్మించారు. ఈ నేపథ్యంలో తాజాగా జరిగిన ప్రమోషనల్ కార్యక్రమంలో దర్శకుడు సందీప్ రెడ్డి వంగా వెల్లడించిన ఆసక్తికర విషయం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సందీప్ రెడ్డి వంగా మాట్లాడుతూ.. దర్శకుడు కిరణ్ కుమార్ ఈ కథను దాదాపు 12 ఏళ్ల క్రితమే సిద్ధం చేశారని వెల్లడించారు. అప్పట్లో ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో తెరకెక్కించాలని భావించిన కిరణ్ కుమార్, కథానాయిక పాత్ర కోసం స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టిని దృష్టిలో పెట్టుకుని స్క్రిప్ట్ రూపొందించారట. అయితే వివిధ కారణాలతో ఆ ప్రాజెక్ట్ అప్పట్లో సెట్స్‌పైకి వెళ్లలేదు. దీంతో సినిమా నిలిచిపోయినా, దర్శకుడు మాత్రం కథను వదిలిపెట్టకుండా కాలానికి అనుగుణంగా మార్పులు చేస్తూ మరింత బలోపేతం చేశారని తెలిపారు. మొదట అనుష్క కోసం రాసిన పాత్ర, కాలక్రమేణా మార్పులు చెంది ఇప్పుడు నటి యుక్తి తరేజా పోషిస్తున్న పాత్రగా రూపుదిద్దుకుందని సమాచారం. దీంతో ఎన్నో ఏళ్లుగా దర్శకుడు మనసులో ఉన్న కథ చివరకు 'కింగ్ జాకీ క్వీన్' రూపంలో ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సినిమాతో మరో ఆసక్తికర అంశం కూడా ఉంది. ప్రముఖ దర్శకుడు శ్రీకాంత్ ఓదెల సోదరుడు శశి ఓదెల ఈ చిత్రంతో హీరోగా సినీ రంగంలోకి అడుగుపెడుతున్నారు. తొలి చిత్రంతోనే పీరియాడిక్ క్రైమ్ డ్రామా వంటి విభిన్న కథను ఎంచుకోవడం ఆసక్తికరంగా మారింది. ఇక హీరో దీక్షిత్ శెట్టి కీలక పాత్రలో నటిస్తుండగా, యుక్తి తరేజా కథానాయికగా కనిపించనున్నారు. ఈ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు పూర్ణచంద్ర తేజస్వి సంగీతాన్ని అందించారు.

కింగ్ జాకీ క్వీన్.. మూవీపై ఆసక్తికర అంశం


singidinews@gmail.com

సిన్మా సింగిడి
Cinma Singidi

శుక్రవారం
7-8-2026


## తండ్రి నాగబాబుతో వరుణ్ తేజ్ బరి
# కూతురు నీహారికి నిర్మాతగా యదువంశీ మూవీ



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ నటించిన తాజా చిత్రం 'కొరియన్ కనకరాజు' ఆగస్టు 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదలకు ముందు చిత్రబృందం జోరుగా ప్రమోషన్స్ నిర్వహిస్తుండగా, తాజాగా ఓ ఇంటర్వ్యూలో వరుణ్ తేజ్ తన తదుపరి సినిమా గురించి ఆసక్తికర విషయాన్ని వెల్లడించారు. తొలిసారిగా తన తండ్రి నాగబాబుతో కలిసి ఒకే సినిమాలో నటించబోతున్నట్లు ప్రకటించారు. నాగబాబు నటుడిగా చిరంజీవి, పవన్ కళ్యాణ్, రామ్ చరణ్, సాయిధరమ్ తేజ్ సహా మెగా కుటుంబానికి చెందిన పలువురు హీరోలతో కలిసి నటించారు. అయితే ఆశ్చర్యకరంగా తన కుమారుడు వరుణ్ తేజ్‌తో మాత్రం ఇప్పటివరకు పూర్తి స్థాయి సినిమాలో స్క్రీన్ షేర్ చేసుకోలేదు. గతంలో 'హ్యాండ్స్ అప్' సినిమాలో వరుణ్ తేజ్ చిన్ననాటి పాత్రలో కనిపించినప్పటికీ, తండ్రీకొడుకుల మధ్య ఒక్క కాంబినేషన్ సీన్ కూడా లేదు. ఇప్పుడు ఆ లోటును 'బరి' సినిమా భర్తీ చేయనుంది. ఈ చిత్రంలో వరుణ్ తేజ్, నాగబాబు కలిసి నటించడమే కాకుండా, ఇద్దరి మధ్య కీలకమైన కాంబినేషన్ సీన్లు కూడా ఉంటాయని వరుణ్ వెల్లడించారు. తండ్రితో కలిసి నటించడం తనకు ఎంతో ప్రత్యేకమైన అనుభూతిగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఇక 'బరి' చిత్రాన్ని నాగబాబు కుమార్తె నిహారిక కొణిదెల నిర్మిస్తున్నారు. 'కమిటీ కుర్రాళ్లు' సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు యదు వంశీ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు.

## ఆవారపన్‌కు సీక్వెల్ రెడీ




2007లో విడుదలైన క్లాసిక్ యాక్షన్ డ్రామా 'ఆవారపన్'. ఇమ్రాన్ హష్మీ, దిశాపటానీ నటించిన ఈ సినిమాకు 19 ఏళ్ల తర్వాత సీక్వెల్ తెరకెక్కింది. ఆగస్టు 14న ఈ 'ఆవారపన్ – 2' థియేటర్లలో సందడి చేయనుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. శివమ్ పండిట్ పాత్రలో ఇమ్రాన్ తిరిగి వస్తున్నాడంటూ వీడియోను పంచుకుంది. నితిన్ కక్కర్ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందింది.

## గత సినిమాలతో
# గుణపాఠం నేర్చుకున్నా

### ప్రేక్షకులు ఆదరించే కథలకు ప్రాధాన్యం ఇస్తా: వరుణ్ తేజ్

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ నటించిన తాజా చిత్రం 'కొరియన్ కనకరాజు' విడుదలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ఆయన వరుస ప్రమోషన్ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన గత సినిమాల పరాజయాలపై వరుణ్ తేజ్ ఎంతో నిజాయితీగా స్పందించారు. 'మట్కా', 'ఆపరేషన్ వాలెంటైన్', 'గాండీవధారి అర్జున' వంటి చిత్రాలు ఎందుకు ఆశించిన ఫలితాన్ని అందుకోలేక పోయాయో తనదైన విశ్లేషణ చేశారు. భారీ అంచనాల మధ్య విడు దలైన 'మట్కా' సినిమాపై మొదటి నుంచే ప్రేక్షకుల్లో పెద్దగా ఆసక్తి కనిపించలేదని వరుణ్ తెలిపారు. ట్రైలర్ విడుదలైన తర్వాత వచ్చిన స్పందన చూసి, తన నుంచి ప్రేక్షకులు అలాంటి సీరియస్ కథలను ఆశించడం లేదనే విషయం అర్థమైందన్నారు.



సినిమాలోని కంటెంట్ ప్రేక్ష కులను థియేటర్లకు రప్పించే స్థాయిలో లేకపోవడం కూడా పరాజయానికి ప్రధాన కారణమని ఆయన అంగీకరించారు. రొటీన్‌కు భిన్నంగా కొత్త తరహా సినిమాలు చేయాలనే ఉద్దేశంతో 'మట్కా', 'గాండీవధారి అర్జున', 'ఆపరేషన్ వాలెంటైన్' వంటి చిత్రాలు చేశానని వరుణ్ చెప్పారు. అయితే ఆ సినిమాలు కేవలం ఒక వర్గం ప్రేక్షకులకు మాత్రమే నచ్చాయని, అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయాయని వెల్లడించారు. ఒక సినిమా చిన్న పిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు అందరూ కలిసి చూసి ఎంజాయ్ చేయగలిగేలా ఉండాలి. ప్రేక్షకులు థియేటర్‌కు వస్తే ముందుగా వినోదాన్నే ఆశిస్తారు. ఆ బేసిక్ పాయింట్‌ను నేను మిస్ అయ్యాను అని వరుణ్ తేజ్ అన్నారు. గత వైఫల్యాలు తనకు విలువైన పాఠాలు నేర్పాయని, ఇకపై వినోదానికి పెద్దపీట వేసే కథలను ఎంచుకుంటానని చెప్పారు. తన కొత్త చిత్రం 'కొరియన్ కనకరాజు' పూర్తి స్థాయి ఎంటర్‌టైనర్‌గా ఉంటుందని వరుణ్ తేజ్ ధీమా వ్యక్తం చేశారు.

## చకచకా రాకా మూవీ షూటింగ్
# మెటర్నిటీ బ్రేక్‌లో దీపికా పడుకొణె

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పడుకొణె ప్రస్తుతం మాతృత్వాన్ని ఆస్వాదిస్తూ కుటుంబంతో సమయం గడుపుతున్నారు. అయితే ఆమె మెటర్నిటీ బ్రేక్ కారణంగా అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'రాకా' షూటింగ్‌కు ఆటంకం ఏర్పడుతుందనే ప్రచారం జరుగుతున్న వేళ, చిత్రబృందం అందుకు పూర్తి భిన్నంగా ముందుకు సాగుతున్నట్లు సమాచారం. సినీ వర్గాల సమాచారం ప్రకారం, దీపికా మెటర్నిటీ బ్రేక్‌ను ముందుగానే దృష్టిలో పెట్టుకుని చిత్రబృందం షూటింగ్ షెడ్యూల్‌ను ఎంతో కచ్చితంగా ఎ÷–లాన్ చేసింది. ఆమె అందుబాటులో ఉన్న సమయంలోనే ఎక్కువ భాగం సన్నివేశాలను పూర్తి చేయడంతో ప్రస్తుతం షూటింగ్ ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగుతోంది. దీపికా విరామంలో ఉన్న రోజుల్లో ఇతర ప్రధాన నటీనటులతో చిత్రీకరణ నిర్వహిస్తూ ఒక్క రోజు కూడా వృథా కాకుండా మేకర్స్ జాగ్రత్తలు తీసుకున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం దీపికా పడుకొణెకు సంబంధించిన షూటింగ్ దాదాపు పూర్తయినట్లు సమాచారం. చిన్న సన్నివేశాలు మాత్రమే ఉండగా, వాటిని తర్వాతి దశలో చిత్రీకరించే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఆమె వ్యక్తిగత జీవితానికి, సినిమా నిర్మాణానికి మధ్య ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మేకర్స్ పక్కా ప్లానింగ్ చేసినట్లు తెలుస్తోంది. 'రాకా' సినిమాలో దీపికా పడుకొణె పాత్ర కథకు అత్యంత కీలకమని సమాచారం.

షూటింగ్ ప్రారంభ దశలోనే ఆమె సన్నివేశాలకు ప్రాధాన్యం ఇచ్చి పూర్తి చేసినట్లు తెలుస్తోంది. భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో 'రాకా' ఒకటిగా నిలిచింది. భారీ తారాగణం, హై టెక్నికల్ స్టాండర్డ్స్, భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమాపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. షూటింగ్ అనుకున్న షెడ్యూల్ ప్రకారమే కొనసాగుతుండటంతో, సినిమా విడుదల కూడా నిర్ణయించిన సమయానికే జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.




Printed,published & Owned by P. Sunitha Reddy on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Dussa Shivaprasad, PRGI.NO. TGTEL/26/A4370. Cell 8179799090